RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:237 హైదరాబాద్, గురువారం, 17 ఏప్రిల్ 2025 పేజీలు: 12 వెల: 1.00

## ఆలయ బోర్డులలో ముస్లింలకు చోటిస్తారా? కేంద్రానికి సుప్రీం సూటిప్రశ్న

న్యూఢిల్లీ: పార్లమెంటు ఆమోదించిన వక్ఫ్ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారంనాడు విచారణ సందర్భంగా



సుప్రీంకోర్టు కేంద్రానికి కీలక ప్రశ్నలు వేసింది. సుమారు 73 పిటిషన్లపై సీజేఐ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మసానం విచారణ చేపట్టింది.

ఈ సందర్భంగా కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లలో ముస్లిమేతరలను చేర్చే నిబంధనను ధర్మాసనం ప్రస్తావించింది. హిందూ ఎండోమెంట్ బోర్డులలో ముస్లింలు భాగం కావడానికి కేంద్రం అనుమతిస్తుందా అని సూటిగా ప్రశ్నించింది. దీనిపై కేంద్రం తరఫు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేంద్రం నుంచి వివరణ తీసుకునేందుకు సమయం ఇవ్వాలని కోరారు. పార్లమెంటులో విస్తృత చర్చ జరిగిన తర్వాతే చట్టానికి ఆమోదం లభించిందని, జాయింట్ పార్లమెంటు కమిటీ పరిశీలన తర్వాతే ఉభయ సభల్లో తిరిగి ఆమోదం పొందిందని తుషార్ మెహతా చెప్పారు. తిరిగి సీజేఐ మరో ప్రశ్న లేవనెత్తుతూ, వక్ఫ్ బై యూజర్‌ను ఒక జడ్జిమెంట్‌లో కోర్టు సమర్థిస్తే అది ఇప్పుడు చెల్లుబాటుకాదా? అని అడిగారు. వక్ఫ్‌లోని చాలా మసీదులు 13,14,15వ శతాబ్దానికి చెందినవి కూడా ఉన్నాయని, వాటి డాక్యుమెంట్లు తెమ్మంటే ఎలా సాధ్యం? అని ప్రశ్నించారు.

ఒక పిటిషనర్ తరఫు సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వి తన వాదన వినిపిస్తూ, దేశంలో 8 లక్షల వక్ఫ్ ప్రాపర్టీలలో వక్ఫ్ బై యూజర్ ప్రాపర్టీలు 4 లక్షలు ఉన్నాయన్నారు. దీనిపై సీజేఐ జోక్యం చేసుకుంటూ ఢిల్లీ హైకోర్టు కూడా వక్ఫ్ భూమిలో కట్టామంటున్నారని, అన్ని వక్ఫ్ బై యూజర్‌లు తప్పని తాము చెప్పుడం లేదని, అయితే కొన్ని సహజమైన ఆందోళనలను కూడా ఉన్నాయని అన్నారు. దీనిపై సింఘ్వి స్పందిస్తూ, మొత్తం చట్టం మీద తాము స్టే కోరడం లేదని, కొన్ని ప్రొవిజన్లపై స్టే కోరుతున్నామని అన్నారు. సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తన వాదనలో కొత్త చట్టం కలెక్టర్‌కు ఇచ్చే అధికారాలను ప్రశ్నించారు. కలెక్టర్ కూడా ప్రభుత్వంలో భాగమైనప్పుడు ఆయన న్యాయమూర్తి పాత్ర పోషిస్తే అది రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. అనంతరం విచారణను సుప్రీంకోర్టు గురువారానికి వాయిదా వేసింది.

## భూ భారతి చట్టం ప్రారంభంపై మంత్రి కీలక ప్రకటన

%తెలంగాణలో పలు రకాల భూ సమస్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో రానున్న రోజుల్లో అనేక భూ సమస్యలకు పరిష్కారం లభించనుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న భూ భారతి చట్టం, భూముల సమస్యలను పరిష్కారానికి ఒక మంచి అవకాశమని మంత్రి తెలిపారు. ఈ క్రమంలో రేపటి (ఏప్రిల్ 17) నుంచి ఈ చట్టాన్ని పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ చట్టం ద్వారా, భూముల సంబంధిత వివాదాలను త్వరగా పరిష్కరించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

భూ భారతి చట్టం, తెలంగాణలో భూముల సమస్యలను పరిష్కరించడానికి రూపొందించబడింది. ఈ చట్టం ప్రకారం, రాష్ట్రంలోని పలు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా రెవెన్యూ సదస్సులు నిర్వహించబడతాయి. ఈ సదస్సుల ద్వారా, ప్రజలకు భూ భారతి చట్టం గురించి అవగాహన కల్పిస్తారు. ఈ నేపథ్యంలో నారాయణ్‌పేట జిల్లా మద్దూర్ మండలంలోని కాజాపురం గ్రామంలో ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించడానికి మంత్రి శ్రీనివాసరెడ్డి సిద్ధమయ్యారు.

ప్రయోగాత్మకంగా ప్రారంభం

ఈ చట్టాన్ని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా భూముల సంబంధిత వివాదాలను పరిష్కరించడానికి ప్రభుత్వం తీసుకునే చర్యలు ప్రజలకు స్పష్టంగా తెలియజేస్తారు. దీంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించబడతాయి. ఈ సదస్సులలో, ప్రజలు తమ భూములపై



ఉన్న సమస్యలను, వివాదాలను ప్రభుత్వ అధికారులకు తెలియజేయవచ్చు. ఈ విధంగా, ప్రజలతో నేరుగా సంబంధం ఏర్పడుతుంది. వారి సమస్యలను త్వరగా పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తుంది.

కోర్టు పరిధిలో ఉన్న భూములు

భూ భారతి చట్టం ప్రకారం, కోర్టు పరిధిలో ఉన్న భూముల మినహా ప్రతి దరఖాస్తును మే 1వ తేదీ నుంచి పరిష్కరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇది ప్రజలకు ఒక మంచి అవకాశం, ఎందుకంటే వారు తమ భూములపై ఉన్న వివాదాలను త్వరగా పరిష్కరించుకోవచ్చు. ఈ చట్టం ద్వారా తెలంగాణలో భూముల సమస్యలు తగ్గుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. భూములపై ఉన్న వివాదాలు, అన్యాయాలు, ఇతర సమస్యలు పరిష్కరించబడితే, ప్రజలు సంతోషంగా జీవించగలుగుతారు.

## ఎస్‌ఎల్‌బీసీలో సహాయక చర్యల పూర్తికి సాంకేతిక కమిటీ ఏర్పాటు

హైదరాబాద్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యల పూర్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ( నిర్వహించిన సమీక్షలో తీసుకున్న నిర్ణయం మేరకు కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు కమిటీ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్డీఆర్‌ఎఫ్ పదో బెటాలియన్ కమాండెంట్, ఎన్జీఆర్ఐ డైరెక్టర్, జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎన్సీఎస్ డైరెక్టర్, బీఆర్వో కల్నల్ పరీక్షిత్ మెహ్రా, తెలంగాణ పీసీసీఎఫ్, ఎన్డీఆర్‌ఎఫ్ అదనపు డీజీ, సీడీవో సీఈ, నాగర్‌కర్నూల్ కలెక్టర్, ఎస్పీ, ఎస్‌ఎల్‌బీసీ చీఫ్ ఇంజినీర్, నిపుణులు సాంకేతిక కమిటీలో సభ్యులుగా ఉండనున్నారు.

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలోని చివరి 30 నుంచి 50 మీటర్ల క్రిటికల్ జోన్‌లో ఉన్న రాతి పొరల స్థితి కారణంగా ఆ ప్రాంతంలో ఎలాంటి సహాయక చర్యలు చేపట్టవద్దని జీఎస్ఐ సూచించింది. ఈ నేపథ్యంలో ఆ క్రిటికల్ జోన్‌లో అనుసరించాల్సిన కార్యాచరణ, వ్యూహాల రూపకల్పనకు ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. నిర్దిష్ట గడువులోగా ఆరుగురు కార్మికుల మృతదేహాలను వెలికితీసి కుటుంబసభ్యులకు అప్పగించేలా కమిటీ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. సహాయక చర్యల్లో అపాయం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపైనా కమిటీ సూచనలు చేయాల్సి ఉంటుంది.

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న వారి కోసం 55 రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. చివరి 50 మీటర్ల ప్రాంతం వరకు 800 టన్నుల ఇనుము, 1200 క్యూబిక్ మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలను తొలగించారు. మిగిలిన ప్రాంతం చాలా ప్రమాదకరంగా ఉందని, మిగిలిన వ్యర్థాలను తొలగిస్తే ప్రతికూల పరిణామాలు ఎదుర్కోవాల్సి రావొచ్చని జీఎస్ఐ హెచ్చరించింది. సహాయక చర్యలు కొనసాగిస్తే సహాయక చర్యల్లో పాల్గొనే వారికి ప్రమాదం ఎదురుకావచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. వీటన్నింటి నేపథ్యంలో అవసరమైన అనుమతులు తీసుకొని సహాయక చర్యలు చేపట్టాలని కమిటీకి ప్రభుత్వం సూచించింది.

## అమెరికాలో పండించే డ్రగ్స్.. హైదరాబాద్‌లో స్వాధీనం

హైదరాబాద్: అమెరికాలోని ఫ్లోరిడా, కాలిఫోర్నియాలో పండించే ఓజీ కుష్ అనే డ్రగ్స్‌తో పాటు విదేశీ మద్యం బాటిళ్లను తెలంగాణ ఎస్టీఎఫ్ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఇద్దరు డ్రగ్స్ పెడ్లర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి చెప్పారు. స్కోడా కారు, గంజాయి, సింథటిక్ డ్రగ్స్, చరస్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాంపల్లి ఎక్సైజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

## భారీగా పట్టుబడ్డ డ్రగ్స్.. పోలీసులకు చిక్కిన మాజీ సీఎస్ పుత్రుడు

హైదరాబాద్, ఏప్రిల్ 16: డ్రగ్స్ (సరఫరాను నిర్మూలించేందుకు పోలీసులు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు సోదాలతో డ్రగ్స్ సరఫరా చేసే వారి గుండెల్లో గుబులు పుట్టిస్తూనే ఉన్నారు. తెలంగాణను ( డ్రగ్స్ రహితంగా మార్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పక్కా సమాచారాలతో వెళ్లి మరీ డ్రగ్స్‌లను స్వాధీనం చేసుకోవడంతో పాటు.. డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిని పట్టుకుంటున్నారు. డ్రగ్స్ కేసులో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని ఓ పక్క పోలీసులు హెచ్చరిస్తుంటే.. మరోవైపు ఇదేమీ తమకు పట్టవన్న చందంగా డ్రగ్స్ సరఫరాకు పాల్పడుతున్నారు కొందరు వ్యక్తులు.

తాజాగా నగరంలో మరోసారి పెద్ద ఎత్తున డ్రగ్స్ పట్టుబడటం సంచలనంగా మారింది. అయితే డ్రగ్స్ సరఫరా చేస్తున్న వ్యక్తి గురించి తెలిసి పోలీసులు షాక్ అవ్వాల్సిన పరిస్థితి. ఇంతకీ సిటీలో ఎక్కడ డ్రగ్స్ పట్టుబడింది.. డ్రగ్స్ తీసుకొచ్చిన వ్యక్తి ఎవరు.. ఎక్కడి నుంచి తెచ్చాడో ఇప్పుడు చూద్దాం.

నగరంలోని గచ్చిబౌలి పరిధిలోని శరత్ సిటీ మాల్‌లో పెద్దఎత్తున డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. అక్కడ డ్రగ్స్ సరఫరా జరుగుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం వెళ్లింది. దీంతో ఎంతో రహస్యంగా డ్రగ్స్‌ను పట్టుకునేందుకు అక్కడకు చేరుకున్నారు. ప్రతీ ఒక్కరిపై నిఘా పెట్టారు. చివరకు ఓ వ్యక్తి అనుమానస్పదంగా కనిపించడంతో అతడిని పట్టుకుని



సోదాలు జరిపారు. ఆ వ్యక్తి వద్ద భారీ ఎత్తున డ్రగ్స్ లభ్యమైంది. నిందితుడు ఎక్కడి నుంచి వచ్చాడు అనేదానిపై పోలీసులు ఆరా తీశారు.

అయితే మాదకద్రవ్యాలతో పట్టుబడ్డ వ్యక్తి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వాడని.. అంతే కాకుండా ఉత్తరప్రదేశ్ మాజీ సీఎస్ కుమారుడిగా గుర్తించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అసలు ఎక్కడి నుంచి డ్రగ్స్ తీసుకువచ్చాడు.. ఎవరికి డ్రగ్స్ సరఫరా చేస్తున్నాడనే దానిపై సంబంధిత అధికారులు ఆరా తీస్తున్నారు. అధికారుల విచారణలో ఎలాంటి విషయాలు బయటకు వస్తాయో వేచి చూడాలి. అయితే ఎక్కడిక్కడ డ్రగ్స్ సరఫరాను అడ్డుకుంటున్నప్పటికి ఎక్కడో చోట ఇలా డ్రగ్స్ పట్టుబడటం పోలీసులకు పెను సవాల్ అనే చెప్పుకోవచ్చు.

## కాంగ్రెస్ నేతలపై ఈడీ చార్జిషీట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16,

నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలకు ఈడీ షాకిచ్చింది. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలపై ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఛార్జ్‌షీట్‌ను విచారించాలా లేదా అన్న విషయంపై ఈనెల 25వ తేదీన కోర్టు నిర్ణయిం తీసుకుంటుంది. ఇప్పటికే ఢిల్లీ , లక్నో , ముంబై లోని నేషనల్ హెరాల్డ్ ఆస్తుల స్వాధీనానికి ఈడీ నోటీసులు ఇచ్చింది. రూ. 700 కోట్ల ఆస్తులను సీజ్ చేయడానికి నోటీసులు అంటించారు.నేషనల్ హెరాల్డ్ కేసులో 2021 నుంచి ఈడీ విచారణ జరుగుతోంది. ఛార్జ్‌షీట్‌లో కాంగ్రెస్ సీనియర్ నేతలు సుమన్ దూబే , శ్యామ్ పిట్రోడా పేరును కూడా చేర్చారు. సోనియా, రాహుల్‌పై మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేశారు. యంగ్ ఇండియా కంపెనీతో రూ.2000 కోట్ల నేషనల్ హెరాల్డ్ ఆస్తులను లాక్కునే కుట్ర జరిగిందని ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ ఛార్జ్‌షీట్‌పై కాంగ్రెస్ న్యాయ సలహాలను తీసుకుంటోంది. నేషనల్ హెరాల్డ్ కేసు డైయిరీ వివరాలు ఇవ్వాలని ఈడీని కోర్టు ఆదేశించింది. ఈడీ ఛార్జ్‌షీట్‌పై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రధాని మోదీ , అమిత్‌షా బెదిరింపు రాజకీయాలకు ఇది నిదర్శనమన్నారు కాంగ్రెస్ నేత జైరాం రమేశ్. కాంగ్రెస్ నాయకత్వం ఈ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఆస్తుల స్వాధీనం పెద్ద కుట్ర అని ఆరోపించారు.మరోవైపు గుర్‌గ్రామ్ భూముల కేసులో ఈడీ విచారణకు హాజరయ్యారు ప్రియాంకాగాంధీ భర్త రాబర్ట్ వాద్రా. గతంలో గురుగ్రామ్‌లో మూడున్నర ఎకరాల భూమిని రాబర్ట్ వాద్రా ఏడున్నర కోట్ల రూపాయలకు కొని, 58 కోట్లకు ఆఒఈకు అమ్మేశారు. ఈ వ్యవహారంలో 51 కోట్ల రూపాయల లబ్ధి వాద్రాకు చేకూర్చినట్లు ఇఆ ఆరోపించింది. ఈ కేసులో ఈనెల 8న విచారణకు గైర్హాజరయ్యారు వాద్రా. దీంతో మరోసారి నోటీసులు జారీ చేశారు ఈడీ అధికారులు. రాజకీయ ప్రతీకారంతోనే తనపై కేసు పెట్టారని వాద్రా ఆరోపించారు. ప్రజల తరపున నేను మాట్లాడిన ప్రతీసారి తన గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. ఇఆ అడిగిన అన్ని ప్రశ్నలకు జవాబులు చెప్పినట్టు తెలిపారు.

## స్మితా సబర్వాల్ పోస్టుపై చట్టప్రకారం ముందుకెళ్తాం: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశాలను తప్పకుండా పాటిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టే చెప్పిందన్నారు. బుధవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు."నకిలీ వీడియోస్, ఫొటోలు అన్ని వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నాయి. భూముల విషయం కోర్టుల పరిధిలో ఉన్నందున ఏమీ మాట్లాడలేం. ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ చేసిన పోస్టుపై చట్టప్రకారం ముందుకు వెళ్తాం. నెమళు జనావాసాల్లోకి రావడం సర్వసాధారణం. భాజపా, భారాస కలిసే కుట్ర పన్నుతున్నట్లు భావిస్తున్నాం. రాష్ట్ర భాజపా నేతలు ఇచ్చిన తప్పుడు సమాచారంతోనే ఈ భూములపై ప్రధాని మోదీ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తున్నారు. కూలగొడితే కూలిపోయే ప్రభుత్వం కాదు మాది" అని శ్రీధర్‌బాబు అన్నారు.

భారత శక్తి
VOICE OF INDIAN

# ట్రంప్..తిరోగమనం...

ఏది ఏమైనప్పటికీ తమ దేశం నుంచి అధిక సుంకాలను వసూలు చేస్తున్న ప్రపంచ దేశాల నుంచి అదే స్థాయిలో టారిఫ్‌లను వసూలు చేస్తామని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ఇప్పుడు మడమ తిప్పుతున్నారు. ట్రంప్ టారిఫ్‌లు కేవలం ఆర్థిక సమస్యలతోనే కాకుండా, అంతర్జాతీయ సంబంధాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. కెనడా, మెక్సికో, యూరోపియన్ యూనియన్ వంటి సన్నిహిత మిత్ర దేశాలు కూడా ఈ సుంకాల బారిన పడ్డాయి. ఈ దేశాలు ట్రంప్ చర్యలకు ప్రతీకార చర్యలుగా అమెరికన్ ఉత్పత్తులపై సుంకాలు విధించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితి వాణిజ్య యుద్ధాలకు దారితీసి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత బలహీనపరిచే ప్రమాదం ఉందని అంటున్నారుతొలుత ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 10 నుంచి అమల్లోకి రావాల్సిన ప్రతీకార సుంకాల ఆదేశాలను 90 రోజులపాటు నిలిపివేశారు. ఆ వెంటనే టారిఫ్‌ల నుంచి 20 సెక్టార్ల ఉత్పత్తులకు మినహాయింపు కల్పించారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాలను గమనిస్తే విషయం ఇట్టే అర్థమవుతున్నదివాస్తవానికి ఇతర దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న వస్తువులపై భారీ టారిఫ్‌లను విధించడం వల్ల తమ దేశంలో స్వదేశీ వస్తువుల కొనుగోళ్లు పుంజుకుంటాయని ట్రంప్ భావించారు. అలాగే, అమెరికాలో ఇబ్బడిముబ్బడిగా పరిశ్రమలు పుట్టుకొచ్చి, తమ పౌరులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనేది ట్రంప్ ఆలోచన. అందుకే ముందూవెనకా ఆలోచించకుండా ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలను ప్రకటించేశారు. ఈ క్రమంలోనే చైనాపైనా టారిఫ్‌లు వేశారు.ట్రంప్ దెబ్బకు ఇతర దేశాలన్నీ కాళ్లబేరానికి వస్తే, చైనా మాత్రం అమెరికా అధ్యక్షుడికి దీటుగా బదులిస్తూ రావడం, దీంతో ఆ దేశంపై అమెరికా మరింత పెద్ద మొత్తంలో సుంకాలు ప్రకటిస్తూ రావడం చకచకా జరిగిపోయాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్ విధానంతో అనేక దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై భారీ సుంకాలు (టారిఫ్‌లు) విధిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కలవరపెడుతున్నారు. ఈ చర్యలు అమెరికన్ ఉద్యోగాలను, స్థానిక పరిశ్రమలను కాపాడతాయని ట్రంప్ వాదిస్తున్నప్పటికీ, ఇవి గ్లోబలైజేషన్ యుగానికి ముగింపు పలుకుతున్నాయని పలు దేశాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ టారిఫ్‌లు అంతర్జాతీయ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపుతూ, దేశాలను స్థానిక ఉత్పత్తులపై ఆధారపడేలా మార్చుతున్నాయి.1991లో సోవియట్ యూనియన్ పతనం తర్వాత ప్రారంభమైన గ్లోబలైజేషన్ యుగం ఇప్పుడు ముగిసినట్లేనని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ అభిప్రాయపడ్డారు. ట్రంప్ విధించిన టారిఫ్‌లు అనేక దేశాలను తమ దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి దారితీస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో, అమెరికా కూడా తన స్థానిక వనరులపై ఆధారపడే అవసరం ఏర్పడుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనా, భారత్, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలు ఈ టారిఫ్‌లను ఎదుర్కొనేందుకు తమ ఆర్థిక విధానాలను సవరించుకుంటున్నాయి.ట్రంప్ తన టారిఫ్ విధానాన్ని సమర్థిస్తూ, అమెరికన్ పౌరులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కాపాడటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. విదేశీ దిగుమతులపై అధిక సుంకాలు విధించడం ద్వారా స్థానిక తయారీ రంగాన్ని ప్రోత్సహించాలని, విదేశీ ఉత్పత్తుల ఆధిపత్యాన్ని తగ్గించాలని ఆయన భావిస్తున్నారు. అయితే, ఈ చర్యలు అమెరికన్ వినియోగదారులకు వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తాయని, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలను దెబ్బతీస్తాయని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. ఉదాహరణకు, చైనా నుంచి దిగుమతి అయ్యే ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ విడిభాగాలపై విధించిన సుంకాలు అమెరికన్ కంపెనీల ఉత్పత్తి ఖర్చులను పెంచుతున్నాయి.రెండు దేశాల మధ్య జరిగిన సుంకాల యుద్ధం పర్యవసానంగా ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అమెరికా మార్కెట్లపైనా ఈ ప్రభావం కనిపించింది.అంతర్జాతీయంగా నెలకొన్న ఈ గందరగోళ పరిస్థితుల వల్ల మదుపరుల కోట్లాది సంపద ఆవిరైపోయింది. అమెరికాలో ద్రవ్యోల్బణం పెరగడంతోపాటు ఆర్థికమాంద్యం ఛాయలు కనిపించాయి. ట్రంప్ వైఖరిపై ఆయన మద్దతుదారులే బహిరంగంగా పెదవి విరిచారు. దీనికి యావత్ ప్రపంచం సాక్ష్యంగా నిలిచింది. ఇంతా జరిగిన తర్వాత ట్రంప్‌కు తత్వం బోధపడినట్టు అర్థమవుతున్నది.ప్రపంచ దేశాలు ముఖ్యంగా చైనాతో పంతానికిపోతే అమెరికాకే నష్టమన్న విషయాన్ని ట్రంప్ గ్రహించినట్టు తెలుస్తున్నది. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్ల విషయంలో అమెరికాకు చైనా అతిపెద్ద సరఫరదారుగా ఉంది. గత ఏడాది లెక్కల ప్రకారం చైనా 88 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను, కంప్యూటర్లను అమెరికాకు ఎగుమతి చేసింది. అమెరికన్లు ఉపయోగించే ప్రతి 10 స్మార్ట్‌ఫోన్లలో నాలుగు, అలాగే ప్రతి మూడు కంప్యూటర్లలో ఒకటి చైనాలో ఉత్పత్తి అయిందే.చైనాలోనే సుమారు 80 శాతం ఐఫోన్లు ఉత్పత్తవుతున్నాయి. వీటిలో 58 శాతం అమెరికాకే ఎగుమతవుతున్నాయి. దాదాపు 8 బిలియన్ డాలర్ల విలువైన ప్లాస్టిక్ కుర్చీలను చైనా నుంచే అమెరికా దిగుమతి చేసుకుంది. అలాగే, పిల్లల ఆటవస్తువులను కూడా అగ్రరాజ్యానికి పెద్దమొత్తంలో చైనా ఎగుమతి చేస్తున్నది. ఇటువంటి తరుణంలో ఆ దేశంపై పెద్ద మొత్తంలో టారిఫ్‌లు అమలు చేస్తే అంతిమంగా అమెరికన్ల జేబులకే చిల్లు పడుతుంది.ఇప్పటికిప్పుడు అమెరికాలో ఈ వస్తువుల ఉత్పత్తి సాధ్యపడదు. అందుకే ట్రంప్ టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గినట్టు అర్థమవుతున్నది.

# చర్చగా మారిన ఆర్పీ సిసోడియా బదిలీ వ్యవహారం

## ముక్కుసూటితనమే మైనస్సా

విజయవాడ, ఏప్రిల్ 16,

ఏపీ రెవిన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా బదిలీ వ్యవహారం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికారుల మధ్య ఆధిపత్య పోరులో భాగంగా సిసోడియాను అప్రధాన్య పోస్టుకు బదిలీ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. గత నెలలో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సిసోడియా స్వాగతోపన్యాసం చేయాల్సి ఉన్నా ఆయన మాట్లాడలేదు.ఇటీవలి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆర్పీ సిసోడియా స్వాగతోపన్యాసం చేయకుండా కొందరు సిఎంఓ అధికారులు అడ్డు పడ్డారనే ప్రచారం జరిగింది. అప్పట్లోనే ఏపీ ఐఏఎస్ అధికారుల్లో ఏదో జరుగుతోందనే ప్రచారం జరిగింది. తాజాగా సిసోడియాకు స్థాన చలనం కలగడంతో అధికారుల మధ్య ఆధిపత్య పోరు చర్చనీయాంశంగా మారింది.పలువురు ఐఏఎస్ అధికారుల్ని బదిలీ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోస్టింగ్ లేకుండా ఖాళీగా ఉన్న పలువురు అధికారులకు కూడా పోస్టింగ్ దక్కింది. వీరిలో వైసీపీ హయంలో చక్రం తిప్పిన అధికారులు కూడా ఉన్నారు. జగన్ హయంలో సిఎంఓలో పనిచేసిన అధికారులతో పాటు పలువురు కన్ఫర్డ్ ఐఏఎస్‌లకు పోస్టింగ్ దక్కింది. ఈ క్రమంలో స్పెషల్ సీఎస్‌గా ఉన్న అధికారిని అప్రధాన్య పోస్టుకు బదిలీ చేయడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.ప్రస్తుతం ఏపీ సీఎస్‌గా 1992 బ్యాచ్‌కు చెందిన విజయానంద్ ఉన్నారు. ఈ ఏడాది నవంబర్‌లో విజయానంద్ పదవీ విరమణ చేస్తారు. ప్రభుత్వం మరికొంత కాలం ఆయన పదవీ కాలాన్ని పొడిగించే అవకాశాలు లేకపోలేదు.సీఎస్ కంటే సీనియార్టీలో శ్రీలక్ష్మి ముందు ఉన్నారు. శ్రీలక్ష్మిపై పలు అభియోగాలు ఉన్నాయి. గత ప్రభుత్వం పురపాలక శాఖ బాధ్యతలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీనియార్టీలో ముందున్నా శ్రీలక్ష్మిని పక్కన పెట్టారు. ఆమె తర్వాత సీనియార్టీలో అనంతరాము, సాయిప్రసాద్; అజయ్ జైన్ ఉన్నారు. సాయిప్రసాద్ 2026 మే నెలలో, అజయ్ జైన్ 2026 జులైలో పదవీ విరమణ చేస్తారు. వారి తర్వాత సీనియర్‌గా 1991 బ్యాచ్‌కు చెందిన ఆర్పీ సిసోడియా ఉన్నారు. ఈ క్రమంలో అధికారుల మధ్య నెలకొన్న విభేదాలతో సిసోడియా బలయ్యారని ప్రచారం జరుగుతోంది.అధికారుల పనితీరుపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిఘా వర్గాల నుంచి సమాచారాన్ని సేకరిస్తుంది. ఈ క్రమంలో కీలక శాఖలకు బాధ్యులుగా ఉన్న అధికారుల పని తీరుపై నెలన్నర క్రితం ఇంటెలిజెన్స్ అధికారులు సమాచారాన్ని సేకరించారు. ఈ క్రమంలో సిఎంఓలో పనిచేసే అధికారుల పనితీరుపై ఇంటెలిజెన్స్ వర్గాలు సమాచారాన్ని సేకరించాయి.పలువురు అధికారుల వ్యవహార శైలిపై నిఘా వర్గాలు సమాచారాన్ని సేకరించినా కొందరు అధికారులు ప్రత్యేకంగా ఆర్పీ సిసోడియా పనితీరును ప్రభుత్వ పెద్దలకు చేరవేసినట్టు తెలుస్తోంది. దీని వెనుక జరిగిన పరిణామాలపై అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.రెవిన్యూ శాఖ బాధ్యుడిగా జిల్లా కలెక్టర్ల పనితీరుకు స్పెషల్ సీఎస్‌ను బాధ్యుడిని చేసినట్టు ఐఏఎస్‌లలో ప్రచారం జరుగుతోంది. జిల్లాల్లో పెండింగ్ ఫైల్స్ క్లియర్ కాకపోవడానికి సిసోడియాను బాధ్యుడిని చేసి కొద్ది రోజులుగా పక్కన పెట్టినట్టు తెలుస్తోంది. మరోవైపు కీలకమైన రెవిన్యూ శాఖను తమకు నచ్చిన వారికి అప్పగించే క్రమంలోనే సిసోడియాను పదవి నుంచి తప్పించారనే ప్రచారం ఉంది. ఈ క్రమంలో సిసోడియాపై ఇచ్చిన నివేదికలో పలు ఆరోపణలు చేసినట్టు తెలుస్తోంది. రెవిన్యూ శాఖలో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం పెరగడం, భూ కేటాయింపులు, అనుమతులను మంజూరు చేయడంలో నిబంధనల ఉల్లంఘనలు తెరపైకి వచ్చాయి.రెవిన్యూశాఖలో పనిచేస్తోన్నఓ రిటైర్డ్ ఉద్యోగిపై పలు ఆరోపణలు రావడంతో కొద్ది రోజుల క్రితం అతడిని పదవి నుంచి తప్పించారు. 73ఏళ్ల సదరు ఉద్యోగి.. రిటైర్మెంట్ తర్వాత కూడా రెవిన్యూ శాఖలో పని చేస్తున్నారు. అనుభవం పేరుతో రెవిన్యూ శాఖలో చక్రం తిప్పుతున్నారు. ఈ క్రమంలో విశాఖపట్నంలో చేసిన భూ కేటాయింపులు వివాదాస్పంగా మారాయి. జిల్లాల్లో భూముల వ్యవహారాల్లో వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడంతో పాటు, రెవిన్యూ శాఖ ఉన్నతాధికారి పేరుతో పైరవీలు చేస్తున్నట్టు తెలియడంతో అతడిని తొలగించినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఐఏఎస్ అధికారికి మాజీ ఉద్యోగికి మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ జరిగినట్టు సచివాలయ వర్గాలు చెబుతున్నాయి.తమ సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగిని తొలగించడంతో కొన్ని కుల సంఘాలు రెవిన్యూ శాఖ కార్యదర్శిపై సీఎంఓలో ముఖ్యమైన అధికారులకు ఫిర్యాదులు చేశాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పోస్టుకు ఆర్పీ సిసోడియా ప్రయత్నాలు చేస్తున్నారని తెలియడంతో ఆయన్ని కీలక బాధ్యతల నుంచి తప్పించేందుకు ప్రయత్నాలు జరిగినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా వ్యక్తిగత ఆరోపణలతో నివేదికలు ఇచ్చినట్టు తెలుస్తోంది.గుంటూరు జిల్లాకు చెందిన బీజేపీ నాయకుడితో ఐఏఎస్ అధికారి సన్నిహితంగా ఉంటున్నాడని నిఘా వర్గాల ద్వారా గుర్తించాయి. సీఎస్ రేసులో ఉన్న ఇతర ఐఏఎస్‌లు అప్రమత్తం కావడం, సిసోడియాను కీలక బాధ్యతల నుంచి తప్పించేందుకు స్కెచ్ వేసినట్టు తెలుస్తోంది.ఆర్పీ సిసోడియా రెవిన్యూ శాఖ బాధ్యతలు నిర్వహించిన సమయంలో "కవి" పేరుతో ఓ ప్రైవేట్ వ్యక్తి పెత్తనం చెలాయించినట్టు తెలుస్తోంది. రెవిన్యూ శాఖ మంత్రి తాలుకా అంటూ గత పది నెలలుగా రెవిన్యూ శాఖలో చక్రం తిప్పాడని ప్రభుత్వ పెద్దలకు సన్నిహితుడు కావడంతో ఆ శాఖ కార్యదర్శి చూసి చూడనట్టు వదిలేశారు. ప్రైవేట్ సంభాషణల్లో ఐఏఎస్ అధికారి చేసిన వ్యాఖ్యలను రికార్డు చేసి సిఎంఓకు చేరవేయడంతో తాజా బదిలీ జరిగినట్టు తెలుస్తోంది.ఈ క్రమంలో రెవిన్యూ శాఖలో ప్రైవేట్ వ్యక్తుల నిర్వాకంపై కొందరు రెవిన్యూ శాఖ కార్యదర్శిని అప్రమత్తం చేసినా మంత్రి తాలుకాగా ప్రచారం కావడంతో సిసోడియా తేలిగ్గా తీసుకోవడం ఆయన కొంప ముంచినట్టు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో ఆ శాఖ బాధ్యులు సురక్షితంగా ఉంటే ఐఏఎస్ అధికారి మాత్రం బలయ్యారు. మొత్తంగా ఏపీ క్యాడర్ ఐఏఎస్‌లలో నెలకొన్న విభేదాలు తాజా బదిలీలు అద్దం పడుతున్నాయి

# మే 1 నుంచి 15 బ్యాంకుల విలీనం

న్యూడిల్లీ, ఏప్రిల్ 16,

ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, గుజరాత్, జమ్మూ మరియు కాశ్మీర్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిస్సా మరియు రాజస్థాన్ రాష్ట్రాలలో దీని ప్రభావం కనిపించనుంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో మే ఒకటి నుంచి ఒక రాష్ట్రం ఒక ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు అనే విధానం అమలులోకి రానుంది. తాజాగా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదన ప్రకారం 11 రాష్ట్రాలలో 15 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనం కోసం ఒక నోటిఫికేషన్ను విడుదల చేసింది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఏకీకరణలో ఈ విలీనం నాలుగవ దశ అని తెలుస్తుంది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా రీజినల్ రూరల్ బ్యాంక్ ల సంఖ్య 43 నుండి 28కి తగ్గనుందని తెలుస్తుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తో పాటు అనేక ప్రభుత్వ బ్యాంకులతో ఈ బ్యాంకులు అనుబంధంగా ఉన్నాయి. ముఖ్యంగా ఇవి గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకింగ్ సేవలను మరింత బలోపేతం చేస్తాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం దీని ప్రభావం మొత్తం దేశంలోని 11 రాష్ట్రాలలో కనిపించబోతుంది. ప్రస్తుతం ఈ రాష్ట్రాలలో ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులో ఒకే సంస్థగా త్వరలో విలీనం కానున్నాయి.ఈ విధంగా తాజాగా ప్రభుత్వం ఒక రాష్ట్రం ఒక రీజినల్ రూరల్ బ్యాంకు లక్ష్యాన్ని సాధించవచ్చు.వీటి విలీనం కోసం మే 1, 2025 గా నిర్ణయించడం జరిగింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు స్పాన్సర్ చేసిన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అలాగే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మరియు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ విలీనం అయ్యి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గా మే 1 నుంచి ఏర్పడతాయి. అలాగే ఉత్తరప్రదేశ్ మరియు పశ్చిమ బెంగాలలోని మూడు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఒకే సంస్థగా విలీనం కాబోతున్నాయి.ఉత్తరప్రదేశ్లో ఉన్న బరోడా యూపీ బ్యాంకు, ఆర్య వర్క్ బ్యాంకు, ప్రథమ యుపి గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి ఉత్తరప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గా ఏర్పడనున్నాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా సహకారంతో దీని ప్రధాన కార్యాలయం లక్నోలో ఉంటుందని సమాచారం. అదేవిధంగా బంగీయ గ్రామీణ వికాస్ బ్యాంక్ మరియు పశ్చిమ బెంగాల్ గ్రామీణ బ్యాంక్, ఉత్తర్బాంగ్ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి పశ్చిమ బెంగాల్ గ్రామీణ బ్యాంకును పశ్చిమ బెంగాల్లో ఏర్పాటు చేయనున్నారు.

# ధర్మపురి మండలం దమ్మన్నపేటలో విషాదం

**దుబాయ్ లో దమ్మన్నపేటకు చెందిన శ్రీనివాస్ హత్య**

**కడసారి చూపు కోసం కన్నీటిపర్యంతమవుతున్న కుటుంబ సభ్యులు**

**ప్రభుత్వం శవాన్ని అప్పగించాలని వేడుకోలు**

జగిత్యాలధర్మపురి మండలం దమ్మన్నపేటలో విషాదం అలుముకుంది. దమ్మన్నపేటకు చెందిన స్వర్గం శ్రీనివాస్ దుబాయ్ లో హత్యకు గురయ్యారు. ఓ బెకరీలో పని చేసే శ్రీనివాస్ తో పాటు నిజామాబాద్ కి చెందిన మరో వ్యక్తి అలుకుస్ ఏరియాలో బేకరీ షాప్ లో పని చేస్తుండగా పాకిస్తాన్ కు చెందిన వ్యక్తులు కత్తులతో దాడి చేసి హత్య చేసినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. శ్రీనివాస్ ఉపాధి కోసం 20 ఏళ్ళ క్రితం దుబాయ్ కి వెళ్ళారు. అతనికి భార్య ఇంటర్, డిగ్రీ చదివే ఇద్దరు కొడుకులు ఉండగా ప్రస్తుతం స్వగ్రామం లో కాకుండా వేరే చోట నివాసం ఉంటున్నారు. శ్రీనివాస్ కన్నతల్లి రాజవ్వ ఒక్కరే ప్రస్తుతం స్వగ్రామంలో ఉండగా కొడుకు ఇక లేడనే విషయం తెలిసి బోరున విలపించారు. కడసారి చూపుకోసం మృతదేహాన్ని తమకు అప్పగించాలని కన్నీటిపర్యంతమై వేడుకున్నారు. బంధువులతో పాటు గ్రామస్తులు నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాస్ ను హత్య చేసిన వారిపై చర్యలు తీసుకుని శవాన్ని స్వస్థలానికి తెప్పించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# 1500 ఎకరాల్లో అమరావతి మెగా రైల్వే స్టేషన్

విజయవాడ, ఏప్రిల్ 16,

దేశంలోనే అతి పెద్ద రైల్వే స్టేషన్ కి అమరావతి కేరాఫ్ అడ్రస్ గా మారబోతోంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని దక్షిణ భారత దేశంలోనే అత్యంత ముఖ్యమైన స్టేషన్లలో ఒకటిగా మార్చబోతోంది రైల్వే శాఖ. దాదాపు 1500 ఎకరాల సువిశాల ప్రాంగణంలో మెగా రైల్వే స్టేషన్ ఏర్పాటు కానుంది. నెక్కల్లు–పెదపరిమి సమీపంలో ఈ స్టేషన్ ఉంటుంది.మెగా రైల్వే స్టేష్ తో పాటు.. దానికి అనుసంధానంగా రైల్వే లైన్లను నిర్మించేందుకు రైల్వే శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. తొలి విడతలో ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం నుంచి అమరావతికి రైల్వే లైన్ నిర్మిస్తోంది. మొత్తం 56.53 కి.మీ. రైల్వే లైన్‌లో తొలి దశలో 27 కి.మీ. ఏర్పాటు చేయబోతున్నారు. దాములూరు–వైకుంఠపురం మధ్య కృష్ణానదిపై 3.2 కి.మీ. పొడవున రైల్వేబ్రిడ్జి నిర్మాణాన్ని కూడా చేపట్టబోతున్నారు. దీనికోసం తొలి దశలో 800 కోట్ల రూపాయలు ఖర్చు చేయబోతున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా అమరావతి సెంట్రిక్ గా జరిగే రైల్వే పనులకోసం 2245 కోట్ల రూపాయలు ఖర్చు చేయబోతున్నారు. రాబోయే నాలుగేళ్లలో ఈ పనులన్నీ పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు.ఉత్తరాదికి, మధ్య భారత దేశానికి, దక్షిణాదికి ఒక వారధిగా అమరావతి రైల్వే స్టేషన్ ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. అమరావతి నుంచి దేశంలోని అన్ని ప్రముఖ నగరాలకు రైల్వే లైన్లు ఉంటాయి. బెంగళూరు, కోల్‌కత, నాగపూర్, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ, దేశంలోని ఇతర నగరాలకు సైతం కనెక్టివిటీ పెంచుతారు. ఇక కార్గో టెర్మినల్ మరో ప్రత్యేకత. సరకు రవాణాకోసం రాష్ట్రంలోని ప్రధాన ఓడరేవులైన మచిలీపట్నం పోర్ట్, కాకినాడ, గంగవరం, కృష్ణపట్నం పోర్ట్ లతో అమరావతికి లింక్ ఏర్పాటు చేస్తారు. మల్టీ మోడల్ కమర్షియల్ కార్గో టెర్మినల్ ని ఎన్టీఆర్ జిల్లాలోని పరిటాల వద్ద ఏర్పాటు చేయబోతున్నారు.అమరావతి ప్రాంతంలో ఉన్న అమరలింగేశ్వర స్వామి ఆలయం, ఉండవల్లి కేవ్స్, అమరావతి స్థూపం, ధ్యాన బుద్ధ విగ్రహం.. ఇలా పర్యాటకంగా కూడా అమరావతి అభివృద్ధికి ఈ రైల్వే లైన్లు దోహదపడతాయని అంటున్నారు. అమరావతితోపాటు ఆంధ్రప్రదేశ్ లో 73 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తామని రైల్వే శాఖ ప్రకటించింది.అమరావతి నగరానికి రైల్వేలైన్ ను 2017–18లోనే కేంద్రం మంజూరు చేసింది. కానీ వివిధ కారణాల వల్ల అప్పట్లో అది సాధ్యం కాలేదు. పనులు కూడా ముందుకు కదల్లేదు. వైసీపీ ప్రభుత్వంలో అమరావతి అభివృద్ధి పూర్తిగా మూలన పడింది. తిరిగి ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అమరావతి పనులు చకచకా ముందుకు కదులుతున్నాయి. ఈసారయినా అమరావతిలో శాశ్వత నిర్మాణాలు చేపట్టి, అభివృద్ధి అంటే ఏంటో చూపించి ఎన్నికలకు వెళ్లాలని సీఎం చంద్రబాబు ఆలోచిస్తున్నారు. అందుకే ఎన్నికలకు ముందుగానే అమరావతి రైల్వే ప్రాజెక్ట్ ని పూర్తి చేయాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్ రాజధానికి రైల్వే టెర్మినల్ ప్రధాన ఆకర్షణగా మారుతుంది. అమరావతి రైల్వే లైన్ నిర్మాణంపై కేంద్రం కూడా ఉత్సాహంగా ఉంది. ఇప్పటికే పలుమార్లు రైల్వే మంత్రి కూడా అమరావతి రైల్వే పురోగతిపై స్పందించారు.

# విశాఖ అభివృద్ధిపై స్పెషల్ ఫోకస్

విశాఖపట్టణం, ఏప్రిల్ 16,

రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం వైజాగ్. రాష్ట్రం విడిపోయిన తర్వాత.. విశాఖ అభివృద్ధిపై ప్రభుత్వాలు స్పెషల్ ఫోకస్ పెట్టాయి. మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాయి. పరిశ్రమలను ఆకర్షిస్తున్నాయి. ఐటీ కంపెనీలకు ఆహ్వానం పలుకుతున్నాయి. దీంతో విశాఖ చుట్టుపక్కల భూముల రేట్లు క్రమంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో భూములపై పెట్టుబడి పెడితే.. భవిష్యత్తు బంగారం అవుతుందని నిపుణులు చెబుతున్నారు..భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం రాబోతుంది. దీంతో ఈ ప్రాంతం రియల్ ఎస్టేట్ పరంగా చాలా ముఖ్యమైనదిగా మారుతోంది. విమానాశ్రయానికి దగ్గరగా ఉన్నందున నివాస, వాణిజ్య స్థలాలకు డిమాండ్ పెరుగుతోంది. అనందపురం, తగరపువలస వంటి ప్రాంతాలు కూడా భోగాపురానికి సమీపంలో ఉండటంతో అభివృద్ధి చెందుతున్నాయి.మధురవాడ..ఇది విశాఖపట్నంలోని ప్రధాన ఐటీ హబ్. ఇక్కడ అనేక ఐటీ కంపెనీలు, విద్యా సంస్థలు ఉన్నాయి. ఉద్యోగులు, విద్యార్థుల కోసం నివాస స్థలాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. గత కొన్నేళ్లుగా ఇక్కడ భూముల రేట్లు స్థిరంగా పెరుగుతున్నాయి. భవిష్యత్తులో కూడా ఇదే ట్రెండ్ కొనసాగే అవకాశం ఉంది.యెండాడ కూడా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. ఇక్కడ అనేక రెసిడెన్షియల్ ప్రాజెక్టులు వస్తున్నాయి. ఇది ఐటీ హబ్‌కు దగ్గరగా ఉండటంతో ఉద్యోగులకు అనుకూలమైన ప్రాంతంగా మారింది. ప్రశాంతమైన వాతావరణం, మంచి కనెక్టివిటీ ఈ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా మారుస్తున్నాయి. ఈ ప్రాంతంలో భవిష్యత్తులో భూముల రేట్లు భారీగా పెరిగే అవకాశం ఉంది.గాజువాక, కూర్మన్నపాలెం.. గాజువాక ఒక పారిశ్రామిక ప్రాంతం. ఇక్కడ అనేక పెద్ద పరిశ్రమలు ఉన్నాయి. కూర్మన్నపాలెం కూడా గాజువాకకు దగ్గరగా అభివృద్ధి చెందుతోంది. ఈ ప్రాంతాలలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉండటంతో నివాస స్థలాలకు డిమాండ్ ఉంటుంది.పెందుర్తి, సబ్బవరం..ఈ ప్రాంతాలు నగరానికి కొంచెం దూరంగా ఉన్నప్పటికీ.. ఇక్కడ తక్కువ ధరలకు భూములు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్తులో నగర విస్తరణ జరిగే అవకాశం ఉండటంతో ఇక్కడ కూడా భూముల రేట్లు పెరిగే అవకాశం ఉందిఆనందపురం.. ఇది ఐటీ హబ్‌కు, భోగాపురం విమానాశ్రయానికి మధ్యలో ఉంటుంది. ఇక్కడ రెసిడెన్షియల్ ప్రాజెక్టులు పెరుగుతున్నాయి. ఫలితంగా భూములకు డిమాండ్ ఏర్పడింది.కొత్తవలస.. ఇది కూడా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. ఇక్కడ డీటీసీపీ, వుడా ఆమోదిత లేఅవుట్లు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి భూములు భవిష్యత్తులో మంచి రాబడినిచ్చే అవకాశం ఉంది.విశాఖపట్నంలో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు పెట్టే ముందు.. ఆ ప్రాంతంలోని మౌలిక సదుపాయాలు (రోడ్లు, నీరు, విద్యుత్, రవాణా సౌకర్యాలు మొదలైనవి) పరిశీలించడం ముఖ్యంప్రభుత్వ విధానాలు, నగర విస్తరణ ప్రణాళికలు కూడా భూముల రేట్లపై ప్రభావం చూపుతాయి. నిపుణుల సలహా తీసుకోవడం, ప్రాపర్టీ చట్టపరమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించడం చాలా అవసరం.

====================

## కొండపై డ్రోన్ కలకలం

తిరుమల, ఏప్రిల్ 16,

తిరుమల కొండలపై విమానాలు తరచూ ఎగురుతుండటం ఈ మధ్యకాలంలో సర్వ సాధారణమైంది.ఏకంగా శ్రీవారి ఆలయం సమీపంలోనే విమానాల రాకపోకలు సాగించడం భక్తుల కంటపడుతోంది.ఆనంద నిలయం పైనా ఎయిర్ క్రాఫ్ట్ ప్రయాణం భక్తులను కలవరపెడుతోంది. అయితే.. తిరుమల కొండపై విమానాలు ఎగరడం ఆగమ శాస్త్ర విరుద్ధమన్న చర్చ ఎప్పటినుంచో జరుగుతోంది. దీంతో తిరుమల హిల్స్ నో ఫ్లయింగ్ జోన్ గా ప్రకటించాలన్న డిమాండ్ కూడా ఎప్పటినుంచో వినిపిస్తోంది. తిరుమల కొండపై ఆకాశమార్గాన విమాన విహంగం అటుంచితే ఇప్పుడు డ్రోన్ ఎగరడం సంచలనంగా మారింది. ఏడాది క్రితం మాడ వీధుల్లో డ్రోన్ ఎగరడం ఆ తర్వాత వెలుగులోకి రావడంతో టీటీడీ చర్యలు చేపట్టింది.ఇప్పుడు తాజాగా ఓ యూట్యూబర్ తిరుమలలో డ్రోన్ కెమెరా తో చిత్రీకరించడం భద్రతా వైఫల్యాలను మరోసారి ఎత్తిచూపింది. రాజస్థాన్ కు చెందిన ఓ యూట్యూబర్ శ్రీవారి ఆలయ పరిసరాల ప్రాంతాల్లో 10 నిమిషాల పాటు నింగిలో డ్రోన్ తో షూట్ చేశాడు. వెంటనే సమాచారం తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు.. యువకుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న హరినామ సంకీర్తన మండపం వద్ద డ్రోన్ ఎగుర వేసినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు.రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అన్షుమన్ తరెజా అను ఓ యూట్యూబర్ శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న హరినామ సంకీర్తన మండపం వద్ద డ్రోన్ ఎగురవేసినట్లు టీటీడీ విజిలెన్స్ సిబ్బంది తెలిపారు. వెంటనే అతనిని అదుపులోకి తీసుకుని డ్రోన్ స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్లు ప్రకటనలో తెలిపారు. కాగా, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎంఎల్సీలచే ప్రమాణ స్వీకారం చేయించిన కౌన్సిల్ చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

అమరావతి, ఏప్రిల్ 16

:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలికి ఇటీవల ఎంఎల్సీలుగా ఎంపికైన బీద రవిచంద్ర,జి.శ్రీనివాసులు నాయుడులచే బుధవారం రాష్ట్ర శాసన సభ భవనంలోని శాసన మండలి చైర్మన్ కార్యాలయంలో చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు వారితో ప్రమాణం చేయించారు. తదుపరి రాష్ట్ర శాసన మండలి నియమనిబంధనలకు సంబంధించిన పుస్తకాలతో కూడిన కిట్ బ్యాగును మోషేన్ రాజు ఎంఎల్సిలకు అందజేశారు.ఈకార్యక్రమంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్,ఇద్దరు ఎంఎల్సిలతో పాటు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సమస్యల పట్ల శ్రద్ధ వహించాలి
## రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

గోదావరిఖని నిరంతరం విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి ఎదురయ్యే ఆరోగ్య సమస్యల పట్ల శ్రద్ధ వహించి తగు జాగ్రత్తలు తీసుకోవాలి అని రామగుండం పోలీస్ కమిషనర్ సూచించారు.

రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారులు, సిబ్బంది, హోంగార్డ్ సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు, విశ్రాంతి పోలీస్ ఉద్యోగుల కోసం ప్రత్యేక ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కమిషనరేట్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు.రేని హాస్పిటల్ కరీంనగర్, కేర్ హాస్పిటల్ హైదరాబాద్, శ్రీకాంత్ డెంటల్ హాస్పిటల్ గోదావరిఖని, మాక్స్ విజన్ వరంగల్ ల, మంచిర్యాల ప్రభుత్వం హాస్పిటల్ డాక్టర్ సునీల్, సైకియాట్రిస్ట్ సౌజన్యంతో ఏర్పాటు ఈ ఉచిత మెగా హెల్త్ క్యాంపులో జనరల్ ఫిజిషియన్, కార్డియాలజీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, న్యూరాలజీ, గైనకాలజిస్ట్, సిపిఆర్ స్పెషలిస్ట్, ఆప్తాల్మాలజిస్ట్, కంటి విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పోలీస్ సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అవరమైన సిబ్బంది డాక్టర్ల సూచన మేరకు షూగర్, ఈసిజీ, 2డిఇకో, సిఎఫ్టి, కంటి, దంతలకు సంబందించిన పరీక్షలు నిర్వహించారు. అత్యవసర పరిస్థితులలో ప్రథమ చికిత్స అయిన సిపిఆర్ విధానాన్ని ఎలా చేయాలి అనేది స్పెషలిస్ట్ డాక్టర్లు సిబ్బందికి తెలియజేయడం జరిగింది. సిపి కూడా స్వయంగా సిపిఆర్ చేసే విధానాన్ని చేశారు. ఈ వైద్య శిబిరంలో పోలీస్ కమిషనర్ సైతం కంటి పరీక్షలను నిర్వహించుకున్నారు.× ఈ శిబిరానికి వచ్చిన పోలీస్ సిబ్బందిలో ఎలాంటి వ్యాధులతో భాధపడుతున్నారు. వారు ఎలాంటి జాగ్రత్తలను తీసుకోవాల్సి వుంటుందని పోలీస్ కమిషనర్ వైద్యులను అడిగితెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎర్పాటు చేసిన సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ..... ఈ వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించుకున్న పోలీస్ సిబ్బంది కేవలం పరీక్షలతో సరిపెట్టుకోకుండా డాక్టర్లు సూచించిన సలహాలను పాటిస్తూ సమయానికి మందులను తీసుకుంటూ సిబ్బంది ఆరోగ్యంగా వుండాలని, ముఖ్యంగా సిబ్బందికి విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్ళు వున్న ఆరోగ్యం కోసం నిరంతరం వ్యాయామం, యోగ చేయడంతో పాటు రోజు వారి జీవితంలో ఆహారపు అలవాట్లలో మార్పు అవరసమని, పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా వుంటే శాంతి భద్రతలు పరిరక్షణతో పాటు, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించగలమని, సిబ్బంది రక్షణ, ఆరోగ్యాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులకు ఉందని , ఈ వైద్య శిబిరంలో సహకరించిన రేని కరీంనగర్, కేర్ హైదరాబాద్, శ్రీకాంత్ డెంటల్ కరీంనగర్, మాక్స్ విషన్ వరంగల్ హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బందికి పోలీస్ కమిషనర్ అభినందనలు తెలిపారు.ఈ సమావేశంలో అడిషనల్ డిసిపిలు అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏసీపీ మల్లారెడ్డి, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్ తో పాటు ఎసిపిలు, ఆర్.ఐ లు, ఇన్స్పెక్టర్లు, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగం, ఆర్.ఎస్.ఐలు ఎస్.ఐలు ఇతర పోలీస్ సిబ్బంది, రెనీ హాస్పిటల్ – కరీంనగర్ డాక్టర్ రవి కుమార్ – సీటీవీఎస్ సర్జన్, డాక్టర్ లతీష్ రెడ్డి – క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్, డాక్టర్ కె. సునీల్ కుమార్ – సైకియాట్రిస్ట్, డాక్టర్ థరోన్ అత్యవసర వైద్యుడు, కార్డియోపల్మోనరీ రిసిసిటేషన్ సీపీఆర్, కేర్ హాస్పిటల్ డాక్టర్స్ డాక్టర్ ముఖేష్ – కార్డియాలజిస్ట్,

# ప్రశ్నించడం మానేశారా...

ఏలూరు, ఏప్రిల్ 16,

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరిస్తున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. 2014లో నాడు బీజేపీ, టీడీపీ కూటమికి పరోక్షంగా మద్దతిచ్చిన పవన్ కల్యాణ్ 2019 ఎన్నికలకు వచ్చేసరికి విభేదించారు. సొంతంగా పోటీ చేసిచేతులు కాల్చుకున్నారు. నాడు అమరావతి రాజధాని రైతుల నుంచి 32 వేల ఎకరాల మూడు పంటల భూమిని సేకరించడాన్ని పవన్ కల్యాణ్ తప్పుపట్టారు. రాజధానికి అంత భూములు అవసరమా? అని ప్రశ్నించారు.అంతేకాదు నాడు ఒకడుగు ముందుకేసి రాజధాని ప్రాంతంలో పర్యటించి భూములు తీసుకున్న రైతులకు అండగా నిలబడతానని భరోసా కూడా ఇచ్చి వచ్చారు. అయితే 2024 ఎన్నికల నాటికి ఆయన వాయిస్ మారింది. రాజధాని రైతుల విషయంలో ఆయన తన స్టాండ్ ను మార్చుకున్నారు. అసలు నాడు ప్రశ్నించిన దానిని మర్చిపోయారనిపిస్తుంది. రహదారుల కోసం ఇళ్లను కూల్చివేస్తే ఇప్పటంలో హడావిడి చేసిన పవన్ కల్యాణ్ ఇప్పుడు మౌనంగా ఉండటమేంటని పలువురు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం రాజధాని అమరావతి కోసం మరో నలభై వేల ఎకరాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. రాజధాని కోర్ కాపిటల్ బయట నలభై ఎకరాలు సేకరించి భవిష్యత్ అవసరాల కోసం ఉంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది కానీ పవన్ కల్యాణ్ దీనిపై ఎలాంటి కామెంట్స్ చేయకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అధికారంలో లేనప్పుడు ఒకలా, ఉన్నప్పుడు మరొకలా వ్యవహరించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అయితే రాజధాని రైతులు తమ సమ్మతితోనే భూములు ఇస్తుండటంతో పవన్ కల్యాణ్ మౌనంగా ఉంటున్నారని జనసేననేతలు చెబుతున్నారు. గతంలో రాజధాని భూముల విషయంపై చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పవన్ కల్యాణ్ నేడు మౌనంగా ఉండటాన్ని ఆయన సర్దుకుపోయే మనస్తత్వానికి నిదర్శనమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రైతులు అంగీకరించినా అంత పెద్ద స్థాయిలో అంటే ఒక్క రాజధాని నిర్మాణం కోసం 77 వేల ఎకరాలను సేకరించడాన్ని ప్రశ్నించకపోతే ప్రజల తరుపున ఏమి చేస్తారంటూ నిలదీస్తున్నారు. కనీసం అభ్యంతరం కూడా చేయకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత పవన్ కల్యాణ్ పూర్తిగా ఛేంజ్ అయినట్లు కనపడుతుంది. మిత్ర ధర్మంతో చంద్రబాబు నాయుడు కు మద్దతు ఇవ్వడంలో తప్పులేదు. అదే సమయంలో ఆయన పదిహేనేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకోవడాన్ని కూడా ఎవరూ ఆక్షేపించరు. కానీ ప్రజాసమస్యలపై పోరాడతానని పార్టీ పెట్టిన పవన్ కల్యాణ్ ఇప్పుడు మూగనోము పట్టడం పైనే సర్వత్రా ఆయన వైఖరిపై వ్యతిరేకత వ్యక్తమవుతుంది. అందరి రాజకీయ నేతల్లాగే పవన్ కల్యాణ్ కూడా అధికారానికి దాసోహం అని అంటున్నారని, ప్రశ్నించడమే మానేశారన్న కామెంట్స్ నెట్టింట బలంగా వినిపిస్తున్నాయి. ఇలాగే వ్యవహరిస్తూ ఈ నాలుగేళ్లలో ఉన్న ఇమేజ్ కోల్పోయే అవకాశముందన్న హెచ్చరికలు వినపడుతున్నాయి.

==================

# ఏపీకి గేమ్ ఛేంజర్ గా టీసీఎస్

విశాఖపట్టణం, ఏప్రిల్ 16,

ఆంధ్రప్రదేశ్ ఐటీ రంగానికి శుభవార్తే! విశాఖపట్నంని టెక్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కి కేవలం 99 పైసలకే 21.16 ఎకరాల భూమిని కేటాయించడం, ఏప్రిల్ 15న కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనను ఆమోదించడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.విశాఖపట్నం త్వరలో ఐటీ హబ్‌గా మారబోతుంది. దేశంలోనే అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేవలం 99 పైసలకే 21.16 ఎకరాల భూమిని కేటాయించడం ప్రస్తుతం సంచలనం రేపుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయం విశాఖపట్నం ఐటీ రంగానికి గేమ్ ఛేంజర్‌గా మారుతుందా అనే చర్చలు మొదలయ్యాయి.ఇది నిజంగా ఆంధ్రప్రదేశ్ ఐటీ రంగానికి శుభవార్తే! విశాఖపట్నంని టెక్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కి కేవలం 99 పైసలకే 21.16 ఎకరాల భూమిని కేటాయించడం, ఏప్రిల్ 15న కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనను ఆమోదించడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఈ చర్యతో ఏపీ ఐటీ రంగంలో గేమ్ చేంజర్ అవుతుందా అనే చర్చలు మొదలయ్యాయివిశాఖపట్నంని ప్రధాన సాంకేతిక కేంద్రంగా మార్చేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే టీసీఎస్ కు భూమిని కేటాయించింది. ఐటీ మంత్రి నారా లోకేష్ 2024 అక్టోబర్‌లో ముంబైలోని టాటా ప్రధాన కార్యాలయానికి వెళ్లినప్పుడు టీసీఎస్‌కి ఈ ప్రతిపాదనను మొదటగా వినిపించారు. తమ తదుపరి భారీ అభివృద్ధి కేంద్రం కోసం ఆంధ్రప్రదేశ్‌ను పరిగణించాలని టెక్ దిగ్గజాన్ని కోరారు.ఆ తర్వాత నెలల్లో, ఏపీ ప్రభుత్వం టీసీఎస్‌తో నిరంతరం చర్చలు జరిపింది. చివరికి సోమవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. ఈ చర్య ద్వారా పరిశ్రమకు స్ట్రాంగ్ మెసేజ్ పంపాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉన్నత స్థాయి సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని, పోటీతత్వంతో ఉందని చాటి చెప్పాలని చూస్తోంది. ఈ నిర్ణయం గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ టాటా మోటార్స్‌కు సనంద్‌లో 99 పైసలకు భూమిని కేటాయించిన పారిశ్రామిక వ్యూహంతో పోల్చి చూస్తున్నారు. ఈ చర్య రాష్ట్ర ఆటోమోటివ్ రంగాన్ని ప్రోత్సహించిందని అందరూ అంటారు. ఇప్పుడు ఏపీ కూడా అదే బాటలో ఐటీ రంగాన్ని ప్రోత్సహించాలని చూస్తోంది“ఐటీ రంగానికి ఇది మా సనంద్ క్షణం” అని ప్రభుత్వ అధికారి అన్నారు. “ప్రతి టెక్ కంపెనీ మ్యాప్‌లో విశాఖపట్నం ఉండాలని మేము కోరుకుంటున్నాము” అని ఆయన చెప్పారు. విశాఖపట్నంలో కార్యకలాపాల స్థాయికి సంబంధించి టీసీఎస్ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. కానీ, ఈ చర్యతో విశాఖ ఐటీ రంగంలో భారీ మార్పులు వస్తాయని అందరూ భావిస్తున్నారు. అప్పట్లో గుజరాత్‌లో నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయం ఆటోమొబైల్ పరిశ్రమ వృద్ధికి దోహదపడింది. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం అదే తరహాలో ఐటీ రంగాన్ని ప్రోత్సహించడం విశాఖపట్నానికి ఎంతవరకు లాభిస్తుందో చూడాలి. టీసీఎస్ దాదాపు రూ. 1,370 కోట్లు పెట్టుబడి పెట్టనుంది, 10,000 మందికి ఉద్యోగాలు కల్పించనుంది. ఇది విశాఖపట్నం ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన ప్రోత్సాహాన్ని అందిస్తుంది.విశాఖపట్నాన్ని ప్రధాన ఐటీ కేంద్రంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పం ఈ నిర్ణయంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఇతర టెక్ కంపెనీలను ఆకర్షించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయా అనేది చూడాలి. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలు సృష్టించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది యువతకు ఉపాధి అవకాశాలను పెంచుతుంది.99 పైసలకే భూమి కేటాయించడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సంకేతాలు పంపుతోంది. పరిశ్రమలకు అనుకూల విధానాలతో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామంగా మారుతుందా అనేది చూడాలి. తెలంగాణ ప్రభుత్వం సైబర్ టవర్స్ వంటి భారీ ప్రాజెక్టులతో ఐటీ రంగాన్ని ప్రోత్సహిస్తోంది. ఏపీ ప్రభుత్వం టీసీఎస్ కు భూమి కేటాయించడం ద్వారా తెలంగాణకు గట్టి పోటీ ఇవ్వడానికి ప్రయత్నిస్తుంది. ఈ నిర్ణయం విశాఖపట్నం ఐటీ రంగానికి గేమ్ ఛేంజర్ అవుతుందా అనేది కాలమే నిర్ణయిస్తుంది. అయితే, ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలు విశాఖపట్నం ఐటీ రంగానికి ఒక కొత్త దిశను చూపుతున్నాయి.

# నెలకు మద్యం దందా 60 కోట్లపైనే

నెల్లూరు, ఏప్రిల్ 16,



మద్యం కుంభకోణంలో ప్రధానంగా వినిపిస్తున్న పేరు రాజ్ కసిరెడ్డి. ఈ మొత్తం ఎపిసోడ్లో ఆయనే కర్త,కర్మ,క్రియ. ఈ కుంభకోణంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం ముమ్మరంగా వేటాడుతోంది. విచారణ కోసం పిలిచినా ఆయన లెక్క చేయలేదు. నోటీసులు ఇచ్చిన స్పందించలేదు. దీంతో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు ఆయన ఇల్లు, కార్యాలయాలు, సన్నిహితులు, స్నేహితుల ఇళ్లల్లో సోదాలు చేస్తున్నారు. సోమవారం హైదరాబాద్ చేరుకున్న 50 మంది ఏపీ పోలీసులు తెలంగాణ పోలీసులతో కలిసి తనిఖీలు చేపట్టారు. లిక్కర్ కింగ్ పిన్ గా ఉన్న రాజ్ కసిరెడ్డి అరెస్టు లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.అయితే ఈ దర్యాప్తు బృందానికి నేతృత్వం వహిస్తున్నారు ఏఎస్పీ భూషణం . అయితే ఈ దర్యాప్తులో నమ్మలేని నిజాలు బయటకు వస్తున్నాయి. రాజ్ కసిరెడ్డి సినిమా వ్యాపారంలో పెట్టుబడులు పెట్టేందుకు బినామీ పేర్లతో ఈడి క్రియేషన్స్ అనే సంస్థను ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. ఇప్పటికే పలు సినిమాల నిర్మాణంలో భాగస్వామిగా కూడా ఉన్నారని గుర్తించారు దర్యాప్తు బృందం అధికారులు. మరిన్ని కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు ఒప్పందాలు చేసుకుంటున్న తరుణంలోనే మద్యం స్కాం బయటపడినట్లు తెలుస్తోంది. అదేవిధంగా రియల్ ఎస్టేట్, పవర్ ప్లాంట్స్ లోను వాటాలు పెట్టారని చెబుతున్నారు. కసిరెడ్డి కూతురు ఇషాని పేరుతో ఓన్నాఋ సమస్తను సైతం నెలకొల్పారని పోలీసులు చెబుతున్నారు. హైదరాబాదులోని పలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా వాటాలు పెట్టారని? బ్లాక్ మనీని వైట్ గా మార్చేశారని పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.వాస్తవానికి రాజ్ కసిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఐటీ సలహాదారుడు. ఆయనకు మద్యం కుంభకోణంతో సంబంధం ఎలా అన్నది ఇప్పుడు ప్రశ్న. పేరుకే ఐటి సలహాదారుడు కానీ.. ఆయన ఎక్కువగా మద్యం వ్యాపారాన్ని పర్యవేక్షించాలని ఫిర్యాదులు ఉన్నాయి. హైదరాబాద్ కేంద్రంగా మరోవైసీపీ నేతతో కలిసి ఆయన ఈ దందా నడిపినట్లు సమాచారం. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఏ రోజు ఏ బ్రాండ్ అమ్మాలనేది రాజ్ కసిరెడ్డి డిసైడ్ చేసేవారని.. తమకు ముడుపులు ఇచ్చిన కంపెనీలకి ఆర్డర్లు ఇచ్చేవారని.. ఇందుకోసం కేసుకు 150. ఇలా ప్రతినెల కమిషన్ల రూపంలో 60 కోట్ల రూపాయలు వసూలు చేసేవారని పోలీస్ దర్యాప్తులో తేలినట్లు సమాచారం. వైసిపి పాలనలో నాలుగేళ్ల ఎనిమిది నెలల పాటు ఈ దందా కొనసాగిందని.. వేల కోట్ల రూపాయలు అక్రమంగా కూడేసారని రాజ్ కసిరెడ్డి పై ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రస్తుతం రాజ్ కసిరెడ్డి కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం హైదరాబాదులో జల్లెడ పడుతోంది. ఆయన అవినీతిపరుడు అంటూ పత్రికల్లో కథనాలు వచ్చిన రాజ్ కసిరెడ్డి ఎంతవరకు స్పందించలేదు. ప్రస్తుతం ఆయన హైదరాబాదులోనే ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. కొద్దిరోజుల కిందట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత విజయసాయిరెడ్డి మద్యం స్కాం విషయంలో సంచలన ఆరోపణలు చేశారు. రాజ్ కసిరెడ్డి సూత్రధారి అని తేల్చేశారు. ఇప్పుడు రాజ్ కసిరెడ్డి దందాలు ఒక్కొక్కటి బయటకు వెలుగులోకి వస్తుండడం గమనార్హం.

================

## తుంగతుర్తి ఎస్సి బాలికల హాస్టల్ లో ఏసీబీ సోదాలు

సూర్యాపేట

తుంగతుర్తిలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో అవకతవకలపై ఏసీబీ అధికారులు విచారణ ప్రారంభించారు. విచారణ వివరాలను ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్ మీడియా ముందు వెల్లడించారు. హాస్టల్లో అవకతవకలు జరుగుతున్నాయని సమాచారం రావడంతో ఆకస్మిక తనిఖీ చేశాం. హాస్టల్ అడ్మిషన్ లో 51 విద్యార్థులను రిజిస్టర్ చేసి 25 మందికి భోజనం అందిస్తున్నారు. వసతి గృహంలో వార్డెన్, సిబ్బంది విద్యార్థులకు అందుబాటులో ఎల్లవేళలా ఉండాలి. అడ్మిషన్ రిజిస్టర్ సరిగా లేదు. మొత్తం అస్తవ్యస్తంగా ఉంది. విద్యార్థులకు అందించే భోజన వసతులు సరిగా లేవు. వసతి గృహానికి సంబంధించిన రిజిస్టర్లు, మెయింటెన్ రిజిస్టర్లు లేవు. వసతి గృహంలో వార్డెన్ మార్తమ్మ విధుల పట్ల నిర్లక్ష్యం వహించారని అన్నారు. -ప్రభుత్వ ఉద్యోగులు చేయవలసిన పనులకు డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీనెంబర్ 1064కు ఫిర్యాదు చేయండి. ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంటాయి. వార్డెన్ మార్తమ్మపై విచారణ పూర్తి చేసి తగు చర్యల నిమిత్తం ఏసీబీ డీజీపీకి నివేదికను పంపుతామని అన్నారు.

## ఆటో బోల్తా.. మహిళా కూలీ మృతి

సూర్యాపేట

సూర్యాపేట జిల్లా, ఆత్మకూర్ మండలంలోని కోటపహాడ్ వద్ద రోడ్డుప్రమాదం జరిగింది. కూలీలతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒక మహిళ స్పాట్ లోనే మృతి చెందగా.., పలువురికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్ లో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు

## సీజ్ చేసిన మద్యం ధ్వంసం

కరీంనగర్

మద్యాన్ని అనధికారికంగా తరలించే వారి నుంచి స్వాధీనం చేసుకున్న మద్యాన్ని పోలీసు అధికారుల సమక్షంలో ధ్వంసం చేశారు.కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల పరిధిలో ఎన్నికల కోడ్ సమయంలో స్వాధీనం చేసుకున్న మద్యంతో పాటు, గత రెండేళ్ల కాలంలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యాన్ని మంగళవారం గన్నేరువరం పోలీస్ స్టేషన్ వేనుకలో నేలపాలు చేశారు. గన్నేరువరం ఎస్సై తాండ్ర నరేష్ , ఎక్సైజ్ ఎస్సై శ్రీకాంత్ అద్వర్యంలో ధ్వంసం చేశారు . ఈ సందర్భంగా ఎస్సై తాండ్ర నరేష్ మాట్లాడుతూ గత రెండేళ్లలో మండల పరిదిలో అక్రమ మద్యం తరలింపు కేసులు నమోదు చేసి, 478 మద్యం క్వాటర్ బాటిల్స్ ను సీజ్ చేసినట్లు తెలిపారు.

## సురానా సంస్థలపై ఈడీ దాడులు

సికింద్రాబాద్..

సురానా గ్రూప్స్ అధినేత నరేంద్ర సురానా ఇంట్లో ఈ డి సోదాలు జరుపుతున్నారు.డైమండ్ పాయింట్లోని అరిహంత్ ఎంక్లేవ్ లోని ఆయన నివాసం వద్ద ఈడి అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఉదయం నాలుగు గంటల నుండి నరేంద్ర సురాణా ఇంట్లో సోదాలు చేస్తున్నట్లు తెలుస్తుంది.సోలార్ వ్యాపారంలో ఉన్న సూరన గ్రూప్స్మనీలాండరింగ్ కు పాల్పడినట్లు గుర్తించి సోదాలు నిర్వహిస్తున్నారు. బ్యాంకుల నుండి రుణాల చెల్లింపు ఎగవేతకు సంబంధించి సిబిఐ కేసు నమోదు చేసిన నేపథ్యంలో ఈడి అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.

## మొగల్తూరు హైవే పై రోడ్ ప్రమాదం

ఏలూరు

పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు హైవే పై రోడ్ ప్రమాదం జరిగింది. ఒక బోలెరో వ్యాన్ అదుపుతప్పి వంట బోదెలోబోల్తాపడింది. ఇద్దరు ఉపాధి హామీ కూలీలు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. ఘటనలో మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

వైయస్సార్

కమలాపురం నగర పంచాయతీ లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. స్థానికుల వివరాల ప్రకారం.... రైల్వే గేటు సమీపాన ట్రాక్టర్ స్కూటర్ ఢీకొన్న సంఘటనలో ఓ మహిళ మృతి చెందింది.. మృతి చెందిన మహిళ పట్టణంలోని రామ్ నగర్ కాలనీకి చెందిన సరోజమ్మగా గుర్తించారు. ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్ ను వదిలేసి పరార్ అయ్యారు అని స్థానికులు తెలిపారు. ఈ మేరకు కమలాపురం ఎస్సై విద్యాసాగర్ సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాద సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఏపి రాజ్యసభ ఎంపీ స్థానం ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల
## విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ
## ఈనెల 22న నోటిఫికేషన్

మే 9న పోలింగ్ ఏపీలో ఖాళీగా ఉన్న ఒక రాజ్యసభ ఎంపీ స్థానానికి ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. వైఎస్సార్సీపీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి రాజీనామా చేయడంతో ఖాళీగా ఉన్న ఈ

## సోనియా, రాహుల్ బెయిల్ పై వున్నారు

### కాంగ్రెస్ నిరసనలకి దిగడం సిగ్గుచేటు.

### బీజేపీ ఏపీ మైనారిటీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ బాజీ

విజయవాడ

కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా నిరసనలు జరపాలని మాట్లాడుతోంది వారికి ఖచ్చితంగా నిరసన తెలిపే హక్కు ఉంది, కానీ వారికి భూమి మరియు నిధులను దోచుకునే హక్కు లేదని బీజేపీ ఏపీ మైనారిటీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ బాజీ అన్నారు. బుధవారం అయన మీడియాతో మాట్లాడారు. కుటుంబ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ నిరసనలకి దిగడం సిగ్గుచేటు. న్యాయస్థానాలపై కాంగ్రెస్ కి నమ్మకం లేదు. అక్రమంగా దోచుకున్న భూముల కోసం సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ ఆందోళనకి దిగుతున్నారు. నేషనల్ హెరాల్డ్ 1937లో ప్రారంభించబడింది. ప్రారంభంలో, దీనికి 5,000 మంది వాటాదారులు ఉన్నారు. అంటే ఇది ఎప్పుడూ నెహ్రూ కుటుంబం యొక్క వ్యక్తిగత ఆస్తి కాదు. ఆ యుగంలోని అనేక మంది ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల మద్దతు కూడా దీనికి లభించింది. 2008లో, నేషనల్ హెరాల్డ్ ప్రచురణ మూసివేయబడింది. ఆ తర్వాత, కాంగ్రెస్ పార్టీ నేషనల్ హరాల్డ్‌కు ?90 కోట్లు ఇచ్చింది. కాంగ్రెస్ అనేక మినహాయింపులు పొందుతున్న రాజకీయ పార్టీ, కానీ ఒక రాజకీయ పార్టీ చట్టబద్ధంగా పార్టీ నిధులను ప్రైవేట్ సంస్థకు బదిలీ చేయదు ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని అన్నారు.

మొత్తం నేషనల్ హెరాల్డ్ ఆస్తిని గాంధీ కుటుంబం నియంత్రణలోకి తీసుకురావడానికి, కాంగ్రెస్ కార్పొరేట్ కుట్రకు పాల్పడింది. యంగ్ ఇండియన్ అనే కంపెనీని ఏర్పాటు చేశారు, దీనిలో 38% వాటాను సోనియా గాంధీ మరియు మరో 38% వాటాను రాహుల్ గాంధీ కలిగి ఉన్నారు. ?9 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఈ కంపెనీకి బదిలీ చేశారు. ?9 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను బదిలీ చేసిన తర్వాత, నేషనల్ హెరాల్డ్ ఆస్తి మొత్తం యంగ్ ఇండియన్ నియంత్రణలోకి వచ్చిందని అన్నారు.

ఈ విషయంలో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఇఆ) అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు మాతీలాల్ వోరా, తరువాత పవన్ బన్సాల్, ఆపై సోనియా గాంధీ మరియు రాహుల్ గాంధీలను ప్రశ్నించింది. మొత్తం కేసులో, ?90 కోట్ల రుణాన్ని కేవలం ?50 లక్షలకు బదులుగా రద్దు చేశారు. వేల కోట్ల విలువైన ఆస్తిని వారి పేరులోకి కేవలం 50 లక్షలకు బదిలీ చేయడానికి సమర్ధవంతంగా అనుమతించారని అన్నారు.

కోర్టు ఈ నెల 21న విచారణను షెడ్యూల్ చేసింది మరియు దాని చుట్టూ చాలా గందరగోళం నెలకొంది. సోనియా గాంధీ మరియు రాహుల్ గాంధీ బెయిలపై ఉన్నారు. ముత్తం చర్యను కొట్టివేయాలని వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు కానీ ఎటువంటి ఉపశమనం లభించలేదు. అందించిన ఏకైక ఉపశమనం ఏమిటంటే వారు స్వయంగా హాజరు కాకుండా వారి న్యాయవాదుల ద్వారా కోర్టులో హాజరు కావచ్చు. గత నాలుగు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి ఉంది, ఈ సమయంలో రాహుల్ గాంధీ మరియు సోనియా గాంధీ సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వలేకపోయారు. చట్టం తన పని తాను చేసుకుంటూ ఉండగా, కాంగ్రెస్ ఎందుకు నిరసనలు చేయాలనుకుంటుందని అన్నారు.

కొంతమంది పార్లమెంటు సభ్యులు మరియు ప్రఖ్యాత న్యాయవాదులు కూడా ఈ విషయంపై నిరాధారమైన వాదనలను ప్రదర్శిస్తున్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను బిజెపి అడగాలనుకుంటోంది: చట్టం తన పని తాను చేసుకోవాలా? వేల కోట్ల విలువైన ఆస్తులను కాంగ్రెస్ అక్రమంగా తమ ఆధీనంలోకి తీసుకోవడానికి కుట్ర పన్నితే మనం మనంగా ఉండాలా? నేషనల్ హెరాల్డ్ కథనం చాలా ఆసక్తికరంగా ఉంది.

ఈ వార్తాపత్రిక కోసం డబ్బును సేకరించే వ్యక్తులు సరైనవారు కాదని సర్దార్ పటేల్ అన్నారు. ఇది ఆందోళన కలిగించే విషయం. వీరందరూ నిజమైన కాంగ్రెస్ నాయకులు, మరియు అన్ని లేఖలు అందుబాటులో ఉన్నాయి. నెహ్రూ జీ ఏమి చెప్పారో, సుదా పటల్ ఏమి చెప్పారో, ప్రతిదీ రికార్డ్ చేయబడింది. ఆ సమయంలో కూడా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రభాను గుప్తా ఈ వార్తాపత్రిక కోసం చాలా నిధులు సేకరించారు. ఈ వార్తాపత్రిక జాతి స్వరంగా మారుతుందని చెప్పబడింది, కానీ దానిని నహ్రూ కుటుంబం స్వరంగా మార్చారు సర్దార్ పటేల్ ఏమనుకున్నారు? ఇది చంద్రభాను గుప్తా ఆత్మకథలో ప్రస్తావించబడింది. దాని గతం మరియు వర్తమానం రెండింటినీ అర్థం చేసుకోవడం ముఖ్యం. యంగ్ ఇండియా బదిలీ చేయబడినప్పుడు, దాదాపు 25? 26 కోట్ల రూపాయల ప్రకటనలు వచ్చాయి. స్వాతంత్ర్య పోరాటంలో దేశంలోని నిజమైన యోధుల గొంతుకగా ఉన్న ఆ వార్తాపత్రికను కాంగ్రెస్ వ్యక్తిగత వ్యాపారంగా మార్చింది మరియు దాని ఏటీఎం గా మారింది. భారతీయ జనతా పార్టీ దీనిని తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం పోరాట ఫలితంగానే వడదెబ్బ బాధితులకు 4 లక్షల పరిహారం

మంథని వ్యవసాయ కార్మిక సంఘం పోరాట ఫలితంగానే వడదెబ్బ బాధితులకు 4 లక్షల పరిహారం ప్రకటించారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ అన్నారు. బుధవారం మంథని మండలం కాకర్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బతో చనిపోయిన వ్యవసాయ కార్మికులకు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని అనేక సంవత్సరాలుగా చేసిన పోరాటాల ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం వడదెబ్బతో చనిపోయిన కుటుంబాలకు 4 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించి జీవో జారీ చేసిందని ఎక్స్గ్రేషియా 4 లక్షలు కాకుండా పదిలక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఎక్స్గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ ప్రారంభమైన నాటి నుండి ఇప్పటివరకు కూలీల డబ్బులు ఇవ్వలేదని వెంటనే విడుదల చేసి పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# ఆ నాలుగు జిల్లాలు.. మహర్దశ

గుంటూరు, ఏప్రిల్ 16

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.. రాష్ట్రంలో మెగా సిటీ మాస్టర్ ప్లాన్ చేస్తోంది. భవిష్యత్తులో అమరావతి, గుంటూరు, విజయవాడ నగరాలతో పాటుగా మంగళగిరి, తాడేపల్లిని కలిపి మెగాసిటీగా సీఎం చంద్రబాబు మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లుమంత్రి నారాయణ తెలిపారు. ఈ మెగాసిటీకి అమరావతిలో ఒక అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం ఉందన్నారు.. అందుకే 5వేల ఎకరాలు అవసరం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ భూమిని పరిశీలించాలని ఆదేశించారన్నారు. మంత్రి నారాయణ రాజధాని నిర్మాణ పనులకు కావాల్సిన గ్రావెల్ కోసం అమరావతి ప్రాంతంలోని అనంతవరంలోని కొండలను పరిశీలించారు. అమరావతకి రెండో దశలో భూమిని సేకరించాలా?.. భూమిని సమీకరించాలా అనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు మంత్రి నారాయణ. భూమిని సేకరణ ద్వారా తీసుకుంటే రిజిస్ట్రేషన్ ధర కంటే రెండున్నర రెట్లు ఎక్కువ వస్తుందని.. అదే సమీకరణ ద్వారా అయితే రైతలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. అందుకే రైతులు సమీకరణ కోరుకుంటున్నారని.. వారికి రోడ్లు, రైతులకు రిటర్నబుల్ ప్లాట్లకు లేఅవుట్లు వేసి, డ్రెయిన్లు కట్టాల్సి ఉంటుంది అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు హైదరాబాద్‌లో విమానాశ్రయం నిర్మించినప్పుడు భారీగా భూములు తీసుకున్న సమయంలో కూడా విమర్శలు వచ్చాయని.. ఇప్పుడు హైదరాబాద్ బెస్ట్ ఎయిర్‌పోర్టుల్లో ఒకటిగా నిలిచిందన్నారు. చంద్రబాబు రాబోయే వందేళ్ల గురించి ఆలోచిస్తారని.. అందుకే అమరావతిలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ, దేశంలోనే అతిపెద్ద అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంని నిర్మించాలనే ఆలోచనలు ఉన్నారన్నారు. ఇలా అమరావతిలో ఒక్కొక్కటిగా మౌలిక సదుపాయాల్ని కల్పిస్తే ఆర్థిక కార్యాకలాపాలు అభివృద్ధి చెందుతాయన్నారు. నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని.. అందుకే ఆ దిశగా పని చేస్తున్నామన్నారు. అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి అపోహలు అవసరం లేదన్నారు మంత్రి నారాయణ. మూడేళ్లలోనే మాస్టర్ ప్లాన్‌తో అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఏడాదిలోపు అధికారుల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలను పూర్తి చేస్తామన్నారు. అమరావతిలో సుమారు 360 కి.మీ. ట్రంక్ రోడ్లు ఏడాదిన్నరలో నిర్మిస్తామన్నారు. రైతుల రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్లలోని రోడ్లు రెండున్నరేళ్లలో.. ఐకానిక్ టవర్లు మూడేళ్లలో నిర్మిస్తామని చెప్పారు.

## స్వశక్తితో ఉన్నత శిఖరాలకు ఎదిగి పలువురికి మార్గదర్శకంగా నిలిచిన మహా మనిషి సర్వేపల్లి రాధాకృష్ణన్ -నేడు ఆయన వర్ధంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

వృత్తి రీత్యా, వ్యక్తిత్వ రీత్యా, సంస్కార రీత్యా సర్వేపల్లి మహోన్నతుడు. పువ్వ పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు చిన్నతనం నుంచి అసాధారణ ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించిన డాక్టర్ సర్వేపల్లి.. స్వశక్తితో ఉన్నత శిఖరాలకు ఎదిగి పలువురికి మార్గదర్శకంగా, తన వృత్తి ధర్మానికి మకుటంగా వెలిగారు. గురువులకే గురువుగా ఉపాధ్యాయవృత్తికే ఆదర్శంగా నిలిచారు ఆయన..



సర్వేపల్లి రాధాకృష్ణన్ సెప్టెంబర్ 5, 1888 జన్మించి? ఏప్రిల్ 17, 1975 మరణించారు. భారతదేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతి మరియు రెండవ రాష్ట్రపతి కూడా. అంతేకాదు భారతీయ తాత్వికచింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశ పెట్టినాడని ప్రతీతి. రెండు పర్యాయాలు ఉపరాష్ట్రపతి పదవి చేపట్టి, తరువాత రాష్ట్రపతిగా ఒక పర్యాయం పదవిని చేపట్టి, భారతదేశపు అత్యంత క్లిష్టకాలంలో(చైనా, పాకిస్తానులతో యుద్ధ సమయం) ప్రధానులకు మార్గనిర్దేశం చేశారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ 5-9-1888న మద్రాసుకు ఈశాన్యంగా 64 కి.మీల దూరమున ఉన్న తిరుత్తణిలో సర్వేపల్లి వీరస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించాడు. వారి మాతృభాష తెలుగు. సర్వేపల్లి బాల్యము, విద్యాభ్యాసము ఎక్కువగా తిరుత్తణి మరియు తిరుపతిలోనే గడిచిపోయాయి. ప్రాథమిక విద్య తిరుత్తణిలో సాగింది. తిరుపతి, నెల్లూరు, మద్రాసు క్రిస్టియన్ కాలేజీ మున్నగుచోట్ల చదివి ఎం.ఏ పట్టా పొందాడు. బాల్యం నుండి అసాధారణమైన తెలివితేటలు కలవాడాయాన. 1906లో 18 సంవత్సరాల చిరుప్రాయంలో శివకామమ్మతో వివాహము జరిగింది. వీరికి ఐదుగురు కూతుళ్ళు, ఒక కుమారుడు కలిగారు.

వీళ్లది చాలాపేద కుటుంబం. ఉన్నత విద్య చదివించే స్తోమత లేదని తండ్రి వీరాస్వామి కొడుకును పూజారిగా చేయమన్నారు. కానీ రాధాకృష్ణన్‌కు చదువంటే ప్రాణం. అందుకే ఉన్నత పాఠశాల చదువుకోసం తిరుపతిలోని మిషనరీ పాఠశాలలో చేరారు. ఇక అప్పటినుంచీ ఈయన చదువంతా ఉపకారవేతనాలతోనే సాగిపోయింది. భోజనం చేసేందుకు అరిటాకు కూడా కొనలేని పరిస్థితుల్లో ఆయన నేలను శుభ్రపరచుకొని భోజనం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో తత్వశాస్త్రంలో ఎమ్మే పూర్తిచేసిన రాధాకృష్ణన్ ఇరవై ఏళ్ల వయసులోనే మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బోధకుడిగా చేరారు. ఆయన పాఠం చెప్పే తీరు విద్యార్థుల్లో ఎంతో ఆసక్తి కలిగించేది. ఆయన రోజులో 12 గంటలపాటు పుస్తకాలు చదువుతూనే ఉండేవారు. ఎన్నో విలువైన వ్యాసాలు, పరిశోధన పత్రాలను రాసేవారు. రాధాకృష్ణన్ మైసూర్ విశ్వవిద్యాలయం, కోల్‌కతా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ పదవులు చేపట్టడమే కాదు, ఆంధ్రా యూనివర్సిటీ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతి (వైస్‌ఛాన్స్‌లర్) గా పనిచేశారు. రష్యాలో భారత రాయబారిగా కూడా పనిచేశారు.

ఆయన రాసిన 'ఇండియన్ ఫిలాసఫీ' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ప్రత్యేక ఆహ్వానంపై ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ప్రసంగించారు. 'యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్'లో సభ్యుడిగా ఉండి మన విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎన్నో విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు రాధాకృష్ణన్.

1952లో మన మొదటి ఉపరాష్ట్రపతిగా, 1962లో భారత రెండో రాష్ట్రపతిగా అత్యున్నత పదవులు చేపట్టారు. 1954లో భారతరత్న పురస్కారం దక్కింది. అయినా ఏనాడూ ఆడంబరాలకు పోలేదు.

రాష్ట్రపతిగా ఉన్నప్పుడు వచ్చే వేతనంలో కేవలం 25 శాతం తీసుకుని మిగతాది ప్రధాన మంత్రి సహాయ నిధికి తిరిగిచ్చేవారు.

1967లో రాష్ట్రపతి గా పదవీ విరమణ చేసిన తర్వాత డాక్టర్ సర్వేపల్లి మద్రాసులోని తన సొంత ఇంటికి వెళ్లిపోయారు. చివరి రోజుల్లో తాత్విక చింతన చేస్తూ గడిపారు. 1975 ఏప్రిల్ 17న ఆయన తుదిశ్వాస విడిచారు.

రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడు విద్యార్థులకు శ్రద్ధగా బోధించడమే కాదు, వారిపై ప్రేమాభిమానాలు చూపేవారు. ఆయన మైసూరు నుంచి కలకత్తాకు ప్రొఫెసర్‌గా వెళ్లేప్పుడు గుర్రపు బండిని పూలతో అలంకరించి తమ గురువును కూర్చోబెట్టి రైల్వేస్టేషన్ వరకు విద్యార్థులే లాక్కుంటూ వెళ్లారట. రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయన శిష్యులు, అభిమానులు పుట్టినరోజును ఘనంగా చేస్తామని కోరగా, దానికి బదులు ఆ రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా చేయాలని ఆయన కోరారట. ఆరోజు నుంచే ఆయన పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

# నోరు తెస్తున్న తంటా...

హైదరాబాద్, ఏప్రిల్ 16,

బీఆర్ఎస్ నేతలు నోరు పారేసుకుంటున్నారు. వాళ్లు చేసే వ్యాఖ్యలతో పార్టీ పరువును దిగజారుస్తున్నారు. ప్రజల్లో మరింత పలుచన అవుతున్నారు. రాజకీయ విమర్శలు చేయడం వరకూ ఓకే కానీ, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పడగొడతామని చేస్తున్న వ్యాఖ్యలు ఆ పార్టీని మరింత డ్యామేజీ చేస్తాయని చెప్పక తప్పదు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అప్పులు చేయడం మినహా ఏం చేసిందని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్టుల పేరుతో కోట్లాది రూపాయలు దోచుకోవడం మినహాయించి పేద ప్రజలకు చేసిందేమీ లేదని కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అలాంటి బీఆర్ఎన్ నేతలు అధికారంలోకి వచ్చిన కాంగ్రెన్ ను కూలదోసేందుకు ప్రయత్నాలు చేయడం ఎంత వరకూ సబబని ప్రశ్నిస్తున్నారు. కవిత వార్నింగ్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదట్లోనే... గతంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి రావడానికి రెడీ గా ఉన్నారని, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని పల్లా రాజేశ్వర్ రెడ్డి లాంటి నేతలు చేసిన వ్యాఖ్యలు అప్పట్లో కాక పుట్టించాయి. కట్ చేస్తే బీఆర్ఎస్ కు చెందిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వైపునకు వెళ్లడం చూశాం. ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే చేసిన ఈ వ్యాఖ్యలు ప్రజా తీర్పును అగౌరవపర్చే విధంగా ఉన్నాయి. అప్పట్లోనే అనేకమంది ఈ వ్యాఖ్యలను తప్పుపట్టారు. తాజాగా మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారాయి. అయితే ఆయన చేసిన వ్యాఖ్యలు రియల్టర్లకు, వ్యాపారులకు అండగా నిలిచేటట్లు ఉన్నాయన్న కామెంట్స్ వినపడుతున్నాయి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేయాలని వ్యాపారులు, రియల్టర్లు కోరుకుంటున్నారని, అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చి వేయడానికి తాము ఆర్థిక సహకారం అందిస్తామని చెప్పారని కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు మంట రేపుతున్నాయి. కేసీఆర్ ఆత్మగా భావించే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వంపై కుట్ర జరగుతుందనడానికి నిదర్శనమని అన్నారు. మంత్రి వర్గ విస్తరణ జరిగితే ప్రభుత్వం కుప్పకూలడం ఖాయమని మరో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కూడా వ్యాఖ్యానించారు. అంటే రియల్టర్లకు, వ్యాపారులకు ప్రభుత్వభూములను అప్పగించి వారి వద్ద నుంచి డబ్బులు దండుకోవడానికి బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రయత్నంలో భాగంగానే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఈ జిల్లాల్లో వర్షాలుబి : పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు... దీంతో కొత్త ప్రభాకర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ నేతలు తొగుట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అయితే కాంగ్రెస్ నేతలు వరసపెట్టి కౌంటర్లు ఇవ్వడంతో పాటు ప్రజల్లో కూడా ఒకరకమైన కొత్త ప్రభాకర్ రెడ్డి మాట మార్చారు. తనను అడ్డుకున్నా, తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, అవసరమైతే లై డిటెక్టర్ పరీక్షలకు కూడా సిద్ధమని కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. తాను అన్న మాటలను వక్రీకరించి చెబుతున్నారని అన్న ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పాలన చూసి ప్రజలు విసుగు చెందుతున్నారని అన్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో నిజానిజాలు ఎంత ఉన్నప్పటికీ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రజాతీర్పును పక్క దోవ పట్టించే విధంగా ఉన్నాయన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. ఇలాగే జరిగితే కారు గ్యారేజీకే పరిమితమవుతుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి

## 6వ ఆర్థిక సంఘం చైర్మన్ డా.అరవింద్ పనగారియా బృందానికి

### స్వాగతం పలికిన మంత్రి పయ్యావుల కేశవ్

విజయవాడ

ఆంధ్రప్రదేశ్లో రెండు రోజుల పర్యటన నిమిత్తం నగరానికి విచ్చేసిన 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియా కి గన్నవరం విమానాశ్రమంలో రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ సాదర స్వాగతం పలికారు. మన రాష్ట్రానికి విచ్చేసిన ఆర్థిక సంఘం బృందంలో ఛైర్మన్తో పాటు 16వ ఆర్థిక సంఘం సభ్యులు అన్నే జార్జ్ మ్యాథ్యూ, డాక్టర్ మనోజ్ పాండా ఉన్నారు.

రాష్ట్రంలో రెండు రోజులపర్యటనలో భాగంగా తిరుపతి, విశాఖపట్నం నగరాల్లో జరిగే ప్రత్యేక సమావేశ కార్యక్రమాల్లో 16వ ఆర్థికసంఘంతో కలిసి రాష్ట్రప్రభుత్వం పలు ఆర్థిక అంశాలపై చర్చించనుంది. రాష్ట్ర పురోగతికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, అందాల్సిన సాయం వంటి కీలకమైన ఆర్థిక, ప్రణాళిక అంశాలపై రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ 16వ ఆర్థిక సంఘం ముఖ్య అధికారులకు వివరించనున్నారు. 16వ ఆర్థిక సంఘం ప్రతినిధులకు స్వాగతం పలికిన వారిలో ఆర్థికమంత్రితోపాటు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, సంబంధిత శాఖల ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## ఈడీ కార్యాలయం ముందు విహెచ్ ధర్నా

హైదరాబాద్

నేషనల్ హెరాల్డ్ విషయంలో కక్ష పూరితంగా ఏఐసీసీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ఛార్జ్ షీట్ లో చేర్చడాన్ని నిరసిస్తూ మాజీ ఎంపీ వి హనుమంతరావు ఆధ్వర్యంలో బషీర్ బాగులోని ఈడీ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. దేశంలో పేద ప్రజలు రైతులు నిరుద్యోగుల గురించి పోరాడే వారిపై బిజెపి కక్షపూరితంగా కేసులు పెడుతోందని ఆరోపించారు. టిపిసిసి ఆధ్వర్యంలో గురువారం ఈడి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఇప్పటికే ప్రకటించి నప్పటికీ వీ హనుమంతరావు మాత్రం ఈడీ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు

## ట్రాక్టర్ బోల్తా.. యువకుడి మృతి

సిద్దిపేట

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పోతారం (జే) గ్రామంలో బుధవారం తెల్లవారుజామున విషాద ఘటన చోటుచేసుకుంది. ట్రాక్టర్ బోల్తాపడి లింగాల భాను అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ ఇంజన్ మధ్యలో భాను శరీరం మొత్తం ఇరుక్కుపోయింది. తలభాగం మాత్రమే బయటకి కనబడడంతో జెసిబి సహాయంతో ట్రాక్టర్ ను పైకి లేపి భాను మృతదేహాన్ని బయటకు తీశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

## మాంటీసోరీ స్కూలు లో ఏబీవీపీ అందోళన ఫర్నిచర్ ధ్వంసం

యాదాద్రిభువనగిరి లోని "మాంటీసోరీ" స్కూల్ లో ఉద్రిక్తత నెలకొంది. స్కూల్ ఫీజు కట్టలేదని విద్యార్థులను పరీక్షకు ని యాజమాన్యం అనుమతించలేదు. స్కూల్ నిర్వాహకుల వైఖరిని నిరసిస్తూ ఏబీసీపీ విద్యార్థులు ఆందోళనకు దిగారు. స్కూల్ లో ఫర్నీచర్ ధ్వంసం చేసారు ఆందోళనకారులు.

## జీఎస్టీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ధర్నా

ఖమ్మంఖమ్మం నగరంలోని జీఎస్టీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన జరిగింది. , నేషనల్ హెరాల్డ్ స్కాం లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లు చేర్చటం పట్ల నిరసన తెలిపిన కాంగ్రెస్నేతలు నల్ల జెండాలతో నినాదాలు చేసారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాల్ల దుర్గా ప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ ఎఫెక్ట్... మేకిన్ ఇండియాకు లైఫ్...

ముంబై, ఏప్రిల్ 16

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌విధిస్తున్న కొత్త సుంకాలతో ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమైంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ కూడా కుప్ప కూలే పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో ట్రంప్ సుంకాల అమలును మూడు నెలలు వాయిదా వేశారు. అయితే చైనాపై మాత్రం సుంకాలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇదే ఇప్పుడు భారత తయారీ రంగానికి బూస్ట్‌గా మారింది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన కొత్త సుంకాలు (టారిఫ్‌లు) చైనా ఉత్పత్తులపై భారీగా ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత తయారీ రంగానికి అనూహ్యమైన అవకాశాలు ఏర్పడుతున్నాయి. చైనాపై అధిక సుంకాలతో పోలిస్తే, భారత్‌పై సాపేక్షంగా తక్కువ సుంకాలు విధించడం ద్వారా భారత్‌కు ట్రంప్ ఒక రకంగా గొప్ప రాజకీయ, ఆర్థిక అవకాశాన్ని అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని భారత్‌సద్వినియోగం చేసుకుంటే, తయారీ రంగంలో చైనాకు గట్టి పోటీ ఇచ్చే స్థాయికి చేరే అవకాశం ఉంది.ఇటీవల ఒకే రోజు మూడు కార్గో విమానాలు భారత్‌లో తయారైన ఐఫోన్‌లతో అమెరికాకు బయలుదేరిన వార్త దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించింది. ట్రంప్ కొత్త సుంకాలు అమల్లోకి రాకముందే ఈ ఉత్పత్తులను అమెరికాకు చేర్చేందుకు ఆపిల్ సంస్థ వేగంగా వ్యవహరించింది. గత కొన్ని సంవత్సరాలుగా భారత్‌లో ఐఫోన్‌ల తయారీని ఆపిల్ విస్తరిస్తోంది. ప్రస్తుతం, ఆపిల్ ఉత్పత్తిలో 10?15% భారత్‌లో జరుగుతోంది, మరియు దీనిని 2025 నాటికి 25%కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.చైనాపై 104% సుంకాలు విధించిన ట్రంప్, భారత్‌పై కేవలం 26% సుంకాలు నిర్ణయించారు. దీనివల్ల చైనాలో తయారైన ఐఫోన్‌లతో



పోలిస్తే, భారత్‌లో ఉత్పత్తి చేసిన ఐఫోన్‌లు అమెరికా మార్కెట్‌లో ధర పరంగా గణనీయంగా పోటీదారుగా నిలుస్తాయి. ఒక ఐఫోన్ తయారీ ఖర్చు 450 డాలర్లు అనుకుంటే, చైనాలో ఉత్పత్తి చేస్తే సుంకాలతో కలిపి అమెరికాలో దాని ధర 918 డాలర్లకు చేరుతుంది, అయితే భారత్‌లో తయారైనది కేవలం 567 డాలర్లకే అందుబాటులో ఉంటుంది. ఈ ధరల వ్యత్యాసం ఆపిల్‌ను భారత్‌లో ఉత్పత్తిని విస్తరించేలా ప్రోత్సహిస్తోంది.చైనా?అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఇరు దేశాలు ఒకరిపై ఒకరు అధిక సుంకాలు విధిస్తూ, వాణిజ్య ఆంక్షలను కఠినతరం చేస్తున్నాయి. ఈ పరిస్థితి చైనా ఉత్పత్తులకు అమెరికా మార్కెట్‌లో డిమాండ్‌ను గణనీయంగా తగ్గిస్తోంది. ఈ ఖాళీని భర్తీ చేయడానికి భారత్ అనువైన గమ్యస్థానంగా మారుతోంది.కరోనా మహమ్మారి తర్వాత, చైనాపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు 'చైనా+1' వ్యూహాన్ని అనుసరించాయి. ఈ వ్యూహంలో భాగంగా, భారత్‌లో తమ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపాయి. అయితే, ఊహించిన స్థాయిలో ఈ అవకాశాలను భారత్ సద్వినియోగం చేసుకోలేకపోయిందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇప్పుడు, ట్రంప్ సుంకాల విధానం ద్వారా భారత్‌కు కొత్త అవకాశాలు తలుపులు తెరుస్తోంది. ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్ భాగాలు, మరియు ఇతర తయారీ రంగాల్లో భారత్ ఈ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.

ట్రంప్ సుంకాలు భారత్‌కు అవకాశాలను తెచ్చిపెట్టినప్పటికీ, కొన్ని సవాళ్లు కూడా ఎదురవుతాయి. భారత్‌పై విధించిన 26% సుంకాలు, చైనాతో పోలిస్తే తక్కువైనప్పటికీ, ఇతర ఆసియా దేశాలైన జపాన్(24%) మరియు దక్షిణ కొరియా (25%)తో పోలిస్తే ఇది ఎక్కువే. ఈ సుంకాలు భారత ఎగుమతులపై కొంత ప్రభావం చూపవచ్చు, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ఆభరణాలు, మరియు ఇంజనీరింగ్ వస్తువుల వంటి రంగాల్లో. అయినప్పటికీ, భారత్‌కు ప్రస్తుతం ఉన్న సాపేక్ష ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకోవడానికి కొన్ని కీలక చర్యలు అవసరం.

మౌలిక సదుపాయాల అభివృద్ధి: తయారీ కేంద్రాల స్థాపనకు అనువైన లాజిస్టిక్స్, విద్యుత్ సరఫరా, మరియు రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలి.

వ్యాపార సౌలభ్యం: విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు బిజినెస్ ఈజ్ ఆఫ్ డూయింగ్‌ను మెరుగుపరచడం ద్వారా, అడ్మినిస్ట్రేటివ్ ఆటంకాలను తగ్గించాలి.

ప్రోత్సాహకాల విస్తరణ: ప్రస్తుతం ఉన్న ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకాలను మరింత విస్తరించి, ఎక్కువ రంగాలను చేర్చాలి.

నైపుణ్య శిక్షణ: తయారీ రంగంలో అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు శిక్షణా కార్యక్రమాలను బలోపేతం చేయాలి.

భారత ప్రభుత్వం చొరవ: ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో భారత ప్రభుత్వం చొరవ కీలక పాత్ర పోషిస్తుంది. గతంలో చైనా+1 వ్యూహంలో భాగంగా వచ్చిన అవకాశాలను పూర్తిగా వినియోగించుకోలేకపోయిన నేపథ్యంలో, ఇప్పుడు తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తును నిర్ణయిస్తాయి. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చలను వేగవంతం చేయడం, విదేశీ సంస్థలకు ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలను అందించడం, మరియు దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంచడం వంటి చర్యలు అత్యవసరం. అదే సమయంలో, చైనా ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను ఎంచుకునే సంస్థలు, దీర్ఘకాలికంగా ఇక్కడే పెట్టుబడులు పెట్టేలా చూడాలి. ఇందుకోసం, భారత్ తన ఆర్థిక విధానాలలో స్థిరత్వాన్ని కొనసాగించాలి. తద్వారా భారత్ తయారీ రంగంలో కొత్త శకాన్ని ప్రారంభించవచ్చు.

## మే 15 నుంచి సరస్వతి పుష్కరాలు

హైదరాబాద్, ఏప్రిల్ 16,

తెలంగాణలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలో సరస్వతీ నది పుష్కరాలకు ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ పుష్కరాల కోసం దేవాదాయ శాఖ రూ.25 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. పుష్కరాలకు లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున వారి కోసం స్నాన ఘట్టాల నిర్మాణం, రోడ్ల విస్తరణ, డ్రైనేజీల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలు కల్పించేలా ఏర్పాటు చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. 2025 మే 15న సూర్యోదయంతో పుష్కర పుణ్యస్నానాలు ప్రారంభమవుతాయి.. మే 26 వరకు కొనసాగుతాయని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఏడాదికి ఓ నదికి పుష్కరాలు వస్తాయ్. 2025లో సరస్వతీ నదికి పుష్కరాలొస్తున్నాయ్.పూర్వం పుష్కరుడు అనే బ్రాహ్మణుడు శివుడి కోసం తపస్సు ఆచరించాడు. భక్తికి మెచ్చి ప్రత్యక్షమైన శివుడు ఏదైనా వరం కోరుకోమని అడిగాడు. ఓ దేవా జీవులు చేసిన పాపాలతో నదులన్నీ అపవిత్రమవుతున్నాయి. నదులు పునీతమైతే ప్రజలు సుభిక్షంగా ఉంటారు ఆ శరీర స్పర్శతో నదులు పునీతం అయ్యేలా వరం ఇమ్మని అడిగాడు. నువ్వు ఏ నదిలోకి ప్రవేశిస్తే ఆ నది పునీతం అవుతుందనే వరం ఇచ్చాడు శివుడు. అలా పుష్కరుడు ఏడాదికి ఓనదిలో ప్రవేశిస్తాడు. అది కూడా బృహస్పతి రాశి మారిన సమయంలో. ఏడాదికి ఓ రాశిలోకి పరివర్తనం చెందుతాడు బృహస్పతి. మొదటి 12 రోజులను ఆది పుష్కరాలుగా, చివరి 12 రోజులను అంత్య పుష్కరాలుగా నిర్వహిస్తారు. బృహస్పతి ఒక్కో రాశిలో ప్రవేశించినప్పుడు క్రమ పద్ధతిలో పుష్కరాలు జరిగేలా రూపొందించారు పండితులు. గురువు మేష రాశిలో ప్రవేశించినప్పుడు గంగానదికి, వృషభ రాశిలో ప్రవేశిస్తే నర్మదానది, మిథునంలో ప్రవేశిస్తే సరస్వతి, కర్కాటకంలో ఉన్నప్పుడు యమునానది, సింహరాశిలో ప్రవేశిస్తే గోదావరి నదికి..ఇలా ఒక్కో రాశిలో ప్రవేశించినప్పుడు ఒక్కో నదికి పుష్కరాలు జరుగుతాయి. అలా ఈ ఏడాది సరస్వతీ నది పుష్కరాలు మే 15 నుంచి 26 వరకు జరుగుతాయిముక్తీశ్వర లింగానికి వున్న నాసిక రంధ్రాల గుండా ఎంత నీరు పోసినా బయటికి రాకుండా భూమార్గంలో ప్రవహించి సరస్వతి నదిరూపంలో గోదావరి, ప్రాణహిత నదులతో కలిసి త్రివేణి సంగమంగా ఏర్పడిందని చెబుతారు. అందుకే సరస్వతీ నదికి గుప్త కామినీ అనే మరో పేరుంది. కాశీ క్షేత్రంలానే కాళేశ్వరం కూడా పిండ ప్రదానానికి ముఖ్యమైన క్షేత్రం అని చెబుతారు. కాశీ కి వెళ్ల లేని వాళ్ళు ఇక్కడ గోదావరి-ప్రాణహిత-సరస్వతి నదుల త్రివేణి సంగమ స్థానంలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో గంగా, యమున మరియు సరస్వతి నదుల సంగమం ఉంది కానీ ఇక్కడ సరస్వతి నది అంతర్వాహిని. ఇంకా గుజరాత్ దగ్గర సిద్ధపూర్, మానా దగ్గర కూడా సరస్వతి పుష్కరాలు జరుగుతాయి. సరస్వతి నది హిమాచల్ ప్రదేశ్‌లోని శివాలిక్ కొండల నుంచి ప్రారంభమై, హర్యానా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల గుండా ప్రవహించి కచ్ సింధుశాఖ వద్ద అరేబియా సముద్రంలో కలుస్తుంది.

## రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా కనుమరుగవుతున్న చెరువు

సూర్యాపేటసూర్యాపేట జిల్లాలో "మైనింగ్ మాఫియా" రెచ్చిపోతుంది.చివ్వెంల మండలంలోని రాజు తండా చెరువును తమ కబంధ హస్తాల్లో బంధించి,మట్టిని దోచుకుతింటోంది.కళ్ల ముందే చెరువు మాయమవుతున్నా అధికారులు గమనించడంలేదు.ఈ అక్రమాల వల్ల పర్యావరణం ఛిద్రమవుతోంది.భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వ్యవసాయ భూములు నిస్సారంగా మారుతున్నాయి. రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతూ కోట్లకు పడగలెత్తుతున్న అక్రమార్కులపై మైనింగ్ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానం గా మారింది..జిల్లా మైనింగ్ శాఖ అధికారులు ఏం చేస్తున్నారు?

## ముఖం చాటేస్తున్న మంత్రులు

హైదరాబాద్, ఏప్రిల్ 16, (

కాంగ్రెస్ మంత్రులు గాంధీభవన్ ముఖం చూడటమే మానేశారు. ప్రతివారం ఇద్దరు మంత్రులు గాంధీభవన్‌లో పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటారని ప్రకటించిన షెడ్యూల్ మూడు రోజుల ముచ్చటగా మిగిలింది. ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కార మార్గం చూపాల్సిన మంత్రులు గాంధీభవన్‌కు రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ప్రజా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఇటు కార్యకర్తలు అటు ప్రజలు గాంధీభవన్ చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడాల్సి వస్తోందంట.. అసలు మంత్రుల షెడ్యూల్‌లో మార్పులు ఎందుకు వచ్చాయి? మళ్ళీ గాంధీభవన్‌కి మంత్రుల వస్తారా? పార్టీ వర్గాల్లో దానిపై జరుగుతున్న చర్చేంటి?ప్రజా పాలనలో ప్రజల సమస్యలు తెలుసుకోవాలి, ప్రజలకు దగ్గర కావాలి, ప్రజల సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతో వారానికి ఇద్దరు మంత్రులు గాంధీభవన్‌లో అందుబాటులో ఉండేలా కాంగ్రెస్ పెద్దలు షెడ్యూల్ రూపొందించారు. సచివాలయంలో మంత్రులు తమ డిపార్టమెంట్ పనులతో బిజీబిజీగా ఉంటారు. కాబట్టి ప్రజలు సచివాలయానికి వెళ్ళినా మంత్రులను కలిసే అవకాశం పెద్దగా ఉండదు . సమస్యలు తెలుసుకునే అవకాశం ఉండదు.అందుకే మంత్రులను కలిసే వెసులుబాటు ఉండాలి, ప్రజల సాధక బాధకాలు చెప్పుకునే సౌలభ్యం ఉండాలనే ఉద్దేశంతో గాంధీభవన్లో వారానికి ఇద్దరు మంత్రులు అందరికీ అందుబాటులో ఉంటారని పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రకటించారు. వారంలో ఇద్దరు మంత్రులు పక్కాగా గాంధీభవన్‌కు వస్తారు,ప్రజల సమస్యలు తెలుసుకుంటారు, ప్రజలిచ్చే అర్జీలను తీసుకుంటారు, సమస్యలను పరిష్కరిస్తారనే ఉద్దేశంతో గాంధీభవన్‌లో ఆయన మంత్రుల ప్రోగ్రామ్స్ ను ఏర్పాటు చేశారు.వారంలో ప్రతి బుధవారం, శుక్రవారం గాంధీభవన్‌లో మంత్రులు అందుబాటులో ఉంటారని పీసీసీ ఛీఫ్ షెడ్యూల కూడా ఖరారు చేశారు. దానికి తగ్గట్లే ఆరంభంలో కొన్ని వారాలు వారానికి ఇద్దరు చొప్పున మంత్రులు వచ్చారు ప్రజల సమస్యలను విన్నారు. అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులు, అదేవిధంగా జిల్లా కలెక్టర్లతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. మొదట్లో వారానికి ఇద్దరు మంత్రులు వచ్చేవారు. అది కాస్త తర్వాత వారానికి ఒకే మంత్రి అయ్యారు. మంత్రులు వచ్చినప్పుడు గాంధీభవన్‌కు పెద్ద ఎత్తున ప్రజలు చేరుకొని తమ ఇబ్బందులు చెప్పుకునేవారు. మంత్రులు వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవడంతో గాంధీభవన్ కి వెళ్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకం ప్రజల్లో ఏర్పడింది.తీరా చూస్తే కొన్ని వారాల నుండి మంత్రులు గాంధీభవన్‌కు రావడం లేదు. పీసీసీ అధ్యక్షుడు కూడా మంత్రులను గాంధీభవన్ కి తీసుకువచ్చే అంశంపై సీరియస్‌గా దృష్టి పెట్టడం లేదనే చర్చ జరుగుతుంది. స్వయంగా తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయనే ఉద్దేశంతో కార్యక్రమం మొదలుపెడితే.. కొద్ది కాలంగా మంత్రులు గాంధీభవన్‌కు రాకపోతుండటంతో ప్రజలు కూడా అటు వైపు రావడం మానేస్తున్నారు. ఇక సమస్యలు చెప్పుకుందామని సచివాలయానికి వెళ్తూ తమ శాఖల పనుల మీద మంత్రులు బిజీగా ఉంటున్నారంట. లేకపోతే సంబంధిత మంత్రులు ప్రజలు వెళ్లిన సమయంలో అందుబాటులో ఉండడం లేదంట. కొన్ని సందర్భాల్లో మంత్రులు ఉన్నా మంత్రుల సిబ్బంది తమను కలవనీయకుండా అడ్డుకుంటున్నారని జనం విమర్శిస్తున్నారు.ఓ వైపు గాంధీభవన్ కు మంత్రులు రాకపోవడం.. మరోవైపు సచివాలయంకి వెళ్తే మంత్రులు దొరకకపోవడంతో.. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక కార్యకర్తలు, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారట. గాంధీభవన్‌కు మంత్రులు వచ్చేలా మరోసారి పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ చొరవ తీసుకొని, రెగ్యులర్‌గా వారానికి రెండు రోజులు మంత్రులు అందుబాటులో ఉండేలా చూస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని పార్టీ వర్గాలు అంటున్నాయి. అంతేకాకుండా నెలారెండు నెలలకు ఒకసారైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాంధీభవన్ కు వచ్చేలా మహేష్ కుమార్ గౌడ్ చొరవ చూపితే ప్రజా సమస్యలు వేగవంతంగా పరిష్కారం అవుతాయని రాజకీయ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది.మొత్తానికి గాంధీభవన్‌కు మంత్రుల షెడ్యూల్ తప్పడంతో?కాంగ్రెస్ ఏ పని తలపెట్టినా ఆరంభ శూరత్వమే అవుతుందనే చర్చ పొలిటికల్ సర్కిల్లో జరుగుతుంది. మరి గాంధీభవన్ కు మళ్లీ మంత్రులను రప్పించి ఆ విమర్శలను పీసీసీ చీఫ్ తిప్పికొడతారా? కొన్ని వారాలుగా గాంధీభవన్‌లో దర్శనమివ్వని మంత్రులు మళ్లీ రీ ఎంట్రీ ఇస్తారా? అన్నది చూడాలి.

## భూ సమస్యలు తీర్చడానికి భూ భారతి కోదండరెడ్డి, రైతు కమిషన్ చైర్మన్

హైదరాబాద్

కరోనా సమయంలో సైతం లెక్కచేయకుండా పంట సాగుచేసిన రైతులకు ధన్యవాదాలు. రెవెన్యూ శాఖ అన్ని శాఖలకంటే కీలకం. ఎన్ని ఇబ్బందులు వచ్చిన రైతుల కోసం కాంగ్రెస్ అధికారంలో వున్న సమయంలో చాలా సంస్కరణలు తీసుకొచ్చిందని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. పొల్కంపల్లిలో జరిగిన రైతు కార్యక్రమంలో అయన మాట్లాడారు. ఇందిరా గాంధీ తర్వాత రేవంత్ రెడ్డి రైతు లకోసం ఎక్కువగా ఆలోచన చేస్తున్నారు. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను ఆగం చేసింది. కేసీఆర్, కేటీఆర్ కలిసి రెవెన్యూ అధికారాలను కేంద్రీకృతం చేశారు. ప్రైవేట్ కంపెనీ చేతికి ధరణి పోర్టల్ ఇచ్చారు. ధరణి వల్ల లక్షలాది మంది రైతులు ఆగమయ్యారు . సీఎం రేవంత్ రెడ్డి రైతుల భూ సమస్యలు తీర్చడానికి భూ భారతిని తీసుకొచ్చారు. నాతోపాటు న్యాయశాస్త్రం చదువుకున్న సునీల్.. భూ సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్నారు. ఇందిరా ఏవిదంగా లక్షల ఎకరాల భూమిని పంపిణి చేసిందో.. ఈ నాడు రేవంత్ లక్షల ఎకరాల భూమిని చిక్కులను తొలగిస్తున్నారు. రైతులకోసమే రైతు కమిషన్ వేశారు. కమిషన్ లో వున్న వారాంతం రైతులుగా పనిచేసినవారే నని అన్నారు.నా జీవితంలో ఇప్పటి వరకు చూడాలే ఏకకాలంలో 21 వేలకోట్ల రుణమాఫీ చేయలేదు. 500 రూపాయల బోనస్, భరోసా పథకాలన్నీ రైతులకోసం చేసినవే. వినోవా భావే గారు దేశమంతా తిరిగి భూములు పేదోళ్లకు పంచిపెట్టారు. భూదాన్ భూములు కూడా అలా వచ్చినవే. సీఎం రేవంత్ రెడ్డి ఏదైన నిర్ణయం తీసుకుంటే వెనక్కి పోడు. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పి చేసిండు. అంబెద్కర్ జయంతి రోజు భూ భారతి తెచ్చారని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాల లోని ఊడిన పైకప్పు పెచ్చులు విద్యార్థిని కి తీవ్ర గాయాలు

వికారాబాద్‌వికారాబాద్ జిల్లా వికారాబాద్ మండలం మున్నూరు సోమారం ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న శిరీష (6 ) పై పాఠశాల పైకప్పు పెచ్చులూడి అమ్మాయి తలపై, చెవికి, కాళ్లకు తగిలి గాయాలయ్యాయి. సకాలంలో స్పందించిన ఆ పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి ఆ అమ్మాయిని మా శారద హాస్పిటల్ వికారాబాద్ కు తరలించగా, డాక్టర్ రాజశేఖర్ ఆ బాలికకు చికిత్సను అందిస్తున్నారు.

## కాక రేపుతున్న మంత్రి పదవులు

హైదరాబాద్, ఏప్రిల్ 16,

కేబినెట్ విస్తరణ తెలంగాణ కాంగ్రెస్‌లో కాక రేపుతోంది. మంత్రి పదవులపై లుకలుకలు మొదలయ్యాయి. మాకంటే మాకంటూ కేబినెట్ బెర్త్ కోసం కర్చీఫ్ వేస్తున్నారు ప్రముఖులంతా. ఉగాదికే జాబితా వస్తుందనుకుంటే.. అది కాస్తా ఆలస్యం అవుతుండటంతో రచ్చ రాజుకుంటోంది. ఆ ఉక్కబోత భరించలేక ఆశావహులు ఒక్కొక్కరిగా నోరు జారుతున్నారు. బహిరంగంగానే బయటపడుతున్నారు. ఇప్పటికే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. మాజీ మంత్రి జానారెడ్డిని టార్గెట్ చేయగా.. లేటెస్ట్‌గా ప్రేమ్ సాగర్ రావు.. ఓ కుటుంబాన్ని కార్నర్ చేస్తూ సంచలన కామెంట్స్ చేశారు. కాంగ్రెస్‌లో కలకలం రేపారు.మంత్రి పదవిని అడ్డుకుంటూ.. తన గొంతు కోసేందుకు ఓ కుటుంబం ప్రయత్నిస్తోందంటూ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. గొంతు కోస్తే ఊరుకోబోనని.. కుటిల యత్నాలను తిప్పికొడతానని హెచ్చరించారు. పార్టీని కష్టకాలంలో కాపాడిన వారికి అవకాశాలు కల్పించాలని.. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేయవద్దన్నారు. అన్ని పార్టీలు తిరిగి వచ్చిన వారు మంత్రి పదవి అడుగుతున్నారంటూ కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు. ప్రేమ్ సాగర్ రావు టార్గెట్ చేసింది ఎవరిననే చర్చ జరుగుతోంది తెలంగాణలో.రాజగోపాల్‌రెడ్డి గురించే ప్రేమ్‌సాగర్ అలా అన్నారని కొందరు అంటున్నా.. అది కరెక్ట్ కాదని తెలుస్తోంది. ఆయన మాట్లాడింది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల గురించేనని చెబుతున్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామినే తన మంత్రి పదవికి చెక్ పెడుతున్నారనేది ప్రేమ్ సాగర్ వ్యాఖ్యల అంతరార్థం అంటున్నారు. వివేక్‌తో పాటు కుటుంబంలో ఆయన సోదరుడు వినోద్ కూడా ఎమ్మెల్యేగా ఉన్నారు. కొడుకు వంశీ.. ఎంపీగా కొనసాగుతున్నారు. వివేక్ గతంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. ఆ తర్వాత బీజేపీకి మారారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నారు. అందుకే ఆయన్ను టార్గెట్ చేస్తూ.. అన్ని పార్టీలు తిరిగి వచ్చిన వారు మంత్రి పదవి అడుగుతున్నారంటూ కామెంట్స్ చేశారు. ఉమ్మడి జిల్లా కోటాలో కేబినెట్ రేసులో ప్రేమ్ సాగర్‌కు వివేక్ నుంచి పోటీ ఉంది. ఆ ఫ్యామిలీ గుత్తాధిపత్యం కోసమే.. తన కేబినెట్ బెర్త్ కన్ఫామ్ కాకుండా అడ్డుకుంటున్నారనేది ప్రేమ్ సాగర్ రావు అక్కసుగా తెలుస్తోంది.పెద్దలు జానారెడ్డిని రాజగోపాల్‌రెడ్డి టార్గెట్ చేసిన మరుసటి రోజే ప్రేమ్ సాగర్ రావు సైతం బహిరంగ ఆరోపణలు చేయడం కాంగ్రెస్ పార్టీలో కాస్త కుదుపు వచ్చినట్టైంది. కేబినెట్ విస్తరణ లేట్ అవుతున్నా కొద్దీ.. ఇలాంటి పరిస్థితులే తలెత్తుతాయని.. అందుకే వీలైనంత తొందరగా ఆ పని పూర్తి చేయాలని అధిష్టానానికి మెసేజ్‌లు వెళ్తున్నాయట. నల్గొండలో రాజగోపాల్‌రెడ్డి బలమైన నాయకుడు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రేమ్ సాగర్ రావు తిరుగులేని నేత. వారికి మంత్రి పదవులు ఇవ్వడంపై పార్టీ పెద్దలెవరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు. జానారెడ్డి ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఆయన కుమారుడు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన ఈయన్ను అడ్డుకోవడం అనేది టీ కప్పులో తుఫాను లాంటి వివాదమే తప్ప అంత పెద్దగా చూడాల్సిన అవసరం లేదని అంటున్నారు. ఆదిలాబాద్‌లో మాత్రం ప్రాబ్లమ్ కాస్త సీరియస్ గానే ఉన్నట్టుంది. ప్రేమ్ సాగర్ రావు ప్రస్తుతం ఆ ప్రాంతంలో కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా ఉన్నారు. ఆయన్ను సంతృప్తి పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇంకా ఎవరికీ మంత్రి పదవి దక్కలేదు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, చెన్నూర్‌ఎమ్మెల్యే గడ్డం వివేకానంద, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌లు మంత్రి పదవుల రేసులో ఉన్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు దాదాపు 14 సంవత్సరాలుగా పార్టీని అంటి పెట్టుకుని ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో అందరూ కాంగ్రెస్ పార్టీని వీడిపోయినా ఆయన మాత్రం పార్టీ కోసం ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ సజీవంగా ఉందంటే అది ప్రేంసాగర్‌రావు కృషి వల్లనే అని కాంగ్రెస్ క్యాడర్ భావిస్తారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 66వేలకుపైగా భారీ మెజార్టీతో విజయం సాధించారు. కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు ప్రధానంగా గడ్డం వివేక్ నుంచి పోటీ వస్తోంది. ఆయన ఎస్సీ నేత కావడంతో ప్లస్ గా మారింది. అయితే పలుమార్లు పార్టీ మారి వచ్చారు. ఖానాపూర్ నుంచి ఎమ్మెల్యేగా గెలచిన వెడ్మ బొజ్జు కూడా గిరిజన కోటాలో తనకు పదవి వరిస్తుందనే ఆశతో ఉన్నారు.సామాజిక సమీకరణాలతో తన సీనియార్టీని.. పార్టీకి చేసిన సేవలను గుర్తించకపోతే ఊరుకునేది లేదని ప్రేమ్ సాగర్ రావు బహిరంగంగానే చెబుతున్నారు. మరో వైపు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని అంటున్నారు. తనకు పదవి రాకుండా.. చేసేందుకు జానారెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు.తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు అయిపోయిందని అనుకులోనేలోపే కొత్త కొత్త అడ్డంకులు వచ్చేశాయి. ఉగాది రోజున సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్ ను కలవడంతో మూడో తేదీన మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని అందరూ మానసికంగా రెడీ అయిపోయారు. ఎవరెవరికి బెర్తులన్నదానిపై కాంగ్రెస్ లో చర్చోపచర్చలు జరిగాయి. కానీ ఆ మూడో తేదీ దాటి పది రోజులు అయినా హైకమాండ్ నుంచి ఎలాంటి సమాచారం రావడం లేదు. ఈ లోపు పార్టీ నేతుల ఎవరికి వారు తమకు పదవులు ఇవ్వాల్సిందేనన్న డిమాండ్లపై తెరపైకి వస్తున్నారు. ఒకరికి పదవి ఇచ్చి మరొకరికి ఇవ్వకపోతే అసంతృప్తి పెరిగి పుట్టి మునిగిపోతుందని అసలు మంత్రి వర్గ విస్తరణనే కాంగ్రెస్ హైకమాండ్ ఆలస్యం చేస్తోందన్న ప్రచారం జరుగుతోంది.

భారత శక్తి



# ఉద్యోగులకు ఇంకా అందని జీతాలు

హైదరాబాద్, ఏప్రిల్ 16,

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాల చెల్లింపులో ఆలస్యం అవుతోంది. ఫలితంగా చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు బ్యాంక్ ఈఎంఐలు కట్టడానికి ప్రైవేట్ ఫైనాన్సర్ల దగ్గర అధిక వడ్డీకి డబ్బులు తెచ్చుకుంటున్నారు. గత పదేళ్లుగా జీతాలు రావడం చాలా ఆలస్యం అవుతోందని ఉద్యోగులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని.. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయం ఖర్చులకు సరిపోవడం లేదని, దీనివల్ల జీతాలు చెల్లించడంలో ఆలస్యం జరుగుతోందని చెప్పారు. ఇటు ఎన్నికల హామీలను నెరవేర్చడానికి, సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించాల్సి రావడంతో ప్రభుత్వంపై ఆర్థిక భారం పెరిగింది.గతంలో ప్రభుత్వం తీసుకున్న భారీ రుణాల వల్ల ఇప్పుడు వాటి వాయిదాలు, వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. ఇది రాష్ట్ర ఖజానాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా రైతు రుణమాఫీ, ఇతర పథకాల కోసం తీసుకున్న రుణాలు చెల్లింపులకు ఆటంకం కలిగిస్తున్నాయికొన్నిసార్లు కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఆలస్యం అవుతున్నాయి. ఇది కూడా ఉద్యోగుల జీతాల చెల్లింపుపై ప్రభావం చూపుతుందని అధికారులు చెబుతున్నారు..రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెరగడం, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్లు చెల్లించాల్సి రావడంతో.. జీతభత్యాల కోసం ఎక్కువ నిధులు అవసరమవుతున్నాయి. ఇటీవల పదవీ విరమణ వయస్సు పెంచినప్పటికీ, రాబోయే సంవత్సరాల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పదవీ విరమణ చేయనుండటంతో పెన్షన్ల భారం మరింత పెరిగే అవకాశం ఉంది.ఉద్యోగులకు వేతన సవరణ (ఖఖీఅ), కరువు భత్యం (ఆం) పెంపుదల వంటి అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని అమలు చేస్తే జీతాల చెల్లింపులకు మరింత ఎక్కువ నిధులు అవసరమవుతాయి. ఇది రాష్ట్ర ఖజానాపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది.కొన్నిసార్లు నిధుల నిర్వహణలో సరైన ప్రణాళిక లేకపోవడం లేదా ఇతర కారణాల వల్ల కూడా జీతాల చెల్లింపులో ఆలస్యం జరుగుతోందని తెలుస్తోంది.ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి ప్రయత్నిస్తోంది. ఉద్యోగులకు జీతాలు సకాలంలో చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఉద్యోగులకు అన్ని వాస్తవాలు తెలియజేసి, ఆర్థిక పరిస్థితులపై వారితో చర్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఇటీవల తెలిపారు.జూన్ 2021 నాటి సమాచారం ప్రకారం.. తెలంగాణలో దాదాపు 9.21 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ఇందులో రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లు ఉన్నారు..తెలంగాణలో విద్యాశాఖ, హోంశాఖ, వైద్యారోగ్య శాఖ, రెవెన్యూ శాఖల్లో ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ఈ శాఖల ఉద్యోగుల జీతాల కోసం ఎక్కువ నిధులు ఖర్చు అవుతున్నాయి.

# భూ భారతి చట్టంపై అవగాహన కల్పించిన కలెక్టర్

జయశంకర్ భూపాలపల్లి

భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పనకు మండలస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తహసీల్దార్లను ఆదేశించారు.బుధవారం ఐడిఓసి సమావేశపు హాలులో తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, గిర్దావర్లతో భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలపై రూపొందించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహణకు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ నెలాఖరు వరకు ప్రతి మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అవగాహన సదస్సులకు అధిక సంఖ్యలో ప్రజలు వచ్చేలా గ్రామాలలో టామ్ టామ్ వేయించాలని సూచించారు. రెవెన్యూ శాఖలో పని చేసే ప్రతి ఉద్యోగికి ఈ నూతన చట్టంపై సమగ్రమైన, స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు.

ప్రజలు కార్యాలయాలకు వచ్చినపుడు, వారికి చట్టం యొక్క నిబంధనలు, ప్రయోజనాలు సులభంగా అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన స్పష్టం చేశారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో భూ భారతి హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు సహాయతను అందచేయాలని ఆదేశించారు. గతంలో ఉన్న ధరణి స్థానంలో ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తెచ్చిన భూ భారతి చట్టం యొక్క విధి విధానాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని ఆయన సూచించారు. భూ భారతి చట్టంపై ప్రజల యొక్క స్పందన సేకరించాలని అన్నారు. అవగాహన సదస్సులలో నూతన చట్టం ఏ విధంగా అమలు జరుగుతుంది, చట్టం యొక్క ప్రధాన లక్ష్యం ప్రజలకు తెలియచేయాలని తెలిపారు. ఎలాంటి పొరపాటుకు తావులేకుండా నిష్పక్షపాతంగా భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, అక్రమాలకు పాల్పడితే సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదుతో పాటు శాఖా పరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో జరుగుతుందని, విధుల నుండి తొలగించడం కూడా ఉంటుందని, చాలా జాగ్రత్తగా చట్టం ప్రకారం సేవలు అందించాలని సూచించారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహణపై మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి అవగాహన కార్యక్రమాలు విజయవంతానికి కృషి చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా భూ భారతి చట్టం ... రైతుల చుట్టం అనే నాలుగు పేజీలతో కూడిన పుస్తకాన్ని తహసీల్దార్లకు అందచేశారు.అంతకు ముందు భూ భారతి చట్టం యొక్క విధి విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అన్ని మండలాల తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, గిర్దావర్లు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డ్ స్టేటస్ ఇలా చెక్ చేసుకోండి

నల్గొండ, ఏప్రిల్ 16,

తెలంగాణలో కొత్త రేషన్ కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే అర్హత గల వారి నుంచి దరఖాస్తులను స్వీకరించింది. తొలుత గ్రామ సభల్లోనూ, ఆ తర్వాత మీ సేవా కేంద్రాల ద్వారా తెలుపు రంగు రేషన్ కార్డు కోసం లక్షలాది మంది ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. కానీ దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా దాని స్టేటస్ మాత్రం తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తమకు తెలుపు రంగు కార్డు ఈ ప్రభుత్వంలోనైనా వస్తుందా? రాదా? అన్న అనుమానంతో ప్రజలు ఉన్నారు. సంక్షేమ పథకాలు దక్కాలంటే తెలుపు రంగు రేషన్ కార్డు అవసరం కావడంతో వీటికి తెలంగాణ వ్యాప్తంగా అత్యధిక డిమాండ్ ఏర్పడింది. గత పదేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో లబ్దిదారుల సంఖ్య కూడా భారీగా పెరిగింది. అందిన సమాచారం మేరకు ఆరు లక్షల మందికి పైగానే తెలుపు రంగు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. తెలుపు రంగు రేషన్ కార్డు వస్తే విద్య, వైద్యం విషయాల్లో నిర్భయంగా ఉండటమే కాకుండా ఉచిత విద్యుత్తు పాటు ఐదు వందల రూపాయలకే గ్యాస్ సిలిండర్ కూడా లభిస్తుందని ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుని రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. తమ రేషన్ కార్డుల పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రజలు తిరిగి మీ సేవా కేంద్రాల వద్ద క్యూకడుతున్నారు. కానీ వారి నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు అయితే రేషన్ కార్డు స్టేటస్ ను తెలుసుకోవడానికి ప్రభుత్వం సులువైన పద్ధతిని ప్రవేశపెట్టింది. ఇంట్లో ఉండే రేషన్ కార్డు స్టేటస్ ను తెలుసుకునే వీలుంది. ఫోన్ ద్వారానే స్టేటస్ ను తెలుసుకునే వీలుంది. ఫోన్ లో తెలంగాణ ఫుడ్ సెక్యూరిటీ అధికారిక వెబ్ సైట్ అయిన స్క్రీన్ మీద కనిపించే రేషన్ కార్డు ఆప్షన్ పై క్లిక్ చేసిన వెంటనే అనేక ఆప్షన్లు కనిపిస్తాయి. అందులో ఈూఅ ంజూజూశ్రీతిఇ-జీబితినీని ూవజీతీఇఫ్ర చేస్తే మీ రేషన్ కార్డు స్టేటస్ తెలుస్తుంది. మీ సేవా అప్లికేషన్ నసెర్చ్ విండో ఓపన్ అవుతుంది. అందులో ముందుగా మీ జిల్లాను సెలెక్ట్ చేసుకుని మీ సేవా బాక్స్ పై అప్లికేషన్ నెంబర్ టైప్ చేసి క్లిక్ చేస్తే మీరు చేసిన దరఖాస్తు పరిశీలనలో ఉందా? లేదా రిజెక్ట్ అయిందా? అన్నది తెలుసుకోవచ్చు.

# నేతలకు రేవంత్ ఫుల్ క్లాస్

## పార్టీలో క్రమశిక్షణపై దృష్టి..

హైదరాబాద్, ఏప్రిల్ 16,

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ విస్తరణ చుట్టూ కొన్ని రోజులుగా చర్చలు జరుగుతున్నాయి. పార్టీలో అంతర్గత చర్చలపై కొందరు నేతలు బహిరంగంగా ప్రకటనలు చేస్తున్నారు. అధిష్టానానికే వార్నింగ్ ఇస్తున్నారు. చేసులో తనకు పోటీగా ఉన్న సహచర ఎమ్మెల్యేలపై విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రకటనలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితీవ్రంగా స్పందించారు. శంషాబాద్‌లోని నోవాటెల్ లో సీఎల్పీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇందులో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డికి సీఎం క్లాస్ పీకారు.తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ చర్చలు ఊపందుకున్న నేపథ్యంలో, కొందరు నాయకులు మంత్రి పదవుల కేటాయింపుపై బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి కొందరు నాయకులను మంత్రులుగా ప్రకటిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారం సీఎల్పీ సమావేశంలో చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి చర్యలు పార్టీలో గందరగోళాన్ని సృష్టిస్తాయని, నాయకులందరూ క్రమశిక్షణతో వ్యవహరించాలని రేవంత్‌రెడ్డి హెచ్చరించినట్లు తెలుస్తోంది.రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన నిర్ణయాలు కాంగ్రెస్ హైకమాండ్ తీసుకుంటుందని సీఎం స్పష్టం చేశారు. మంత్రి పదవుల ఎంపికలో హైకమాండ్ ఇప్పటికే కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో, ఎవరిని మంత్రులుగా నియమించాలనే విషయంలో హైకమాండ్ సూచనల మేరకు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అందరూ ఈ నిర్ణయాన్ని గౌరవించాలని రేవంత్‌రెడ్డి నాయకులకు సూచించినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలు చామల కిరణ్ కుమార్‌రెడ్డి వంటి నాయకులకు స్పష్టమైన సందేశంగా భావిస్తున్నారు.మంత్రివర్గ విస్తరణ చుట్టూ జరుగుతున్న చర్చలు, అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నాయకుల వ్యాఖ్యలు పార్టీ ఐక్యతను దెబ్బతీసే అవకాశం ఉందని రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో, అనవసరమైన ప్రకటనలు, ఊహాగానాలు నాయకులు ఆపాలని, పార్టీలో క్రమశిక్షణ కాపాడాలని ఆయన సూచించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న నేపథ్యంలో, ప్రభుత్వం, పార్టీ ఇమేజ్‌ను కాపాడటం అందరి బాధ్యత అని రేవంత్ రెడ్డి నొక్కి చెప్పినట్లు తెలుస్తోంది.సీఎల్పీ సమావేశంలో మంత్రివర్గ విస్తరణతోపాటు, పార్టీలో అంతర్గత విభేదాలను సామరస్యంగా పరిష్కరించేందుకు చర్చలు జరిగాయి. ఈ సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడం, పార్టీని బలోపేతం చేయడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా, అందరూ ఒక్కతాటిపై ఉండి ప్రభుత్వ లక్ష్యాలను సాధించడంలో సహకరించాలని కోరినట్లు తెలుస్తోంది.రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణను నొక్కి చెప్పే ప్రయత్నంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మంత్రివర్గ విస్తరణ సమయంలో నాయకుల మధ్య అసంతృప్తి, వర్గ పోరు తలెత్తే అవకాశం ఉందని, దీనిని నియంత్రించేందుకు రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని అంటున్నారు. హైకమాండ్ నిర్ణయాలను గౌరవించడం ద్వారా పార్టీ ఐక్యతను కాపాడాలని భావిస్తున్నారని, ఈ సందేశం చామల కిరణ్ కుమార్ రెడ్డితోపాటు ఇతర నాయకులకు కూడా గట్టిగా చేరిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# వరి ఉత్పత్తిలో తెలంగాణ టాప్

# 50 లక్షల టన్నుల బియ్యం మిగులు

హైదరాబాద్, ఏప్రిల్ 16

ఈ ఏడాది దేశంలోనే వరి ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ సంవత్సరం దాదాపు 280 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి జరిగిందని, ఇది ఒక రికార్డు అని ఆయన తెలిపారు. ఈ ఘనతకు రైతుల కృషి, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు, ప్రకృతి సహకారం, కొత్త వరి రకాలు అందుబాటులో ఉండటం కారణమని చెప్పారు. రైతాంగానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, సన్న రకాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌తో పాటు ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.రాష్ట్ర ప్రజల స్థానిక అవసరాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం పంపిణీ కోసం ఉద్దేశించిన బియ్యం, కేంద్ర నిల్వల కోసం 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించిన తర్వాత కూడా, రాష్ట్రంలో ఇంకా 50 నుంచి 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిగులు ఉంటుందని మంత్రి వెల్లడించారు. ఈ మిగులు ధాన్యాన్ని మార్కెట్ చేయడానికి అన్వేషణలో భాగంగా, ఆగ్నేయ ఆసియాలోని ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యాన్ని ఎగుమతి చేయడానికి ఆ దేశ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా ఏడాదికి 10 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని ఎగుమతి చేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దొడ్డు రకాలలో ముఖ్యమైన ఎంటియు-1010 మరియు ఐఆర్-64 రకాలను రాష్ట్రంలో విస్తృతంగా సాగు చేస్తున్నారని, వీటికి ఫిలిప్పీన్స్‌లో అధిక డిమాండ్ ఉందని ఆయన తెలిపారు.వరి సాగులో ఇటీవల రైతులు ఆదరిస్తున్న నేరుగా విత్తే పద్ధతి, రోజు విడిచి రోజు నీరు పెట్టే విధానం, తక్కువ రసాయనాలు కలిగిన వరి రకాలను ఉత్పత్తి చేయడంపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు. ఆధునిక బియ్యం మిల్లులను ఒక డెమో రూపంలో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసి రైతులకు, యువతకు శిక్షణ ఇచ్చి ఆధునిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు.ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య మాట్లాడుతూ.. ఫిలిప్పీన్స్ దేశం ఎప్పటికీ దిగుమతి చేసుకునే దేశమేనని, ఆ దేశాన్ని తెలంగాణ బియ్యానికి అనుకూలమైన మార్కెట్‌గా గుర్తించి చర్యలు తీసుకుంటే తెలంగాణలో పండుతున్న బియ్యం నిల్వలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ప్రభుత్వం వరి ధాన్యం సేకరణ కేంద్రాల నుంచి బియ్యం ఔత్సాహిక ఎగుమతిదారులకు సరఫరా చేస్తే ప్రభుత్వానికి అయ్యే ఖర్చుకు సమానంగా ఔత్సాహికదారులకు ఇచ్చినట్లయితే ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండానే ఎగుమతులను ప్రోత్సహించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్య

## షాద్ నగర్ లింగారెడ్డిగూడ గ్రామ శివారులో ఘటన

## కుడి చేతికి జై బాలయ్య టాటూ..!

రంగారెడ్డి

షాద్ నగర్ శివారులోని లింగారెడ్డి గూడా గ్రామం ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు సుమారు 25 నుండి 30 సంవత్సరాల వయసు గల వ్యక్తిని హత్య చేసినట్టు పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు హత్య కాబడిన వ్యక్తి ఐదు అడుగుల అంగుళాల హేత్తు కల్గి బక్క పలచని వ్యక్తి ఓవల ఆకారంలో ఉన్న ముఖం గడ్డం కలిగిన లేత రంగు చాతి ఎడమవైపున ఒక దీర్ఘ చతురస్ర



రకం టాటూ కుడి చేతిలో ఒక టాటూ తెలుగులో జై బాలయ్య ఎడమ చేతిలో ఒక టాటూ దీర్ఘ చతురస్ర ఆకారపు గుర్తు ఎడమచేవి పై ఒక నల్ల స్టాడ్ వేర్ మరియు మెడ పై ఒక లాకెట్ వెంకటేశ్వర స్వామి లాకెట్ మరోవైపు అమ్మవారు తో పసుపు మరియు ఎరుపు రంగు దారం మరియు నలుపు రంగు కార్గో ప్యాంటు ముదురు నీలం రంగు చొక్కా తెల్ల రంగు లైన్ టీషర్ట్ ధరించిన వ్యక్తి హత్యకు గురయ్యాడని అతని స్వస్థలం ఎక్కడ ఎవరు ఎందుకు హత్య చేశారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు ఎవరైనా ఈ వ్యక్తిని గుర్తుపడితే షాద్ నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు..

# సిబిఐ, ఈడీలను సొంత ఏజెన్సీలుగా వాడుతున్న బీజేపీ: వైఎస్ షర్మిలా రెడ్డి

విజయవాడ

భ్రష్ట్ జుమ్లా పార్టీ బీజేపీకి కాంగ్రెస్ అంటే భయం పట్టుకుంది. దేశంలో కాంగ్రెస్ ఎదుగుదలను జీర్ణించుకోలేక పోతుంది. అందుకే దర్యాప్తు సంస్థలు సిబిఐ, ఈడీలను సొంత ఏజెన్సీలుగా వాడుతుందని ఏపీసీసీ చీఫ్ షర్మిలా రెడ్డి అన్నారు. ప్రతిపక్షంపై అక్రమ కేసులు బనాయిస్తుంది. అగ్ర నాయకత్వాన్ని అణగదొక్కాలని చూస్తుంది. ప్రశ్నించే గొంతును నొక్కాలని కుట్రలు చేస్తుంది. నేషనల్ హెరాల్డ్ ఆస్తులను స్వాధీనం చేయడాన్ని, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీ పై ఈడీ ఛార్జ్ షీట్ దాఖలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. 'మనీ'నే లేని కేసులో మనీ ల్యాండరింగ్ జరిందని ఆరోపణలు చేయడం అత్యంత దారుణం. భారత స్వాతంత్ర్య సమరయోధులను, దేశ మహోన్నత నేతలను, వారు చేసిన కృషిని బీజేపీ అవమానపరుస్తోంది. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. బీజేపీ చేస్తున్న నీచ రాజకీయాలకు, ప్రతీకార చర్యలకు ఇది నిదర్శనం. మీ వేధింపులకు మౌనంగా ఉంటూ..మీ దుశ్చర్యలను చూస్తూ ఊరుకునేది కాదు కాంగ్రెస్ పార్టీ. కాంగ్రెస్ మీద మీరు చార్జిషీట్ వేయడం కాదు.. బీజేపీ మీదే ప్రజలే ఛార్జ్ షీట్ వేసే సమయం దగ్గరపడింది. అదానీ లాంటి వాళ్ళకు దేశాన్ని ఎలా దోచి పెడుతున్నారో అర్థం అయ్యింది. సత్యమేవ జయతే అని అన్నారు.

# దర్గాగా నాలా అక్రమణ పూడికతీతకు పోయిన యంత్రాంగంపై దాడి

భద్రాచలం

భద్రాచలం పట్టణంలో డ్రైనేజీ ఆక్రమణలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. డ్రైనేజీలు లు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వర్షాకాలం వచ్చిందంటే వరద నీరు రోడ్లపైకి చేరుకుంటుంది. దీంతో రహదారులు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయి ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ ఆక్రమణలు తొలగించమన్నందుకు ఏకంగా ప్రభుత్వ అధికారులపైకి దాడులకు పాల్పడుతున్నారు.

తాజాగా భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో ఆల్ఫా హోటల్ యజమాని పూర్తిగా డ్రైనేజీని ఆక్రమించి డ్రైనేజీ పై నిర్మాణం చేపట్టాడు. దీంతో వరద నీరు ప్రవాహం నిలిచిపోయి పూర్తిగా రోడ్డు మీదకు చేరుకుంది. దీంతో వరద నీరుతో రహదారి మునిగిపోవడంతో గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసరావు తన సిబ్బందితో వెళ్లి డ్రైనేజీ పూడికతీత కోసం ప్రయత్నిస్తుండగా ఆల్ఫా హోటల్ యజమాని పంచాయతీ ఈఓ, సిబ్బందిపై భౌతిక దాడికి పాల్పడ్డాడు. దీంతో గ్రామపంచాయతీ ఈవో భద్రాచలం పోలీస్ స్టేషన్లో తమ విధులను అడ్డగించి దాడికి పాల్పడిన వారిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు

# కిసాన్ కోసం జవాన్

నాగార్జునసాగర్

నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం ఇబ్రహీంపేట ఐకేపీ సెంటర్ దగ్గర అకాల వర్షం పడింది. వర్షానికి వడ్లు తడుస్తుండగా అటుగా వెళ్తూ వాహనం ఆపి జవాన్లు ధాన్యం పై కవర్లు కప్పి రైతులకు సహాయం చేసారు.

బొక్కమంతల పాడ్ వద్ద బందోబస్త్ కు వెళ్లి తిరుగు ప్రయాణంలో రైతులకు జవానులు సహాయం చేసారు.

# సంకష్టహర చతుర్ధి పూజలందుకున్న మహాగణపతి -అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు

మంథని

సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మహాగణపతి దేవాలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. మంథని పట్టణంలోని తమ్మిచెరువు కట్ట వీధిలో గల శ్రీ మహాగణపతి దేవాలయం ఎంతో విశిష్టత సంతరించుకుంది. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత సంకటహర చతుర్థి వస్తుంది. సంకష్ట చతుర్థి నాడు వ్రతం ఆచరించడం వల్ల జాతకంలో కుజ దోష సమస్యలు తొలగిపోతాయి. అంతేకాకుండా చేసే పనులలో సంకటాలు తొలగి విజయాలు చేకూరుతాయని శాస్త్రవచనం. ఈరోజు సంకష్టి ఉపవాసాలు ఉండేవారు మహా గణపతికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేస్తూ ఉంటారు. అలాగే ప్రతినిత్యం ఎందరో భక్తులు ఆలయంలో గణపతిని దర్శించుకొని వెళుతుంటారు. ప్రతి మంగళవారం భక్తులు విగ్నేశ్వరుని పూజిస్తుంటారు. ముఖ్యంగా సంకటహర చతుర్థి రోజున మంథని పట్టణ ప్రజలే కాకుండాచుట్టుపక్కల గ్రామాల నుండి సైతం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. సంకటహర చతుర్థి దీక్ష పట్టిన భక్తులు రాత్రి చంద్రోదయం అనంతరం మాత్రమే ఉపవాస దీక్షను విరమిస్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పల్లి రాము ఆలయానికి వచ్చిన భక్తులకు సంకల్పాలు, అర్చనలు, అభిషేకాలు చేయించారు. ఆలయం లోని స్వామి వారిని అలంకరిస్తూ భక్తుల సౌకర్యార్థం అర్చకులు పల్లి సంజీవ్, పల్లి రాము సోదరులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# తన భర్త మరణానికి కారకులైన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి

## -ఎమ్మెల్యే పద్మావతి కాళ్ళు మొక్కివేడుకున్న నిమిషకవి ఉమామహేశ్వరి

## -సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అంతా మాయ.

## -బాధితురాలికి ఇప్పటికైనా న్యాయం జరిగేనా?



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) ఏప్రిల్ 16:రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మోసం చేసి తన భర్త చావుకి కారణమైన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలంటూ కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి కాళ్ళు మొక్కుతూ బాధితురాలు ఉమామహేశ్వరి వేడుకుంది. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణ కేంద్రంలో రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ధన దాహానికి భలై మార్చి19 అర్ధరాత్రి తన భర్త సుబ్బారావు ఆత్మహత్య చేసుకొని మరణించేలా తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ఆమె తెలిపారు. తప్పుడు డాక్యుమెంట్లతో ఫాల్స్ రిజిస్ట్రేషన్ చేయించిన అన్నెం వెంకటరెడ్డి, కొనగంటి నాగిరెడ్డి,పల్లి పుల్లారావు లతో పాటు బాణోతు శంకర్ నాయక్ లపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలు ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిని కలిసి తన గోడును వెల్లడించింది. తన భర్త మరణానికి కారకులైన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసినా హుజూర్ నగర్ ఎస్ఐ కాలయాపన చేస్తున్నారని, తాను రాయించి ఇచ్చిన ఫిర్యాదు కాకుండా పోలీసులతో ఆల్రెడీ రాయించి ఉంచిన మరో ఫిర్యాదుపై తనతో సంతకం చేయించి స్థానిక ఎస్ఐ కేసును పక్క దోవ పట్టిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని ఉమామహేశ్వరి ఎమ్మెల్యే పద్మావతికి వినతిపత్రం అందించింది.

# రద్దీ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు





ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)ఏప్రిల్16:రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ చేసివున్న దిచక్ర వాహనాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న నిందితుడుని హసన్‌పర్తి పోలీసులు అరెస్టు చేసారు. నిందితుడి నుండి సుమారు 10లక్షల విలువ గల 18 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక సెల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి కాజీపేట ఏసిపి తిరుమల్ వివరాలను వెల్లడిస్తూ బుధవారం ఉదయం హసన్‌పర్తి పోలీసులు హసన్‌పర్తి మండల కేంద్రంలో వాహన తనీఖీలు నిర్వహిస్తున్న సమయంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తి పోలీసుల నిర్వహిస్తున్న తనీఖీలను గమనించి అక్కడి నుండి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు సదరు వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో పాటు అతని వద్ద ద్విచక్ర వాహనానికి సంబంధించి ఎలాంటి అధారాలు లేకపోవడం పోలీసులు నిందితుడుని విచారించగా. జనగామ జిల్లా, చిలుపూర్ మండలం, ఫతేపూర్ గ్రామం, ప్రస్తుతం హనుమకొండ, గోపాల్‌పుర్‌లో నివాసం వుంటున్న గుగులోత్ చందు లాల్ (24), గత కొద్ది రోజులుగా తనకు డ్రైవింగ్ లైసెన్స్ లేనందున స్నేహితుడి లాగిన్ ఐడీతో జోమాటో,స్విగ్గీ,ర్యాపిడో సంస్థల్లో పనిచేస్తున్నాడు. వీటీ ద్వారా వచ్చే అదాయం తన జల్సాలకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఇందుకోసం రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేసి వాటిని విక్రయిస్తే వచ్చే డబ్బు జల్సాలు చేయాలకున్నాడు నిందితుడు. ఇందులో నిందితుడు తాను అనుకున్న ప్రకారం హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 7,హసనపర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో 3,కెయూసి పరిధిలో ఒక ద్విచక్ర వాహనాన్ని చోరీ చేయడంతో పాటు నిందితుడు రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ పరిధిలొ4, భువనగిరిలో2, హైదరాబాద్‌లో 1చోప్పున మొత్తం 18 ద్విచక్ర వాహనాలను చోరీ చేసాడు. నిందితుడు చోరీ చేసిన వాహనాలను అవకాశం చూసుకోని విక్రయించేందుకు తన భద్రపర్చుకున్నాడు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు నిందితుడి ఇంటి చోరీ అయిన ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లుగా ఏసిపి వెల్లడిరచారు. నిందితుడిని పట్టుకొని చోరీకి గురైన వాహనాలను తిరిగి స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమ్, ఏసిపి తిరుమల్, హసన్‌పర్తి ఇన్స్‌స్పెక్టర్ చేరాలు, ఎస్.ఐలు దేవేందర్,రవి, సిద్దయ్యలు, ఏఏఓ సల్మాన్ పాషా, హెడ్ కానిస్టేబుల్ వివేకనంద, కానిస్టేబుళ్ళు క్రాంతికుమార్,తిరుపతయ్య, భరత్‌కుమార్, దేవేందర్,మహేందర్,రవేష్,పూర్ణచారీ, రాజ్‌కుమార్,సొమన్న,ధనుంజయ,నాగరాజు,నవీన్‌లను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

# భూ భారతి రెవెన్యూ చట్టంపై అధికారులు అవగాహన కలిగి ఉండాలి :జిల్లా కలెక్టర్ దివాకర



ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16 (భారత శక్తి) : భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం రూపొందించిన భూ భారతి చట్టంపై రెవెన్యూ అధికారులు సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్ లతో కలసి భూభారతి నూతన రెవెన్యూ చట్టంపై తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అభిప్రాయాలను క్రోడీకరించి భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టం రూపొందించిందని అన్నారు. భూభారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఈనెల 17 నుంచి ప్రతి మండలంలో భూభారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్ రూపకల్పన చేయాలన్నారు.అవగాహన సదస్సులకు అధిక సంఖ్యలో ప్రజలు వచ్చేలా గ్రామాలలో డప్పు చాటింపు వేయించాలని సూచించారు.ప్రతి తహసిల్దార్ కార్యాలయంలో భూ భారతి చట్టంపై ప్రజలకు సలహాలు, సూచనలు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై రెవెన్యూ అధికారులు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. సదస్సుల నిర్వహణలో భాగంగా క్షేత్ర స్థాయిలో ప్రజల నుండి వచ్చే విజ్ఞప్తులను స్వీకరించాలని అన్నారు. ప్రజలు కార్యాలయాలకు వచ్చినపుడు, వారికి చట్టం యొక్క నిబంధనలు, ప్రయోజనాలు సులభంగా అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

ఎలాంటి పొరపాటుకు తావులేకుండా నిష్పక్షపాతంగా భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, అక్రమాలకు పాల్పడితే సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదుతో పాటు శాఖా పరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో జరుగుతుందని, విధుల నుండి తొలగించడం కూడా ఉంటుందని, చాలా జాగ్రత్తగా చట్టం ప్రకారం సేవలు అందించాలని సూచించారు. వేసవి దృష్ట్యా అవగాహన సదస్సుల వేదికల వద్ద సరైన ఏర్పాటు చేయాలని సూచించారు.అంతకు ముందు భూ భారతి చట్టం యొక్క విధి విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అన్ని మండలాల తహసిల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# 17 నుండి 30 వ తేదీ వరకు మండల కేంద్రాల్లో భూ భారతి అవగాహన సదస్సులు : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌లి



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 16: ఈ నెల17 నుండి 30 వరకు జిల్లాలోని మండల కేంద్రాల్లో భూ భారతి అవగాహన సదస్సులు నిర్వహించబడునని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 న రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించిన భూ భారతి కార్యక్రమాన్ని జిల్లాలో విస్తృతంగా ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. అందులో భాగంగా ప్రతీ మండల కేంద్రంలోని రైతు వేదిక లేదా ఇతర ప్రాంతాలలో భూ భారతి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నెల 17 న ఉదయం 10 గంటల నుండి ఒంటి గంట వరకు పాల్వంచ రైతు కేంద్రంలో, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మాచారెడ్డి మండలం గజియా నాయక్ తాండా రైతు వేదికలో నిర్వహించడం జరుగుతుందని, 19 న ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు ఎల్లారెడ్డి మండల కేంద్రం లోని రైతు వేదికలో, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 వరకు నాగిరెడ్డిపేట రైతు వేదికలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

21 నా పిట్లం మండల కేంద్రంలో ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు, పెద్ద కొడప్ గల్ రైతు వేదికలో మధ్యాహ్నం 2 నుండి 5 గంటల వరకు, 22 న రామారెడ్డి లో ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు రైతువేదికలో, బిక్నూర్ రైతువేదికలో మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 వరకు, 23 న గాంధారి రైతువేదికలో ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు, సదాశివనగర్ రైతువేదికలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 వరకు, 24 న ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12.30 వరకు మున్నూరు కాపు సంఘం, వీక్లీ మార్కెట్ కామారెడ్డి లో, తాడ్వాయి రైతు వేదికలో మధ్యాహ్నం 1.30 నుండి 3.30 వరకు , రాజంపేట రైతువేదికలో 3.30 నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 25 న జుక్కల్ రైతు వేదికలో ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు, బిచ్కుంద శాంతి మున్నూరుకాపు ఫంక్షన్ హాల్ లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 వరకు, ఈ నెల 26 న బీబీపేట్ రైతువేదికలో ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు, దోమకొండ రైతువేదికలో మధ్యాహ్నం 2 నుండి 5 గంటల వరకు, 28 న నిజాంసాగర్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12.30 వరకు, మహమ్మద్నగర్ రైతు వేదికలో మధ్యాహ్నం 1.30 నుండి 3.30 వరకు, బాన్సువాడ రెడ్డి సంఘం లో మధ్యాహ్నం 3.30 నుండి 6 గంటల వరకు, 29 న డోంగ్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు, మద్నూర్ రైతువేదికలో మధ్యాహ్నం 2 నుండి 5 వరకు, 30 న బిర్కూర్ రైతువేదికలో ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు, నసురుల్లబాద్ రైతువేదిక లో మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 గంటల వరకు అవగాహన సదస్సులు నిర్వహించబడుతాయని కలెక్టర్ వివరించారు. ఈ అవగాహన సదస్సులకు 200 మందికి తక్కువ కాకుండా మండలంలోని ప్రజలు, రైతుల ను ఆహ్వానించాలని, ముఖ్యంగా ఆయా ప్రాంతాల ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు.

# రేషన్ షాపు లో ప్లాస్టిక్ బియ్యం సరఫరా అవాస్తవం:జిల్లా పౌర సరఫరాల అధికారి సయ్యద్ షా ఫైజల్ హుస్సేని.

## -అసత్య ప్రచారాలు చేసే వారిపై క్రిమినల్ కేసుల నమోదు.



ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16 (భారత శక్తి) : జిల్లాలోని రేషన్ షాపులో ప్లాస్టిక్ బియ్యం సరఫరా చేస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం ఆ వాస్తవమని ములుగుజిల్లా పౌర సరఫరాల అధికారి సయ్యద్ షా ఫైజల్ హుస్సేని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో ప్రజలను ఆందోళనకు గురిచేసి సమాజంలో అశాంతి సృష్టించాలనే దురుద్దేశంతో కొంతమంది సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ప్రజలను భయాందోళనలకు గురి చేస్తూ సమాజంలో అశాంతిని సృష్టించాలని దురుద్దేశంతో తప్పుడు వీడియోలను సామాజిక మాద్యాలలో ప్రచారం చేసినయెడల సంబంధిత అకౌంట్ హెూల్డర్ల పై చట్టరీత్యా చర్యలు తీసుకోవటం జరుగుతుందని,సన్న బియ్యం పథకంపై ప్రజలలో ఆందోళన సృష్టించేలా తప్పుడు ప్రచారాలు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి పేర్కొన్నారు.

# భూభారతి చట్టంతో ప్రజల సమస్యలు పరిష్కారం

## -పూర్తి వివరాలను సేకరించిన అనంతరమే రిజిస్ట్రేషన్లు:జిల్లా కలెక్టర్



ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16 (భారత శక్తి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ చట్టంతో ప్రజలకు సంబంధించిన భూముల సమస్యలు పరిష్కారం అవుతాయని, మరో 14 అంశాలను ప్రభుత్వం భూభారతి పోర్టల్ లో పొందుపరిచిందని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చట్టం, దాని పద్ధతులు అనే రెండు అంశాలను ప్రభుత్వం ఆధారంగా తీసుకొని భూ భారతి ఏర్పాటు చేయడం జరిగిందని, భూముల విషయంలో ఎలాంటి సమస్యలు ఏర్పడిన సంవత్సర కాలంలో పరిష్కరించుకోవడానికి అవకాశం కల్పించిందని వివరించారు. భూ సమస్యలపై గతంలో కోర్టులను ఆశ్రయించే వారని నేడు కోర్టులను ఆశ్రయించకుండానే షెడ్యూల్ (ఏ) ను ఏర్పాటు చేసి భూమి విలువ 5 లక్షల లోపు ఉన్నపక్షంలో ఆర్డీవో స్థాయి, 5 లక్షలకు పైగా ఉన్న పక్షంలో కలెక్టర్ స్థాయి అధికారులు సమస్యను పరిష్కరించడానికి అవకాశం కల్పించారని తెలిపారు. భూమి విషయంలో దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఆరోజు నుండి సంవత్సరకాలం లోపు సమస్యను పరిష్కరించడం జరుగుతుందని, కలెక్టర్ స్థాయిలో సమస్య పరిష్కారం కాని పక్షంలో సీసీఎల్ఏ కు ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్ బోర్డు భూములను ఎవరైనా ఆక్రమించి పట్టాలు చేసుకున్న పక్షంలో కేసులను నమోదు చేయడం జరుగుతుందని, గుడ్డిగా రిజిస్ట్రేషన్ చేసే అవకాశాలు ఏ మాత్రం ఉండవని అన్నారు. ప్రస్తుతం మండల తహసీల్దార్లు, సబ్ రిజిస్టర్ అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారని, ఇకనుండి చేసే రిజిస్ట్రేషన్ లను అన్ని పరిశీలించిన అనంతరమే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముగిస్తారని తెలిపారు. జిల్లాలో వెంకటాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని ఆ మండలంలోని అన్ని గ్రామాలలో రెవిన్యూ సదస్సులు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని, మే ఒకటి నుండి 31 వరకు పరిశీలన చేసిన అనంతరం జూన్ 2వ తేదీన పట్టాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా లోని మిగతా మండల కేంద్రాల్లో అవగహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఒక గ్రామ పరిధిలోని భూముల వివరాలు పూర్తిగా తహసిల్దార్, ఆర్డీఓ, కలెక్టరేట్, ఖజానా కార్యాలయంలో పొందుపరచడం జరుగుతుందని, జమాబంధు తరహాలో భూమాత పోర్టల్ కొనసాగుతుందని అన్నారు. అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ తెలిపారు.

# సోనియా, రాహుల్ గాంధీల పై ఈడీ కేసులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన జ్వాలలు

మందమర్రి టౌన్, ఏప్రిల్ 16, (భారత శక్తి):మందమర్రి పట్టణంలో నీ అంబేద్కర్ విగ్రహం వద్ద గల రహదారిపై బుధవారం రోజున మందమర్రి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ నాయకులు సోతుకు సుదర్శన్ ఆధ్వర్యంలో కార్యక్రమానిర్వాహన జరిగింది. నల్ల బ్యాడ్జీలు ధరించి రహదారిపై నిరసన కార్యక్రమాన్ని తెలియజేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సొతుకు సుదర్శన్ పుల్లూరి లక్ష్మణ్ మంద తిరుమలరెడ్డి మాట్లాడుతూ ఏఐసీసీ అగ్ర నాయకుల పిలుపుమేరకు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఆదేశాల మేరకు ఈరోజు మా ప్రియతమ నాయకులు సోనియా గాంధీ రాహుల్ గాంధీ లపై అక్రమ ఈడీ కేసులను నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలను తెలియజేస్తున్నామని, బిజెపి ప్రభుత్వం పని కట్టుకొని కాంగ్రెస్ పార్టీ పై దుష్ప్రచారం చేస్తుందని, మా అగ్ర నాయకులపై కావాలనే ఈడీ కేసులు బనాయించిందని అది ప్రతి ఒక్కరికి తెలుసని అన్నారు. భయపెట్టి దేశాన్ని పాలించాలని చూస్తున్నారని ఇది సాధ్యం కాని విషయం అని తెలిపారు. వెంటనే వారిపై ఉన్న ఈడీ కేసులను తొలగించాలని లేనిపక్షంలో నిరసన జ్వాలలు రగులుతూనే ఉంటాయని పిలుపునిచ్చారు. బిజెపి చేస్తున్న దృశపచారాలను ప్రజలు గమనిస్తున్నారని ఇక బిజెపి ఆటలు సాగవని తెలియజేశారు. త్యాగానికి మారుపేరు సోనియాగాంధీ అని అలాంటి వారిపై ఈడీ



కేసులు పెట్టడం తగదని తెలిపారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకొని ఇలాంటి అబద్ధపు కేసులు బనాయించవద్దని బనాయించిన ఈడి కేసులను వెంటనే తిరిగి తీసుకోవాలని లేని పక్షంలో నిరసన జ్వాలలో బిజెపి ప్రభుత్వం మాడిపోతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేర్మెట్ల శ్రీనివాస్ గడ్డం రజిని ఎర్ర రాజు రాచర్ల గణేష్ సదానందం బుర్ర ఆంజనేయులు మంకు రమేష్ శివరామకృష్ణ రాయబారపు కిరణ్ జావిద్ ఖాన్ ఇషాక్ మాయా తిరుపతి సోతుకు ఉదయ్ మహంత్ అర్జున్ శామ్యూల్ లక్ష్మణ్ గట్ల సారంగపాణి తిరుపతి యాదవ్ గడ్డం శీను ముదారపు శేఖర్ ఆడెపు వేణు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువజన కార్యకర్తలు మహిళ కార్యకర్తలు సోషల్ మీడియా వారియర్స్ సేవాదళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటికై ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు

## -ఎండిన పంటలకు 500 బోనస్ చెల్లించాలి: ఎమ్మెల్యే గంగుల డిమాండ్



కరీంనగర్, ఏప్రిల్ 16(భారత శక్తి):సాగునీరందక పంటలు ఎండిపోయిన రైతులకు ప్రభుత్వం 500 రూపాయల బోనస్ చెల్లించాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. తాగునీటి కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రభుత్వంపై తిరుబాటుకు చేయకతప్పదని ఆవేదన వ్యక్తం చేశారు...రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి రెండు మూడు రోజుల్లోనే వారి వారి ఖాతాలో డబ్బులు జమచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కరీంనగర్ నియోజకవర్గంలోని కొత్తపెల్లి మండలంలోని మల్కాపూర్, బద్దిపల్లి గ్రామాలలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాలను శాసనసభ్యులు గంగుల కమలాకర్ ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే గంగులకు స్థానిక రైతులు, బిఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్చాన్ని అందించి శాలువాల తో సత్కరించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, సంబంధిత అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు.నాణ్యమైన వడ్లను తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. మల్కాపూర్ గ్రామాన్ని నగరపాలక సంస్థలో విలీనం చేయడం ద్వారా ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కరువైందని ఎమ్మెల్యేకు స్థానికులు మొరపెట్టుకున్నారు. అదేవిధంగా రైతుబంధు రాలేదని, సబ్సిడీ గ్యాస్ అందడం లేదని, తులం బంగారం ఇవ్వడం లేదని, కౌలురైతులకు రైతు భరోసా ఇవ్వటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ కరీంనగర్ నియోజకవర్గ ప్రాంతంలో ఇప్పుడిప్పుడే వరి కోతలు మొదలు పెట్టారని, కొన్ని ప్రాంతాల్లో ఇంకా వరి కోతలు మొదలు కాలేదని, కరీంనగర్ జిల్లాలో కొన్ని ప్రాంతాలలో ఆలస్యంగా నాట్లు వేస్తారని, తద్వారా కోతకు రావడానికి ఇంకా కొంత సమయం పడుతుందని చెప్పారు. ఏప్రిల్ మొదటి రెండు వారాల్లో వరిపైరుకు చివరి తడి నీరు అందించాల్సిన అవసరం ఉండేదని కానీ.. ప్రభుత్వం నీరందించక పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ సీజన్లో ఎండిన వరి పంటకు 500 రూపాయల బోనస్ ను చెల్లించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చివరి తడి వరకు నీరిచ్చామని, సమృద్ధిగా నీళ్లు ఉన్నందున వరి కోతలకు కూడా ఇబ్బంది అయ్యే పరిస్థితి ఉండేది కాదన్నారు. ఆ రైతులు నీరు బంద్ చేయండి అని ఎన్నోసార్లు మాతో చెప్పుకునే పరిస్థితి గతంలో నెలకొందని గుర్తు చేశారు. ఈ సమయంలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రాజెక్టులనే నిండుకుండలా ఉండేవని, ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నేడు వెలవెలబోతున్నాయన్నారు. రాను రాను పంట దిగుబడి తగ్గిపోతుందని, ఈప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా నష్టం చేస్తుందన్నారు. తగినన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, ఆయా రైతుల ఖాతాల్లో రెండు మూడు రోజుల్లోనే డబ్బులు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్, కొత్తపెల్లి మండల శాఖ అధ్యక్షులు కాసారపు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్, మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, మాజీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్,మాజీ జడ్పీ కో అప్షన్ సభ్యులు సాబీర్ పాషా, మాజీ ఎంపీటీసిలు పండుగ గంగమ్మ నర్సన్న, లసుమయ్య, ఉప్పు శ్రీనివాస్,మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్, మాజీ సూడా డైరెక్టర్ నేతి రవివర్మ, నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, నాయకులు ఉప్పు తిరుపతి, మనోజ్, రవి , యూత్ గ్రామ శాఖ అధ్యక్షులు కొక్కు భరత్, నాయకులు కూన రంజిత్, గొల్లపల్లి వెంకటేశం, పల్లె రవీందర్ గౌడ్, గొల్లపెల్లి వెంకటేష్ సిపి, ఎనగంటి కృష్ణ కుమార్, నరహరి లక్ష్మారెడ్డి బాపు రెడ్డి, శ్రీరాం ధర్మయ్య, జక్కులచ్చయ్య, పల్లె జితేందర్ గౌడ్, తో పాటు రైతులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# సీపీనీ మర్యాదపూర్వకంగా కలిసిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



కరీంనగర్, ఏప్రిల్ 16(భారత శక్తి):కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం ను కమిషనరేట్ లోని తన కార్యాలయంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు, వి ఎన్ ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ నరేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పులమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అలాగే శాంతిభద్రతల విషయంలో అహర్నిశలు కృషి చేస్తూ సమాజానికి దిక్సూచిగా నిలుస్తున్నారని నరేందర్ రెడ్డి చెప్పారు.

# ధాన్యం కొనుగోళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఏప్రిల్ 16(భారత శక్తి):హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో, తుమ్మనపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. తూకం యంత్రాలు, తేమ యంత్రాలు పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కల్లాల వద్ద సన్నాలు, దొడ్డు రకం ధాన్యాలను వేరువేరుగా ఏర్పాటు చేయాలని సూచించారు. సేకరించిన వివరాలను, మిల్లింగ్ కు పంపే ధాన్యం వివరాలకు సంబంధించిన రిజిస్టర్లు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

నిర్దిష్ట తేమ శాతానికి రాగానే ధాన్యం కొనుగోలు చేయాలని, సేకరించిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కట్టింగు, కోతలు లేకుండా కొనుగోళ్లు జరపాలని అన్నారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా తార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 48 గంటల్లోగా రైతులకు ధాన్యం వచ్చేలా ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలకు వచ్చే



మహిళలకు, ఉపాధి హామీ కూలీలకు 'ఆరోగ్య మహిళ' ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని మెడికల్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, తహసీల్దార్ కనకయ్య, ఎంపిడిఓ సునీత, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏఈఓ సౌమ్య ఉన్నారు.

# మండుటెండలో జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన

## హుజూరాబాద్ లో వసతిగృహం, భగీరథ, మున్సిపల్ కార్యాలయాలు సందర్శన

కరీంనగర్, ఏప్రిల్ 16(భారత శక్తి): ప్రజాసేవే పరమావధిగా భావించి మిట్ట మధ్యాహ్నం మండుటెండలో కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ డివిజన్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సుడిగాలి పర్యటన చేపట్టారు. బుధవారం హుజురాబాద్ కేసి క్యాంపులోగల మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సందర్శించారు. ఇక్కడ తరగతి గదులను పరిశీలించారు.

విద్యార్థులు ఎస్.ఏ -2 హిందీ పరీక్ష రాస్తుండడంతో కల్పించిన ఏర్పాట్లపై ఉపాధ్యాయులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్లోని గదులను, డైనింగ్ హాల్, కిచెన్ సందర్శించారు. వంట పాత్రలు బాగా శుభ్రం చేయాలని, నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలని ఆదేశించారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని అన్నారు. వీరి వెంట ప్రధానోపాధ్యాయురాలు టి.శారద ఉన్నారు.

::మిషన్ భగీరథ గ్రిడ్ పరిశీలన::

కెసి క్యాంప్ పరిధిలోని మిషన్ భగీరథ గ్రిడ్, కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఇంట్రా, డివిజన్, గ్రిడ్ కార్యాలయ గదులను, ఇక్కడ ఏర్పాటుచేసిన ల్యాబ్ ను పరిశీలించారు. కార్యాలయ పరిధిలోని సిబ్బంది వివరాలను, ఫీల్డ్ సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం దృష్ట్యా మిషన్ భగీరథ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, తాగునీటి సరఫరాలో సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.



వీరి వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామ్ కుమార్, డివిజనల్ ఇంజనీరింగ్ నసీమొద్దీన్ ఉన్నారు.

::మున్సిపల్ కార్యాలయం సందర్శన::

హుజురాబాద్ పురపాలక సంఘం కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఇక్కడ మెప్మా సిబ్బంది ఆధ్వర్యంలో పొడి చెత్తను సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. రిసోర్స్ పర్సన్లు పొడి చెత్త సేకరిస్తుండగా %ణ=జ% ( డ్రై రిసోర్స్ సెంటర్ లకు) తరలిస్తున్న విధానాన్ని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య కలెక్టర్ కు వివరించారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి,ఆర్డిఓ రమేష్, రీసోర్స్ పర్సన్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# పళ్ళెం రాజలింగంను సన్మానించిన పుల్లెల గోపీచంద్.

మందమర్రి టౌన్, ఏప్రిల్ 16,(భారత శక్తి):క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ కార్యదర్శి, భారత్ బ్యాట్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ మంగళవారం అభినందించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని కొటక్ పుల్లెల గోపీచంద్ బ్యాట్మింటన్ అకాడమీలో గోవాలో జరిగిన నేషనల్ మాస్టర్స్ బ్యాట్మింటన్ టోర్నమెంట్ లో మెడల్స్ సాధించిన క్రీడాకారులను బ్యాట్ జాయింట్



సెక్రెటరీ యు వి ఎన్ బాబు, బ్యాట్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ కానూరు వంశీధర్ ఆధ్వర్యంలో క్రీడాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. 35 ప్లస్ క్యాటగిరి ఎస్ అప్పారావు బ్రాంచ్ మెడల్ సాధించాడు. 35 ప్లస్ క్యాటగిరి ఉమెన్స్ డబుల్స్ లో ప్రభిను సిల్వర్ మరియు మిక్స్ డ్ డబుల్స్ లో బ్రాంజ్ మెడల్ సాధించారు. 55 ప్లస్ క్యాటగిరిలో మిక్స్ డబుల్స్ లో ఏం కమలాకర్ రావు బ్రాంజ్ మెడల్ సాధించాడు. 60 ప్లస్ కేటగిరి మెన్ డబుల్స్ లో ఏవీఎస్ మూర్తి గోల్డ్ మెడల్ 60 ప్లస్ సింగిల్స్ లో సిల్వర్, మిక్స్ డబుల్స్ లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. 75 ప్లస్ క్యాటగిరి సింగిల్స్ లో సింగరేణి మాజీ కార్మికుడు పళ్ళెం రాజలింగం సిల్వర్ మరియు మెన్స్ డబుల్స్ లో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ క్రీడా పోటీలు క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు పేరు ప్రఖ్యాతలు అందుతాయని మానసికంగానూ ఆరోగ్యంగానూ ఉంటారని తెలిపారు. గోవాలో జరిగిన నేషనల్ మాస్టర్స్ బ్యాట్మింటన్ టోర్నమెంట్ లో మెడల్స్ సాధించి విజేతలుగా నిలిచిన క్రీడాకారులను త్వరలో థాయిలాండ్ లో జరగనున్న ఇంటర్ నేషనల్ టోర్నమెంట్స్ లో పాల్గొననునట్లు తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా క్రీడాకారులు శ్రమిస్తున్న తీరు అందరికి ఆదర్శం కావాలని అన్నారు. మాజీ కార్మికుడు పళ్ళెం రాజలింగం మాట్లాడుతూ సింగరేణి కార్మికుడిగా విధులు నిర్వహించే క్రమంలో పెదిహేను వందలకు పైగా బహుమతులు అందుకోవడం జరిగిందని, వందలాది గుర్తింపు పత్రాలు సాధించింది కోల్ ఇండియా స్థాయిలో క్రీడలో పాల్గొన్న విషయాలను తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం వివిధ దేశాల్లో ఆడే అవకాశాలు వచ్చిన పెన్షన్ డబ్బుల పై ఆధారపడే తన కుటుంబం ఆర్థిక ఇబ్బందులు కారణంగా గతంలో వెళ్ళలేకపోయినట్లు తెలిపారు. 78 ఏళ్ల వయసులో క్రీడలో నేను సైతం అంటున్న మాజీ కార్మికుడు రాజలింగం ఆశయం సంకల్పం నెరవేరాలని విదేశీ గడ్డపై విజేతగా నిలవాలని సింగరేణి మాజీ కార్మికులు కోరుతున్నారు.

# లింగం పేట్ మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద భూ భారతి రెవిన్యూ సదస్సులు

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 16: జిల్లాలోని లింగం పేట్ మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద భూ భారతి రెవిన్యూ సదస్సులు ఈ నెల 17 నుండి 30 వరకు 23 రెవిన్యూ గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో



రెవిన్యూ, అటవీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల.మేరకు లింగంపేట్ మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద రెవిన్యూ సదస్సులు రేపటి(నేటి) నుండి 30వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సులలో ప్రజల భూ సమస్యలు పరిష్కరించేందుకు ఆయా అధికారులు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. అందుకు నిర్ణీత ప్రొఫార్మాలో వివరాలు అందజేయవలసి ఉంటుందని, అట్టి సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రెవిన్యూ, అటవీ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేయడం జరుగుతుందని, ప్రభుత్వం వద్ద ఉన్న రికార్డు లను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంతకు ముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూ భారతి విధి విధానాలను కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారిణి నికిత, అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, ఎల్లారెడ్డి ఆర్డీఓ మన్నే ప్రభాకర్, అటవీ అభివృద్ధి అధికారి రామకృష్ణ, లింగంపేట్ తహసీల్దార్ సురేష్, ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు రాజేందర్,ఇతర రెవిన్యూ, అటవీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# తనిఖీలో నరైన్, నోకియా బ్యాట్లు విఫలం.. ఐపీఎల్‌లో తొలిసారి ఇలా

కోల్‌కతా నైట్ రైడర్స్ ( పంజాబ్ కింగ్స్ మధ్య మంగళవారం మ్యాచ్ సందర్భంగా ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. సునీల్ నరైన్ ( నోకియా బ్యాట్లను అంపైర్లు తనిఖీ చేయగా పరీక్షలో విఫలమవ్వడంతో అంపైర్లు అనుమతించలేదు. నరైన్, నోకియా బ్యాట్ల మందం ఎక్కువగా ఉండటంతో వేరే బ్యాట్లను తెప్పించి క్రీజులోకి వచ్చారు.

కోల్‌కతా నైట్ రైడర్స్ ఓపెనింగ్ జోడీ సునీల్ నరైన్, అంగ్క్రిష్ రఘువంశీ క్రీజులోకి వచ్చినప్పుడు బ్యాట్లను రిజర్వ్ అంపైర్ సయ్యద్ ఖలీద్ తనిఖీ చేశారు. మందం ఎక్కువగా ఉండటంతో నరైన్ బ్యాట్‌ని మార్చమని సూచించారు. అయితే రఘువంశీ బ్యాట్ టెస్టులో పాసైంది. మ్యాచ్ మధ్యలో నోకియా బ్యాటింగ్‌కు వచ్చినప్పుడూ ఇదే జరిగింది. దీంతో వేరే బ్యాటు తీసుకోవాల్సి వచ్చింది.

బ్యాట్ల ప్రమాణాలు, పరిమాణం విషయంలో ఐపీఎల్ కొన్ని నియమాలు పాటిస్తోంది. ప్రమాణాలకు అనుగుణంగా బ్యాట్ ఉందా లేదా అనేది అంపైర్లు చెక్ చేస్తున్నారు. చాలా ఏళ్లుగా డ్రెస్సింగ్ రూమ్స్‌లోనే ఈ చెకింగ్ ఉండేది. అలా అక్కడే బ్యాట్లను పక్కనపెట్టేసేవారు. కానీ ఈ ఏడాది మైదానంలో కూడా పరిశీలిస్తున్నారు. అలా నరైన్, నోకియా బ్యాట్లు విఫలమయ్యాయి. ఐపీఎల్ చరిత్రలో ఓ బ్యాటర్ ఇలా మైదానంలోకి వచ్చి బ్యాట్ మార్చడం ఇదే తొలిసారి అని సమాచారం.

బీసీసీఐ రూల్స్ ప్రకారం బ్యాట్ వెడల్పు 10.79 సెంటీ మీటర్లకు మించకూడదు. అలాగే బ్యాట్ మందం 6.7 సెంటీ మీటర్ల కన్నా ఎక్కువగా ఉండకూడదు. బ్యాట్ అంచు వెడల్పు 4 సెంటీ మీటర్ల వరకు ఉండొచ్చు. బ్యాట్ పొడవు సైతం 96.4 సెంటీ మీటర్ల కంటే ఎక్కువ ఉండకూడదు.

ఐపీఎల్ ప్రారంభం నుంచే అంపైర్లు ప్లేయర్ల బ్యాట్లను పరిశీలిస్తున్నారు. అయితే ఇంతకు ముందు వారు ఆటగాళ్ల డ్రెస్సింగ్‌రూముల్లో బ్యాట్ల కొలతను తనిఖీ చేసేవారు. కానీ ఈ ఐపీఎల్ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ – రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్ – ముంబయి ఇండియన్స్ మ్యాచుల నుంచి మైదానంలో, బౌండరీ రోప్ అవతల ఆటగాళ్ల బ్యాట్లను అంపైర్లు తనిఖీ చేస్తున్నారు.

# అజింక్య రహానే డీఆర్‌ఎస్ తీసుకొని ఉండాల్సింది: మహ్మద్ కైఫ్



: పంజాబ్ కింగ్స్(, కోల్‌కతా నైట్‌రైడర్స్(కు మధ్య మంగళవారం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా 16 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. చాహల్ బౌలింగ్‌లో అజింక్య రహానే స్వీప్ షాట్ ఆడే ప్రయత్నం చేశాడు. గూగ్లీ పడిన బంతి ఎక్కువగా టర్న్ కాకుండా ప్యాడ్‌లను తాకింది. అప్పుడు చాహల్ అపీల్ చేయడంతో అంపైర్ ఔట్ ఇచ్చాడు. దీంతో మూడో వికెట్‌కు అంగ్క్రిష్ రఘువంశీ అజింక్య రహానే (%ూాయఱఅఎఖ =ఖష్ట్రుఱఅవ%) నెలకొల్పిన 55 పరుగుల భాగస్వామ్యానికి తెర పడింది. అప్పటికింకా 12 ఓవర్ల ఆట మిగిలే ఉంది. కానీ.. రహానే డీఆర్ఎస్ తీసుకోవడానికి ఆసక్తి చూపలేదు. రఘువంశీ చెబుతున్నప్పటికీ వినకుండా పెవిలియన్ బాట పట్టాడు.

రిప్లేలో మాత్రం బంతి స్టెప్ అవడం ఇంపాక్ట్ ఔట్‌సైడ్‌గా సూచించింది. ఒకవేళ రహానే రివ్యూ తీసుకొని ఉంటే కచ్చితంగా థర్డ్ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించి ఉండేవాడు. కోల్‌కతాకు గెలిచే అవకాశాలే ఎక్కువగా ఉండేవి. రహానే నిష్క్రమణ తర్వాత వెంటవెంటనే మిగతా బ్యాటర్లు ఔటయ్యారు. దీంతో 112 పరుగుల లక్ష్యసాధనలో కోల్‌కతా నైట్‌రైడర్స్, పంజాబ్ కింగ్స్ చేతిలో 95 పరుగులకే ఆలౌటై 16 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

రహానే నిర్ణయ లోపంపై మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ తన అభిప్రాయం వ్యక్తంచేశాడు. 'అజింక్య రహానే కాస్తైనా స్వార్థపూరితంగా ఆలోచించాల్సింది. అతడు కోల్‌కతాకు కీలకమైన బ్యాట్స్‌మెన్. తనకు అవకాశం ఉన్నా డీఆర్ఎస్ తీసుకోలేదు. సమీక్ష కోరుకొని ఉంటే ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడేవాడు. తన ఔట్ విషయంలో కాస్త అనుమానం ఉన్నా... డీఆర్ఎస్ తీసుకొని ఉండాల్సింది' అని మహ్మద్‌కైఫ్ ట్వీట్ చేశాడు.



# గాయంతోనే చాహల్ అద్భుత ప్రదర్శన

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా మంగళవారం.. కోల్‌కతా నైట్‌రైడర్స్ , పంజాబ్ కింగ్స్ కు మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 15.3 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బరిలోకి దిగిన కోల్‌కతా నైట్‌రైడర్స్ 15.1 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. దీంతో పంజాబ్ 16 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపులో చాహల్ కీలక పాత్ర పోషించాడు. నాలుగు ఓవర్లలో కేవలం 28 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు కూల్చాడు. కీలక సమయంలో అజింక్య రహానే () , అంగ్క్రిస్ రఘువంశీ (, రింకుసింగ్ (, రమణ్‌దీప్ సింగ్‌వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు.

అయితే గత మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న క్రమంలో చాహల్ భుజానికి గాయమైంది. ఈ విషయమై రికీపాటింగ్ మ్యాచ్ అనంతరం మాట్లాడాడు. 'కోల్‌కతా నైట్ రైడర్స్‌తో మ్యాచ్‌కు ముందు చాహెల్‌కు ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహించారు. తను ఫిట్‌గా ఉన్నానని చెప్పాడు. భుజం నొప్పితోనే చాహల్ ఈ అద్భుత ప్రదర్శన చేశాడు. నేను అతణ్ని అడిగితే నేను బాగున్నానని చాహల్ అన్నాడు' అని కోచ్ రికీ పాంటింగ్ అన్నాడు.

'ఇంతకు ముందు మ్యాచ్‌లో చాహల్ ఫీల్డింగ్ చేసే క్రమంలో క్యాచ్ కోసం డైవ్ చేశాడు. అప్పుడు భుజానికి గాయమైంది. సోమవారం రాత్రి వరకు అతడు మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడో లేదో తెలియని పరిస్థితి. తీవ్రమైన నొప్పితో ఇబ్బంది పడ్డాడు. అయినా అతడు కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుతమైన ప్రదర్శన చేశాడు' అని హర్షదీప్ సింగ్ క్రికెట్ మీద చాహల్‌కున్న ఆసక్తి గురించి చెప్పాడు.

# మేం చాలా చెత్తగా ఆడాం కదా: రహానే

ఐపీఎల్ ( 2025 సీజన్‌లో భాగంగా మంగళవారం కోల్‌కతా నైట్ రైడర్స్ ( పంజాబ్ కింగ్స్(%ూబఅయిఖఎ ఖఱఅస్త్రం%)కు మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 15.3 ఓవర్లకు 111 పరుగులకు ఆలౌటైంది. తర్వాత ఛేదనకు దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్ 15.1 ఓవర్లకు 95 పరుగులకు వికెట్లన్నీ కోల్పోయింది. పంజాబ్ చేతిలో 16 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. చాహల్ (తన బౌలింగ్‌లో విజృంభించి కేవలం 28 పరుగులిచ్చి 4 వికెట్లు కూల్చాడు.

చాహల్ వేసిన గూగ్లీని తప్పుగా అంచనా వేసి రహానే స్వీప్ షాట్ ఆడాడు. బంతి ఎక్కువగా టర్న్ కాకపోవడంతో అది ప్యాడ్లకు తాకింది. చాహల్ అపీల్ చేయడంతో అంపైర్ ఔట్‌గా ప్రకటించాడు. కానీ రహానే రివ్యూకు వెళ్లలేదు. రిప్లేలో ఆ బంతి పిచింగ్ ఔట్ సైడ్‌గా సూచించింది. రివ్యూకు వెళ్లి ఉంటే రహానేను థర్డ్ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించి ఉండేవాడు. ఈ విషయమై మ్యాచ్ అనంతరం రహానే మాట్లాడాడు. 'ఓ బ్యాటర్‌గా నేను రివ్యూను సేవ్ చేయాలనుకున్నాను. అది తర్వాత ఉపయోగపడుతుంది అనుకున్నా. ఒకవేళ నేను ఇప్పుడు రివ్యూ తీసుకుంటే అనవసరంగా దాన్ని కోల్పోతాం అనుకున్నా. అందుకే రివ్యూ తీసుకోలేదు' అని రహానే వివరించాడు. కఠినమైన పిచ్ మీద ఆడటానికి ఇరు జట్లలోని ఆటగాళ్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మ్యాచ్ అనంతరం అజింక్య రహానే, శ్రేయస్ అయ్యర్‌తో కరచాలనం చేస్తూ.. 'మేం చాలా చెత్తగా ఆడాం కదా' (క్యా ఫాల్తూ బ్యాటింగ్ కరే హమ్‌నే) అని అతడితో అన్నాడు.

# ఔరా పంజాబ్




అద్వితీయం.. అసాధారణం.. ఐపీఎల్–18లో పెను సంచలనం. బ్యాటర్లు నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడుతున్న టోర్నీలో, 240ం స్కోర్లకు సైతం గ్యారెంటీ లేని రోజుల్లో పంజాబ్ కింగ్స్ అద్భుతమే చేసింది. ఉత్కంఠ పోరులో 111 పరుగుల స్వల్ప స్కోరును కాపాడుకుని ఔరా అనిపించింది. కేకేఆర్‌కు కలలో కూడా ఊహించని పరాభవం.

హిట్టర్లకు కొదువలేని కోల్‌కతాకు ఇది పెద్ద షాకే. ఆ జట్టు ఓ దశలో 62/2తో నిలవగా.. చాహల్ తన స్పిన్ మాయాజాలంతో చకచకా నాలుగు వికెట్లు పడగొట్టి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఐపీఎల్ చరిత్రలోనే పూర్తి ఓవర్ల మ్యాచ్‌లో అత్యంత స్వల్ప స్కోరును రక్షించుకున్న జట్టుగా పంజాబ్ రికార్డు సృష్టించింది.

ముల్లాన్‌పూర్: యుజ్వేంద్ర చాహల్ (4/28) విజృంభించిన వేళ.. మంగళవారం స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ అద్భుత విజయం సాధించింది. ఆ జట్టు 16 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ఓడించింది. హర్షిత్ రాణా (3/25), వరుణ్ చక్రవర్తి (2/21), నరైన్ (2/14) ధాటికి మొదట పంజాబ్ 15.3 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌటైంది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (30బీ 15 బంతుల్లో 2ఐ4, 3ఐ6) టాప్ స్కోరర్. చాహల్‌తో పాటు యాన్సెన్ (3/17) విజృంభించడంతో ఛేదనలో కోల్‌కతా 15.1 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. రఘువంశీ (37బీ 28 బంతుల్లో 5ఐ4, 1ఐ6) ఒక్కడే రాణించాడు.

కోల్‌కతా అనూహ్యంగా..: 112 పరుగుల లక్ష్యం. కేకేఆర్ దీన్ని ఉఫ్ అని ఊదేస్తుందని భావించారంతా! పంజాబ్‌కు అవకాశాలున్నాయని ఒక్కరైనా అనుకుని ఉండరు. కానీ కోల్‌కతా అనూహ్యంగా తడబడింది. ఛేదనలో ఏడు పరుగులకే ఓపెనర్లు నరైన్ (5), డికాక్ (2) వెనుదిరిగారు. రఘువంశీ, రహానె (17) నిలవడంతో 62/2తో కోల్‌కతా సాఫీగా లక్ష్యం దిశగా సాగింది. ఆ జట్టు గెలవడం లాంఛనమే అనిపించింది. కానీ చాహల్ అద్భుతమైన బౌలింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. గిరగిరా బంతులతో చకచకా నాలుగు వికెట్లు పడగొట్టి పంజాబ్ సంచలన విజయానికి కారణమయ్యాడు. ఇన్నింగ్స్ 8, 10 ఓవర్లలో రహానె, రఘువంశీలను ఔట్ చేసిన అతడు.. 12వ ఓవర్లో రింకు (2), రమణ్‌దీప్ (0)ను ఔట్ చేసి కోల్‌కతాకు షాకిచ్చాడు. ఈ మధ్యలో వెంకటేశ్ అయ్యర్ (7)ను మ్యాక్స్‌వెల్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. కేకేఆర్ 12వ ఓవర్లలో 77/7తో నిలిచింది. చేయాల్సిన పరుగులు తక్కువగా, బంతులు పుష్కలంగా ఉన్నా ఆ జట్టుపై ఒత్తిడి పెరిగిపోయింది. పంజాబ్ పట్టుబిగించింది. ఆ పరిస్థితుల్లో రాణాను యాన్సెన్ ఔట్ చేయడంతో ఉత్కంఠ పెరిగింది. అయితే చాహల్ ఓవర్లో రసెల్ రెండు సిక్స్‌లు, ఒక ఫోర్ బాదేయడంతో కోల్‌కతా కూడా రేసులో నిలిచింది. రెండు వికెట్లు చేతిలో ఉన్న ఆ జట్టుకు ఆఖరి 6 ఓవర్లలో 17 పరుగులు చేయాల్సిన స్థితి. 15వ ఓవర్లో తొలి అయిదు బంతులను డిఫెండ్ చేసిన అరోరా.. ఆఖరి బంతికి ఔట్ కావడంతో ఉత్కంఠ తార స్థాయికి చేరింది. పంజాబ్ పైచేయిలో కనిపిస్తున్నా.. విధ్వంసక వీరుడు రసెల్ క్రీజులో ఉండడంతో కేకేఆర్‌ను కూడా తీసిపారేయలేని పరిస్థితి. కానీ 16వ ఓవర్ (యాన్సెన్) తొలి బంతికే రసెల్ (17) బౌల్డ్ కావడంతో పంజాబ్ సంబరాల్లో మునిగిపోయింది.

పంజాబ్ విలవిల: అంతకుముందు పంజాబ్ బ్యాటుతో పూర్తిగా తేలిపోయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆ జట్టు కేకేఆర్ బౌలర్ల ధాటికి విలవిల్లాడింది. అటు పేసర్ హర్షిత్ రాణా.. ఇటు స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, నరైన్ విజృంభించడంతో పంజాబ్ పరుగుల వేటలో పూర్తిగా విఫలమైంది. కనీస స్థాయిలో ప్రతిఘటించలేకపోయింది. నిజానికి పంజాబ్ ఆరంభం బాగానే ఉంది. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్ సింగ్, ప్రియాంశ్ ఆర్య (22బీ 12 బంతుల్లో 3ఐ4, 1ఐ6) ధనాధన్ షాట్లతో విరుచుకుపడడంతో ఇన్నింగ్స్ మెరుపులతో మొదలైంది. వైభవ్ అరోరా వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ వరుసగా 4, 6, 4 బాదగా.. ప్రియాంశ్ ఒక ఫోర్ కొట్టాడు. అంతకుముందు నోకియా బౌలింగ్‌లో ప్రియాంశ్ రెండు బంతులను బౌండరీ దాటించాడు. 3.1 ఓవర్లలో స్కోరు 39/0. పంజాబ్ మంచి స్కోరు దిశగా సాగుతున్నట్లనిపించింది. కానీ ప్రియాంశ్‌ను ఔట్ చేయడం ద్వారా ఆ జట్టు వికెట్ల పతనాన్ని రాణా ఆరంభించడంతో ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. వికెట్లు టపటపా పడ్డాయి. ఏ దశలోనూ పతనం ఆగలేదు. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన పంజాబ్.. పరుగుల వేటలో బాగా వెనుకబడిపోయింది. వచ్చిన బ్యాటర్ వచ్చినట్లు పెవిలియన్ చేరాడు. రాణా తన వరుస ఓవర్లలో శ్రేయస్ (0), ప్రభ్‌సిమ్రన్‌ను ఔట్ చేయగా.. ఇంగ్లిస్ (2)ను వరుణ్, నేహాల్ వధేరా (10)ను నోకియా పెవిలియన్ చేర్చారు. 9వ ఓవర్లో పంజాబ్ 5/74తో నిలవగా.. ఆ తర్వాత కూడా పతనం కొనసాగింది. 35 పరుగుల వ్యవధిలో ఆ జట్టు ఆఖరి 5 వికెట్లను చేజార్చుకుంది. ప్రమాదకర మ్యాక్స్‌వెల్ (7)ను బౌల్డ్ చేయడం ద్వారా పంజాబ్‌కు ఎలాంటి అవకాశం లేకుండా చేశాడు వరుణ్. సూర్యాంశ్ (4), యాన్సెన్ (1)ను నరైన్ ఒకే ఓవర్లో వెనక్కి పంపడంతో పంజాబ్ 86/8తో నిలిచింది. జేవియర్ బార్ట్‌లెట్ (11)తో 9వ వికెట్‌కు శశాంక్ సింగ్ (18బీ 17 బంతుల్లో 1ఐ4, 1ఐ6) 23 పరుగులు జోడించడంతో పంజాబ్ వంద దాటగలిగింది. కానీ 16 ఓవర్లలోపే ఆ జట్టు ఇన్నింగ్స్ ముగిసింది.

# బోయింగ్‌పై చైనా నిర్ణయం భారత్‌కు లాభమా..?

: బోయింగ విమానాల డెలివరీలను స్వీకరించకూడదంటూ తమ దేశ సంస్థలను చైనా ( ఆదేశించడం భారత్‌కు కలిసొచ్చేలా ఉంది. ఇప్పటికే పంపిణీ వ్యవస్థల్లోని ఇబ్బందుల వల్ల భారత్‌లోని వైమానిక రంగ సంస్థలు విమానాల కొరతతో ఇబ్బందిపడుతున్న వేళ.. బీజింగ్ నిర్ణయం సరికొత్త ఆశలు రేపుతోంది.

ప్రస్తుతం చైనా సంస్థలు 100 బోయింగ్ బీ737 మ్యాక్స్ విమానాల డెలివరీల కోసం ఎదురుచూస్తున్నాయి. ఇదే మోడల్‌ను భారత్‌కు చెందిన ఎయిర్ ఇండియా, ఆకాశ్ ఎయిర్ సంస్థలు ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చాయి. వీటితోపాటు 11 బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్లను కూడా ఎయిర్ ఇండియా ఇప్పటికే ఆర్డర్ పెట్టింది.

ఈనేపథ్యంలో చైనాకు డెలివరీకి సిద్ధమైన వాటిల్లో కొన్ని విమానాలు భారత్‌లోని కస్టమర్లకు మళ్లించవచ్చని వైమానిక రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతేడాది కూడా బోయింగ్ విషయంలో ఇలానే జరిగింది. ఒకరికని తయారుచేసిన రెండు విమానాలను చివరికి ఎయిర్ ఇండియా, ఆకాశ్‌లకు డెలివరీ చేయాల్సి వచ్చిందన్నారు.

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ మొత్తం గతేడాది 25 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలను కొనుగోలు చేసింది. మరో 25 విమానాల కోసం షెడ్యూల్



చేసింది. తాజాగా అమెరికా-చైనా ట్రేడ్ వార్ నేపథ్యంలో అదనపు డెలివరీలను భారతీయ సంస్థలు పొందే అవకాశం ఉంది. ఇక ఇప్పటికే చైనా కోసం మ్యాక్స్ విమానాలను ఉత్పత్తి చేసేందుకు సియాటెల్‌లో అసెంబ్లీ యూనిట్‌లో ఏర్పాటుచేసిన అదనపు సామర్థ్యం మొత్తం నిరుపయోగంగా మిగిలిపోనుంది. ఈనేపథ్యంలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ్ సంస్థలు చైనా కోసం తయారుచేసిన విమానాలను లేదా.. ఈ సంస్థలు ప్రత్యేకంగా ఆర్డర్ చేసిన లోహవిహంగాలను అందుకోనున్నాయి.

మరోవైపు బోయింగ్‌కు ప్రత్యర్థి అయిన ఎయిర్‌బస్ సంస్థ రెండు అసెంబ్లింగ్ లైన్లను నిర్వహిస్తోంది. వీటిల్లో ఏ320 రకాలను నిర్మిస్తోంది. ఈ నేపథ్యంలో తమకు విమానాల డెలివరీలను పెంచాలని బీజింగ్ ఈ సంస్థను కోరనుంది.

బోయింగ్ డెలివరీల ఆలస్యం కారణంగా..

ఇంతకాలం బోయింగ్ విమానాల డెలివరీల్లో జాప్యం ఆకాశ్ ఎయిర్‌పై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. ఆ సంస్థ ప్రస్తుతం, తమ సమీప భవిష్యత్తు అవసరాలకు మించి పైలట్లను నియమించుకొంది. దీంతో కొంతమేరకు సిబ్బందికి పని లేకుండా పోతోంది. ఇక ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ్ సంస్థలకు అదనపు విమానాలను కొనుగోలు చేయగల ఆర్థిక సామర్థ్యం ఉంది.

# యాంటీ ట్రస్ట్ ట్రయల్.. 1 బిలియన్ డాలర్లతో సెటిల్‌మెంట్‌కు యత్నించిన జుకర్‌బర్గ్

: మెటా సంస్థ అతిపెద్ద యాంటీ ట్రస్ట్ ట్రయల్‌ను ఎదుర్కొంటోంది. మార్కెట్లో గుత్తాధిపత్యం ఆరోపణల నేపథ్యంలో యూఎస్ ఫెడరల్ ట్రేడ్ కమిషన్ మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ ప్రశ్నిస్తోంది. అయితే ఈ ట్రయల్‌కు ముందు సెటిల్‌మెంట్ యత్నాలు జరిగాయని అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి.

విచారణకు ముందు జుకర్‌బర్గ్.. ఎఫ్‌టీసీ ఛైర్మన్ ఆండ్రూ ఫెర్గూసన్‌ను సంప్రదించారని ఆ కథనాలు పేర్కొన్నాయి. తొలుత 450 మిలియన్ డాలర్లు ఆఫర్ చేశారని, అయితే విచారణ సమీపిస్తోన్న సమయంలో ఆ మొత్తాన్ని 1 బిలియన్ డాలర్లకు (భారత కరెన్సీలో రూ.8,569 కోట్లు) పెంచారని సమాచారం. అయితే దానిని ఛైర్మన్ తిరస్కరించారు. ఎఫ్‌టీసీ 30 బిలియన్ డాలర్లు ఆశిస్తోందని, 18 బిలియన్ డాలర్ల కంటే తక్కువ ఏ సెటిల్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి సుముఖత వ్యక్తం చేయలేదని పేర్కొన్నాయి. ట్రయల్‌ను తప్పించుకునేందుకు మెటా సీఈఓ ఒక పిచ్చి ప్రయత్నం చేశారని వెల్లడించాయి.

పోటీ లేకుండా చేసేందుకు దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగానే ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ (ను మెటా కొనుగోలు చేసిందని ఎఫ్‌టీసీ ఆరోపించింది. సామాజిక మాధ్యమ రంగంలో ఏకఛత్రాధిపత్యం కోసం ఆ కంపెనీ ప్రయత్నించిందని దుయ్యబట్టింది. ఈసందర్భంగా కొన్ని అంతర్గత మెయిల్స్‌ను కమిషన్ ప్రస్తావించింది. అందులో మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ ) చేసిన ఈ-మెయిల్ కూడా ఉంది. 'పోటీ పడడం కంటే వాటిని కొనుగోలు చేయడమే ఉత్తమం' అని జుకర్‌బర్గ్ ఆ సందేశంలో పేర్కొన్నారని, దాన్ని బట్టి వారి వ్యూహం ఏంటో అర్థమవుతుందని కమిషన్ వ్యాఖ్యానించింది.

ఈ విచారణపై మెటా న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. తమ కంపెనీ పెట్టుబడులు పెట్టకపోయి ఉంటే.. ఆ యాప్సనకు ఇంత ఆదరణ వచ్చేది కాదని మెటా న్యాయవాది తమ ఫైలింగ్‌లో పేర్కొన్నారు. ఒకవేళ, కోర్టు ఉత్తర్వులు మెటాకు వ్యతిరేకంగా వస్తే.. కమిషన్ తీసుకునే నిర్ణయం కీలకం కానుంది. ఫలితంగా ఈ టెక్ కంపెనీ ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్‌ను విక్రయించాల్సి రావొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ కంపెనీ ఆదాయంలో 50శాతం ఇన్‌స్టా నుంచి ఆర్జిస్తున్నదేనని తెలుస్తోంది. అయితే



మెటా నుంచి వాటిని విడదీయడం అంత సులభమైన ప్రక్రియ ఏమీ కాదని తెలుస్తోంది.

ఇదిలాఉంటే.. 2021లో క్యాపిటల్ భవనంపై ట్రంప్ అనుచరులు దాడి చేయడంతో ఆయన ట్విటర్ (ప్రస్తుతం ఎక్స్), ఫేస్‌బుక్ యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలపై నిషేధం విధించిన సంగతి తెలిసిందే. అనంతరం 2023లో వాటిని పునరుద్ధరించారు. అయితే అంతకుముందే మెటా సంస్థపై ట్రంప్ దావా వేశారు. ఇటీవల దానిని ట్రంప్, జుకర్‌బర్గ్ సెటిల్ చేసుకున్నారు. అదేక్రమంలో ఈ యాంటీ ట్రస్ట్ ట్రయల్‌పై ట్రంప్ నుంచి మద్దతు వస్తుందని మెటా అధినేత ఆశించారు. ఈ గుత్తాధిపత్య దావా విషయంలో జోక్యం చేసుకోవాలని అభ్యర్థించినట్లు సమాచారం.

# జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌తో ఎయిర్‌టెల్ కొత్త ప్లాన్

ప్రముఖ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ ( కొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. ఐపీఎల్ సీజన్‌ను దృష్టిలోపెట్టుకొని అదనపు డేటా, జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌తో ఈ ప్లాన్‌ను లాంచ్ చేసింది. ఇది కేవలం స్టాండలోన్ ప్రీపెయిడ్ డేటా ప్లాన్. అంటే ఎస్సెమ్మెస్, కాలింగ్ సదుపాయాలు ఉండవు. యాక్టివ్ వాయిస్ ఉండి.. అదనంగా డేటా, జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ కోరుకునేవారికి మాత్రమే ఈ ప్లాన్ ఉపయోగపడుతుంది. ఎయిర్‌టెల్




తీసుకొచ్చిన కొత్త రూ.451 ప్లాన్ 30 రోజుల వ్యాలిడిటీతో వస్తోంది. ఇందులో 50 జీబీ డేటా లభిస్తుంది. 3 నెలల పాటు జియో హాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్ కూడా ఇస్తున్నారు. ఐపీఎల్ సీజన్‌ను దృష్టిలోపెట్టుకొని ఎయిర్‌టెల్ ఈ ప్లాన్‌ను తీసుకొచ్చింది. ఇప్పటికే రూ.100 (5జీబీ), రూ.195 (15జీబీ) ప్లాన్లను ఎయిర్‌టెల్ అందిస్తోంది.

# ఏఐ కొలువుల్లో భారత్ టాప్

'కృత్రిమ మేధ (ఏఐ) నిపుణుల నియామకంలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచింది. కానీ, ఈ ప్రతిభను నిలబెట్టుకోవడంలో ఇబ్బందులు పడుతోంది. ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, మేధో సంపత్తి హక్కులను పొందడంలో సవాళ్లను ఎదుర్కొంటోంది' అని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ 'ఏఐ ఇండెక్స్ 2025' నివేదిక వెల్లడించింది. 'భారతీయ నిపుణులు ఏఐ నైపుణ్యాలను పెంచుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు, వ్యవస్థాపక స్ఫూర్తి ఎంతో బలంగా ఉన్నాయి. అయితే విధాన నిర్ణయాలు, విద్యా వ్యవస్థలో లోటు ఏఐ అభివృద్ధిని అడ్డుకుంటున్నాయ'ని నివేదిక తేల్చి చెప్పింది.




గత ఏడాది ఏఐ ఉద్యోగ నియామకాల్లో భారత్ మొదటి స్థానానికి చేరుకుంది. ఇందులో 33.39% వృద్ధి నమోదయ్యింది. బ్రెజిల్ 30.83%, సౌదీ అరేబియా 28.71 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అమెరికాలో ఇది 24.73 శాతంగానే ఉంది. 2015-24 మధ్య ఏఐ నైపుణ్యాల విస్తృతిలో అమెరికా 2.6 స్కోరుతో ముందుండగా తర్వాతి స్థానంలో 2.5 స్కోరుతో భారత్ ఉంది.

ఏఐ సంబంధిత గిట్‌హబ్ ప్రాజెక్టుల్లో 19.9% వాటాతో భారత్ కీలకంగా ఉంది. అమెరికా 23.4%, ఐరోపా 19.5 శాతంతో ఉన్నాయి. ఓపెన్-సోర్స్ ఏఐ అభివృద్ధిలో భారత్‌కు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ఇది సూచిస్తోంది. ఈ సమాచారం లింక్డ్ఇన్ ఆధారంగా తీసుకున్నారు. భారత్‌లాంటి దేశాల్లో దీని వినియోగం అంతగా ఉండదని, కాబట్టి, సమాచారంలో కొంత వ్యత్యాసం ఉండొచ్చనీ నివేదిక పేర్కొంది.

పెట్టుబడులు తక్కువే..

ఏఐ నిపుణుల నియామకాలు, సాంకేతికత అభివృద్ధి కార్యకలాపాల్లో భారత్ ఎంతో క్రియాశీలకంగా ఉందని నివేదిక వెల్లడించింది. కానీ, ప్రైవేట్ రంగం నుంచి ఏఐ పెట్టుబడులు సాధించడంలో భారత్ వెనకబడి ఉంది. 2013 నుంచి భారతీయ ఏఐ రంగంలోకి 11.29 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. ఇదే సమయంలో అమెరికా 470.9 బి.డాలర్లు, చైనా 119.3 బి.డాలర్ల పెట్టుబడులను ఆకర్షించింది. యూకే 28.2 బి.డాలర్లను 2024లోనే సంపాదించింది. ఏఐ పెట్టుబడుల విషయంలో అమెరికా ఎంతో ముందుంది. 109.1 బి.డాలర్ల పెట్టుబడులను పెట్టింది. ఇది చైనా పెట్టుబడి 9.3 బి.డాలర్లతో పోలిస్తే 12 రెట్లు అధికం.

అంకురాల్లో చూస్తే..

అంకురాల విషయంలోనూ భారత్ ఏమంత ఆశాజనకంగా లేదు. 2024లో కేవలం 74 ఏఐ స్టార్టప్‌లే ఇక్కడ ఆవిర్భవించాయి. అమెరికాలో 1,073, యూకేలో 116, చైనాలో 98 అంకురాలు వచ్చాయి. ఏఐ పరిశోధనల విషయంలోనూ భారత భాగస్వామ్యం తక్కువే. బాధ్యతాయుతమైన ఏఐపై భారత్ 2024లో 42 పరిశోధనా పత్రాలు సమర్పించింది. అమెరికా 669, చైనా 268 పత్రాలను సమర్పించాయి.

ఏఐ మోడళ్ల నాణ్యత విషయంలోనూ చైనా ఎంతో మెరుగ్గా ఉంది. డీప్‌సీక్, క్వెన్, మానస్‌లాంటి ఏఐ మోడళ్లు ఇందుకు తోడ్పడ్డాయి. అమెరికా 40, చైనా 15, యూరప్ 3 వరకు ముఖ్యమైన ఏఐ మోడళ్లను విడుదల చేశాయి. లాటిన్ అమెరికా, పశ్చిమాసియా, ఆగ్నేయాసియాల నుంచి ఏఐ మోడళ్ల అభివృద్ధి ఎక్కువగా ఉందని స్టాన్‌ఫోర్డ్ నివేదిక పేర్కొంది.

ఏఐ పాలసీతో..

గత ఏడాది మార్చిలో భారత్ ఏఐ మిషన్‌ను ప్రారంభించింది. ఇందుకోసం 1.25 బి.డాలర్లతో ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమం కింద 10,000 జీపీయూలను ప్రారంభించడం, జాతీయ వ్యక్తిగతేతర డేటా ప్లాట్‌ఫామ్‌ను సృష్టించడం, దేశీయ అంకురాలు, ఏఐ మోడళ్లకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంది. నైతికతతో ఏఐ అభివృద్ధి, ప్రధాన మెట్రో నగరాల్లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ ఏఐ పరిశోధనా సామర్థ్యాన్ని విస్తరించడమూ ఇందులో భాగమే. ఇతర దేశాలతో పోలిస్తే ఈ పెట్టుబడి స్థాయి ఎంతో తక్కువగా ఉంది. కెనడా 2.4 బి.డాలర్లు, ఫ్రాన్స్ 117 బి.డాలర్లు, సౌదీ అరేబియా 100 బి.డాలర్లతో సెమీ-కండక్టర్ల ఆధారిత ఏఐ అభివృద్ధి కోసం ప్రణాళికలను ప్రకటించాయి.

గిరాకీకి తగ్గ నైపుణ్యాల కొరత

ఏఐ ఉద్యోగ నియామకాల్లో గణనీయ వృద్ధి కనిపించినప్పటికీ.. భారతీయ రిక్రూటర్లు సరైన ప్రతిభ దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2025 ఫిబ్రవరి లింక్డ్ఇన్ నివేదిక ప్రకారం.. దేశంలో 54 శాతం హెచ్‌ఆర్ నిపుణులు తమకు అందే ఉద్యోగ దరఖాస్తుల్లో సగం లేదా అంతకంటే తక్కువ మంది మాత్రమే అవసరమైన అర్హతలను కలిగి ఉన్నారని చెప్పారు. సాంకేతికత, సాఫ్ట్‌స్కిల్స్ రెండింటినీ ఉన్న అభ్యర్థులను నియమించుకోవడం సవాలేనని పేర్కొన్నారు. ఉద్యోగ అర్హతలో 80% ఉన్న అభ్యర్థులనే తాము పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపారు. ఒక అధ్యయనం ప్రకారం.. 2027 నాటికి భారత్‌కు 23 లక్షల మందికి పైగా ఏఐ నిపుణులు అవసరం. కానీ, ప్రస్తుత నిపుణుల సంఖ్య ప్రకారం 2024లో 8 లక్షలు, 2025 నాటికి 9.40 లక్షలు, 2026 నాటికి 10.8 లక్షల మంది నిపుణులే అందుబాటులో ఉంటారు. అంటే.. ఇంకా 10 లక్షల కంటే ఎక్కువ మంది నిపుణుల కొరత ఉంది. భారతీయ విద్య, నైపుణ్యాభివృద్ధికి ఇది ఒక సవాలు, అదే సమయంలో అవకాశాలను సూచిస్తోంది. ఇప్పటికే ఉన్న ఐటీ నిపుణులు తమ నైపుణ్యాలను 'రీస్కిల్లింగ్' చేసుకోవాల్సిన అవసరమూ కనిపిస్తోంది.

# చైనాపై 245 శాతం అమెరికా సుంకాలు..?ఆ వార్తలపై డ్రాగన్ కౌంటర్

అమెరికా-చైనా మధ్య వాణిజ్యపరంగా తీవ్రస్థాయి ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ తరుణంలో చైనాకు చెందిన కొన్ని ఉత్పత్తులపై యూఎస్ సుంకాలను 245 శాతం పెంచే అవకాశాలున్నట్లు వార్తలు వస్తున్నాయి. చైనా ప్రతీకార చర్యల ఫలితంగా ఆ దేశ ఉత్పత్తులు ఆ స్థాయి వరకు సుంకాన్ని ఎదుర్కోవచ్చని వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్‌ను ఉటంకించాయి. అయితే ఇంత భారీగా టారిఫ్‌ల పెంపు ఉన్నప్పుడు ట్రంప్ మీడియా ఎదుట ప్రకటన చేస్తుంటారు. అయితే ఈసారి అలాంటి హడావుడి ఏదీ కనిపించలేదు. అమెరికా 145 శాతం నుంచి 245 శాతానికి నిజంగానే సుంకాలు పెంచిందా లేక టైపింగ్ తప్పిదమా..?పలువురు నెటిజన్లు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

తాజాగా వస్తోన్న వార్తలపై డ్రాగన్ స్పందించింది. అసలు సుంకాలు ఎంత అనే విషయాన్ని అమెరికానే అడగాలని విదేశాంగ శాఖ కౌంటర్ ఇచ్చింది. "వాణిజ్య యుద్ధంలో విజేతలు ఉండరు. మా దేశం ఇలాంటి యుద్ధాలు చేయాలని కోరుకోవడం లేదు. అలాగే వాటికి భయపడటం లేదు" అని తేల్చిచెప్పింది. ఇప్పటికే అమెరికా నుంచి దిగుమతి అవుతోన్న ఉత్పత్తులపై చైనా 125 శాతం సుంకం విధించిన సంగతి తెలిసిందే. ఇకనుంచి యూఎస్ వేసే టారిఫ్‌లను తాము పట్టించుకోబోమని స్పష్టం చేసిన విషయం విదితమే. ఇదంతా ఒక నంబర్ గేమ్‌గా అభివర్ణించిన చైనా.. ఈ తతంగమంతా ఆచరణాత్మక ప్రాముఖ్యత లేనిదని, దీర్ఘకాలంలో రెండు



దేశాలపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని చెప్పింది.

# టారిఫ్ నష్టాలన్నీ తీరాయి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాల ఉత్పత్తులపై విధించిన ప్రతీకార సుంకాల విషయంలో 90 రోజుల విరామానికి తోడు, వాహన రంగానికీ మినహాయింపు ఇస్తామనే సంకేతాలు ఇవ్వడంతో మంగళవారం ప్రపంచ మార్కెట్లు పరుగులు తీశాయి. దేశీయ సూచీలూ, అదే స్థాయిలో దూసుకెళ్లాయి. దీంతో ఏప్రిల్ 2న ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రకటన అనంతరం వచ్చిన నష్టాలను, దేశీయ సూచీలు దాదాపుగా పూడ్చుకున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 30 పైసలు బలపడి 85.80 వద్ద ముగిసింది.

బీఎస్‌ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ గత రెండు ట్రేడింగ్ రోజుల్లో రూ.18.42 లక్షల కోట్లు పెరిగి రూ.412.24 లక్షల కోట్లు (4.81 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది. గత శుక్రవారం రూ.7.85 లక్షల కోట్లు, మంగళవారం రూ.10.57 లక్షల కోట్ల మేర మదుపర్ల సంపద పెరిగింది. గత రెండు ట్రేడింగ్ రోజుల్లో సెన్సెక్స్ 2,887.74 పాయింట్లు దూసుకెళ్లింది. సెన్సెక్స్ ఉదయం 1695 పాయింట్ల (క్రితం ముగింపు 75,157.26) లాభంతో 76,852.06 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. కొనుగోళ్లు మద్దతుతో రోజంతా అదే దూకుడు కొనసాగించిన సూచీ, ఇంట్రాడేలో 1,750.37 పాయింట్ల లాభంతో 76,907.63 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 1,577.63 పాయింట్ల లాభంతో 76,734.89 వద్ద ముగిసింది. నిఫ్టీ 500 పాయింట్లు రాణించి 23,328.55 దగ్గర స్థిరపడింది.



# చైతన్యకు తగ్గ కథే అని అప్పుడర్థమైంది: ‘తండేల్’పై పరుచూరి రివ్యూ

: నాగచైతన్య, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో దర్శకుడు చందూ మొండేటి తెరకెక్కించిన చిత్రం ‘తండేల్’ ( బాక్సాఫీసు వద్ద మంచి విజయం అందుకున్న ఈ సినిమా ప్రస్తుతం ఓటీటీ ‘నెట్‌ఫ్లిక్స్’లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ చిత్రంపై ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ () తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ‘పరుచూరి పాఠాలు’ పేరుతో సంబంధిత వీడియోను తన యూట్యూబ్‌లో ఛానల్‌లో విడుదల చేశారు. ఆ సంగతులు ఆయన మాటల్లోనే..

‘‘ఈ సినిమా చూస్తున్నప్పుడు ఏయన్నార్ ‘మూగ మనసులు’ గుర్తొచ్చింది. చిత్ర బృందం చెప్పినట్టే రొమాంటిక్, యాక్షన్, థ్రిల్లింగ్ అంశాలు ‘తండేల్’లో ఉన్నాయి. తుపానుల సమయంలో.. మత్స్యకారులు సముద్రంలో జోన్లు గుర్తించడం కష్టం. దీంతో, వేరే దేశాల్లోకి ప్రవేశించాల్సి వస్తుంది. అలా వెళ్లిన వారి పరిస్థితేంటి అన్న అంశంతో అద్భుతమైన ప్రేమకథను సృష్టించారు. శ్రీకాకుళానికి చెందిన పలువురు మత్స్యకారులు పాకిస్థాన్ కోస్ట్ గార్డ్‌కు చిక్కిన ఘటన ఆధారంగా దర్శకుడు చందూ మొండేటి తెరకెక్కించారు. ప్రచార చిత్రాలు చూసినప్పుడు.. నాగచైతన్య బాడీ లాంగ్వేజ్‌లా లేదే అనుకున్నా. ఇది చైతన్యకు తగ్గ కథే అని సినిమా చూశాక అర్థమైంది. హీరో పాత్రకు డైరెక్టర్ కొంత మాస్‌ని కూడా జోడించారు. మాస్ హీరోల సినిమాలు భారీ కలెక్షన్స్ చేస్తుంటాయిగానీ నాగచైతన్య సినిమా రూ.100 కోట్లు వసూళ్లు చేయడం మామూలు విషయం కాదు’’

‘‘హీరోయిన్ ఒంటరిగా కూర్చొని బాధపడుతున్నట్టుగా చూపించి సినిమా ప్రారంభంలోనే ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించారు. సాయి పల్లవి ( అద్భుతమైన నటి. ఇందులో హీరోకు సమానమైన పాత్ర ఆమెకు దక్కింది. ఇది ప్రేమకథే అని ముందే మనకు తెలిసినా.. హీరోయిన్‌కు మరో వ్యక్తితో పెళ్లి అనే ఎపిసోడ్‌తో ఉత్కంఠ పెంచారు. పాకిస్థాన్‌లో చిక్కుకున్న హీరో తిరిగొస్తాడా?అనేది కూడా ఉత్కంఠే. హీరోయిన్ మనసుకు సంబంధించి చూపించిన సింబాలిక్ షాట్ బాగుంది. ‘ఊరి సమస్య తన సమస్య అనుకునేవాడే నాయకుడు’ వంటి సంభాషణలు అద్భుతం. ప్రీ క్లైమాక్స్ కూడా క్లైమాక్స్ స్థాయిలో ఉంది. 22 మందిలో ఒకరు లోపలే ఉండిపోతే.. ఆయన కోసం హీరో వెళ్లే విషయంలో దర్శకుడికి హ్యాట్సాఫ్. వారి ఐక్యమత్యం గురించి చూపించిన సన్నివేశాలు హత్తుకుంటాయి. ఎవరో ఒకరి ప్రాణం కాపాడడం కోసం ఈ 22 మంది చిక్కుకున్నారు’’ అని పేర్కొన్నారు.

క్లైమాక్స్‌లో ఒక్క వ్యక్తి కోసం హీరో విడుదల కాకుండా మళ్లీ గేట్ దూకి లోపలికి వచ్చాడంటే అది రియల్ హీరోయిజమన్నారు. ఇలాంటి సన్నివేశాలు ప్రేక్షకుల హృదయాలకు హత్తుకుంటాయన్నారు. అద్భుతమైన సినిమా తీసినందుకు నాగచైతన్యకు పరుచూరి హ్యాట్సాఫ్ చెప్పారు. చిత్రబృందాన్ని అభినందించారు.

# శ్రద్ధా కపూర్‌తో పోలిక.. నాకొక ప్రశంస: యువ నటి



%ముంబయి: ‘లాపతా లేడీస్’తో ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు యువ నటి నితాన్షీ గోయల్ ఇందులో ఆమె ఫూల్ కుమారీ పాత్ర పోషించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నితాన్షీ కొంతమంది నెటిజన్లు తనని శ్రద్ధాకపూర్ తో పోల్చి చూస్తున్నారని అన్నారు. అందుకు తాను ఏమాత్రం బాధ పడటం లేదన్నారు. నిజం చెప్పాలంటే అదొక ప్రశంస అని తెలిపారు.

“లాపతా లేడీస్’ నా జీవితాన్ని ఎంతో మార్చేసింది. ఆ సినిమా విడుదలయ్యాక నేను ఎక్కడికి వెళ్లినా అందరూ నన్ను ఫూల్ అనే పిలుస్తున్నారు. అందుకు నాకెంతో సంతోషంగా అనిపిస్తుంది. సోషల్‌మీడియాలోనూ నన్ను ఫాలో అయ్యేవారి సంఖ్య పెరిగింది. ఇటీవల నేను షేర్ చేసిన ఫొటోలు కొన్నింటికి పలువురు నెటిజన్ల నుంచి విభిన్నమైన రియాక్షన్స్ వచ్చాయి. ముఖ్యంగా కొన్ని ఫొటోల్లో నేను శ్రద్ధాకపూర్‌లా ఉన్నానని పలువురు అన్నారు. అది నన్ను ఏమాత్రం బాధ పెట్టలేదు. అలాంటి కామెంట్స్ చూసి నేనెంతో మురిసిపోయాను. అది నాకొక ప్రశంస. ఆమెకు నేనొక వీరాభిమానిని. ఆమె మాదిరిగా నేను కూడా కెరీర్‌లో రాణించాలి. ఆమె డ్యాన్స్ నాకెంతో నచ్చుతుంది. ఆమె డ్యాన్స్ చేసిన ‘ఏబీసీడీ 2’లో సన్ సాథియా పాట మా ఇంట్లో ఎప్పుడూ ప్లే అవుతూనే ఉంటుంది. ఆమె వేసిన స్టెప్పులను నేను కూడా నేర్చుకుంటున్నా” అని తెలిపారు.

యూకే టాప్ 50 ఏషియన్ సెలబ్రిటీల జాబితాలో చోటు దక్కించుకోవడంపై స్పందిస్తూ.. “అమితాబ్ బచ్చన్, ప్రియాంకా చోప్రా వంటి ఎంతోమంది అగ్ర తారలతోపాటు ఆ జాబితాలో చోటు దక్కించుకోవడం నిజంగా అదృష్టం. నా ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను. ఇది గర్వంగా ఉంది. నాలో స్ఫూర్తి నింపింది. కెరీర్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలియజేసింది” అని అన్నారు. 17 ఏళ్లకే ఇండస్ట్రీలోకి వచ్చినందుకు ఏమీ ఇబ్బంది పడటం లేదన్నారు. సినిమాకు సంబంధించిన ఎన్నో విషయాలను ఇప్పటినుంచే తెలుసుకునే వెసులుబాటు కలిగిందన్నారు. భవిష్యత్తులో మరెన్నో విభిన్నమైన చిత్రాల్లో యాక్ట్ చేయాలని ఉందని చెప్పారు.

# నా అరుపులకు సెట్లో వాళ్లు చాలాసార్లు భయపడ్డారు

హీరోగా.. ప్రతినాయకుడిగా.. సహాయ నటుడిగా విభిన్నమైన పాత్రలతో సినీప్రియుల్ని మెప్పించారు శివాజీ. గతేడాది ‘చ90స్’ వెబ్‌సిరీస్‌తో ఈటీవీ విన్ వేదికగా అందర్నీ అలరించిన ఆయన.. ఇప్పుడు ‘కోర్ట్: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ’లో మంగపతిగా కీలక పాత్ర పోషించారు శివాజీ. హీరో నాని ( సమర్పణలో ప్రియదర్శి ప్రధాన పాత్రధారిగా రామ్ జగదీశ్ తెరకెక్కించిన చిత్రమిది. ఇది శుక్రవారం థియేటర్లలోకి వచ్చిన నేపథ్యంలో ఆయన హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..




‘‘నేను ప్రజలకు అండగా నిలబడాలన్న లక్ష్యంతో 12ఏళ్ల క్రితం సినిమాలకు దూరమయ్యా. ఈ ప్రయాణంలో ఎన్నో సమస్యలపై ప్రజల తరఫున నా గొంతుక వినిపించా. పదవుల కోసమో.. రాజకీయ పార్టీల అండదండల కోసమో చేసిన ప్రయత్నం కాదిది. అయితే కొన్నేళ్లుగా నా భార్య, పిల్లలు మళ్లీ నటించొచ్చు కదాని అడగడంతో మళ్లీ సినిమాలపై దృష్టి సారించా. కాకపోతే నాకు మళ్లీ తెరపైకి రావాలని ఉన్నా.. నాకు అవకాశం ఇమ్మని ఎవరినీ అడగలేకపోయేవాణ్ని. అప్పుడే సొంత నిర్మాణంలో ఓ సినిమా చేయాలని ప్రయత్నాలు చేస్తూ.. ఈటీవీ బాపినీడును కలిశా. ఆయన సలహాతోనే ‘చ90స్’ వెబ్‌సిరీస్ ఓకే చేశా. అది పెద్ద హిట్టవ్వడంతో అవకాశాలు మళ్లీ వరుస కట్టాయి. ఈ క్రమంలోనే దాదాపు 80కథలు విన్నా. వాటిలో ఎక్కువ తండ్రి పాత్రలే కావడంతో చాలా వరకు రిజెక్ట్ చేశా. కానీ, ‘కోర్ట్’లో మంగపతి పాత్ర గురించి విన్నాక.. దాన్ని చేశాక నా 25ఏళ్ల కల నెరవేరినట్లు అనిపించింది. నాని ద్వారా ఈ అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉంది’’.

హీరోగానే చేయాలని అనుకోలేదు..

“ఎస్వీ రంగారావు, గుమ్మడి, జగ్గయ్య, రాజనాల తదితరులంతా ఎన్నో మరపురాని పాత్రలు చేశారు. నాకూ అలాంటి పాత్రలు చేయాలని కోరిక ఉండేది. అందుకే కెరీర్ ఆరంభం నుంచి కూడా నేను హీరోగానే చేయాలని ఎప్పుడూ అనుకోలేదు. ‘ఒట్టేసి చెబుతున్నా’, ‘మనసుంటే చాలు’, ‘జల్సా’ తదితర సినిమాల్లోని పాత్రలు అలా చేసినవే. అవన్నీ నాకు నటుడిగా మంచి పేరు తీసుకొచ్చాయి. ఇప్పుడీ రీఎంట్రీలోనూ నేను అదే ఆలోచనతో ఉన్నా. నా దారిలో వచ్చే కథల్లో నుంచి వైవిధ్యభరితమైన పాత్రలతో అలరించాలనుకుంటున్నా. క్రూరమైన పాత్రలతో ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరచాలన్న కోరిక బలంగా ఉంది. ప్రస్తుతం ‘కోర్ట్’లో (%జశీబతీ%) మంగపతి పాత్రకు వస్తున్న ఆదరణ ఆనందాన్నిస్తోంది. ఇది పూర్తిగా నాకోసమే పుట్టిన పాత్ర. ఆ పాత్రలోని సహజమైన ఎవెూషన్ అందరికీ నచ్చుతోంది. ప్రతి కుటుంబంలోనూ అలాంటి ప్రొటెక్టివ్ నేచర్ ఉన్న వ్యక్తి ఒకరు కనిపిస్తుంటారు. ఈ పాత్ర చేసేటప్పుడు నా అరుపులకు సెట్లో ఉన్న వాళ్లంతా చాలాసార్లు భయపడ్డారు’’.

బాధేం లేదు..

‘‘ఇన్నేళ్లు సినిమాలకు దూరంగా ఉన్నందుకు నాకేం బాధలేదు. ఎందుకంటే నేను నా ప్రజల కోసం నిలబడ్డా. నా ప్రాంతం కోసం.. భావితరాల కోసం పోరాటం చేశా. ఎప్పటికీ ఆ జనాలకు అండగానే ఉంటా. ప్రస్తుతం నేను నా సొంత నిర్మాణ సంస్థలో లయతో కలిసి ఓ సినిమా చేస్తున్నా. ఇప్పటికే 90శాతం చిత్రీకరణ పూర్తయింది. జూన్‌లో విడుదల చేసే అవకాశముంది. అలాగే ‘దండోరా’ అనే చిత్రం చేస్తున్నా. ఓ పెద్ద సినిమాకీ ఓకే చెప్పా. త్వరలో దాన్ని అధికారికంగా ప్రకటిస్తారు. ‘చ90స్’కు సీక్వెల్ ఉంటుంది’’.



# స్క్రీన్‌ప్లే అద్భుతంగా ఉంది..: నానిని మెచ్చుకున్న రాఘవేంద్రరావు

హైదరాబాద్: హర్ష్ రోషన్, శ్రీదేవి, ప్రియదర్శి, శివాజీ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం ‘కోర్ట్’ ( చిన్న చిత్రంగా విడుదలై ప్రముఖుల ప్రశంసలు అందుకుంటోందీ మూవీ. సినిమా బాగుందంటూ సినీ ప్రముఖులు, ప్రేక్షకులు చెబుతున్నారు. ఈనేపథ్యంలోనే తాజాగా ఈ సినిమాను ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు వీక్షించారు. సినిమా చక్కగా ఉందని ఆయన పేర్కొన్నారు. స్క్రీన్ ప్లే అద్భుతంగా ఉందని తెలిపారు. ఈ మేరకు టీమ్‌ను మెచ్చుకుంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

‘‘నిన్న కోర్ట్ సినిమా చూశాను. అద్భుతమైన స్క్రీన్ ప్లేతో చూడచక్కగా ఈ చిత్రాన్ని రూపొందించారు. దర్శకుడు రామ్ జగదీశ్ సరైన కథతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ఇలాంటి చిత్రాన్ని నిర్మించి ప్రేక్షకులకు అందించిన నాని, ప్రశాంతిని మెచ్చుకుని తీరాలి. సినిమాలోని ప్రతిఒక్కరూ చక్కగా నటించారు. ముఖ్యంగా శివాజీ నటన ఉత్తమంగా ఉంది” అని అన్నారు. ఇదే చిత్రంపై రవితేజ కూడా ప్రశంసల వర్షం కురిపించారు. “ఈ కోర్ట్ రూమ్ డ్రామాను చక్కగా తీర్చిదిద్దారు. అన్ని విషయాల్లో టీమ్ పనితీరు బాగుంది. రామ్ జగదీశ్ ఈ కథను రాసిన విధానం.. స్క్రీన్ మీదకు తీసుకువచ్చిన తీరు బాగుంది. నటీనటులందరూ మంచిగా నటించారు. ఇలాంటి కథకు నిర్మాతగా వ్యవహరించిన నానికి నా అభినందనలు” అని తెలిపారు.

2013 నేపథ్యంలో సాగే కథ ఇది. ఇంటర్ ఫెయిల్ అయిన ఓ కుర్రాడు (చందు).. పెద్దింటి అమ్మాయి జాబిలి (శ్రీదేవి) ప్రేమ, తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో ఈ సినిమా సిద్ధమైంది. జాబిలి బంధువు మంగపతి పాత్రలో శివాజీ నటన అంతటా ప్రశంసలు దక్కించుకుంటోంది. శుక్రవారం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకువచ్చింది. సినిమాపై ఉన్న నమ్మకంతో గురువారం కొన్ని థియేటర్లలో ప్రీమియర్స్ ప్రదర్శించిన విషయం తెలిసిందే. ప్రీమియర్స్, తొలిరోజు వచ్చిన కలెక్షన్స్‌ను టీమ్ తాజాగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.8.10 కోట్ల గ్రాస్ వసూలు చేసిందని వెల్లడించింది. తమ చిత్రాన్ని ఆదరిస్తోన్న ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పింది.

## నయన కలలు నిజమవుతాయా?

ఒక చిన్న ఇల్లు.. ప్రేమించే భర్త.. అమ్మా అంటూ ఆప్యాయంగా పిలిచే పిల్లలు.. ప్రతి స్త్రీ తన జీవితంలో కోరుకునేది ఇదే కదా! ఇలాంటి ఓ సాధారణ జీవితం తనకీ కావాలని ఆరాటపడుతుంది నయనతార మరి ఆమె కలలు నిజమవుతాయా? లేక సుదూర కలలుగానే మిగిలిపోతాయా? అనేది తెలుసుకోవాలంటే ‘టెస్ట్’ చూడాల్సిందే.



విలక్షణ నటుడు ఆర్.మాధవన్, నయనతార, సిద్ధార్థ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఎస్. శశికాంత్ దర్శకుడు. ఈ సినిమా వచ్చే నెల 4న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలో నయన.. కుముధ అనే పాత్రలో కనిపించనున్నట్లు తెలుపుతూ వీడియోను విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో ఓ ఉపాధ్యాయురాలిగా.. మరోవైపు అమ్మా అనే పిలుపు కోసం ఆరాటపడుతున్న తల్లిగా కనిపిస్తుంది నయన. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. “కుముధ బలం.. తన ఇల్లు, కుటుంబం, ప్రేమ. కానీ జీవితం ఆమెకు ఊహించని పరీక్ష పెడుతుంది. దాని కోసం ఆమె పోరాడే విధానం మిమ్మల్ని భావోద్వేగానికి గురిచేస్తుంది. నిజంగా ఇలాంటి పాత్రలో నటించడం సంతోషంగా ఉంద”ని చెప్పుకొచ్చింది.

# వెజిటబుల్ వయాగ్రాలా 'బీట్‌రూట్'?



బీట్‌రూట్.. వెజిటబుల్ వయాగ్రాలా పని చేస్తుందని నెట్టింట ప్రచారం జరుగుతున్నది. స్త్రీ, పురుషుల లైంగిక సామర్థ్యాన్ని ఇది పెంపొందిస్తుందన్న వార్త వైరల్ కావడంతో ఆస్ట్రేలియా సూపర్ మార్కెట్లలో బీట్‌రూట్ కొరత ఏర్పడిందట. యూకేలో టీవీ డాక్టర్ మేఖెల్ మోస్లా బీట్‌రూట్ వయాగ్రాలా పనిచేస్తుందని చెప్పాడంటూ ఓ వార్త వైరల్‌గా మారింది.

వాస్తవం: బీట్‌రూట్ వయాగ్రాలా పనిచేస్తుందని డాక్టర్ మోస్లా చెప్పినట్లు కానీ, శాస్త్రీయంగా ఆ విషయం రుజువైనట్లు కానీ ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. బీట్‌రూట్‌లో విటమిన్ బీ, సీ, మినరల్స్, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. రక్త ప్రసరణకు ఇవి బాగా దోహదపడతాయి. బీట్‌రూట్ కామోద్దీపనగా పనిచేస్తుందని రోమన్లు నమ్ముతారు. అక్కడ వారు అందుకోసమే బీట్‌రూట్ రసాన్ని సేవిస్తారట. అయితే మనం బీట్‌రూట్ తిన్నప్పుడు, బ్యాక్టీరియా, ఎంజైమ్‌లతో కూడిన రసాయన ప్రతి చర్యలు బీట్‌రూట్‌లోని నైట్రేట్‌ను నైట్రేట్‌గా, తర్వాత నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుస్తాయి. నైట్రిక్ ఆక్సైడ్ రక్తనాళాలను విస్తరించి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఇది లైంగిక సామర్థ్యంపై సానుకూల ప్రభావం చూపొచ్చు.

# ఈ డ్రింక్‌తో రోజు ప్రారంభిస్తే రోజంతా ఉత్సాహం, ఉత్తేజం




: మనం రోజును ఎలా ప్రారంభించామనే దానిపై మిగిలిన రోజంతా మనం ఎంత ఉత్సాహంగా, ఉత్తేజంగా ఉండగలమనేది ఆధారపడి ఉంటుంది. ఈ నిబంధన అందరికీ వర్తించినా ఆరోగ్యకర జీవనశైలిని అనుసరించే వారు ఈ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. రాత్రంతా విశ్రాంతి తీసుకున్న అనంతరం రోజంతా మన పనులు చేసుకునేందుకు మన శరీరానికి అత్యవసర విటమిన్లు, పోషకాలు అవసరం.

దీనికోసం ఉదయాన్నే నిర్ధిష్ట ఆహారాలు, పానీయాలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ జాబితాలో ఉండాల్సిన అద్భుతమైన పానీయం ఎండు ద్రాక్ష నీరు. ఈ అద్భుత పానీయం పలు ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. రోజూ కిస్‌మిస్‌లు నానబెట్టిన నీరు తాగితే రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా గడపవచ్చని అంటున్నారు.

ఎండు ద్రాక్ష నీరు తాగడం ద్వారా గ్యాస్, కడుపుబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను నివారించవచ్చు. జీర్ణశక్తి సాఫీగా సాగేందుకు ఈ పానీయం ఉపకరిస్తుంది. చర్మ సంరక్షణకూ ఈ పానీయం పనిచేస్తుందని అంటున్నారు. విటమిన్ ఏ, సీ పుష్కలంగా ఉండటంతో ఎండు ద్రాక్ష నీరు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఎండు ద్రాక్ష నీటితో ఆరోగ్య ప్రయోజనాలు పరిశీలిస్తే..

# ఈ జాగ్రత్తలు పాటిస్తే వేసవిని ఆరోగ్యంగా దాటేయొచ్చు



వేసవికాలం మొదలైందో లేదో రాష్ట్రంలో రికార్డు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రానున్న రోజుల్లో భానుడి భగభగలు మరింత హెచ్చుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మండే ఎండలంటే అందరికీ భయమే! ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రతల వల్ల వృద్ధులకు ప్రమాదం పొంచి ఉన్నది.

వయసు పైబడటంతో వారి శరీరంలో వేడిని నియంత్రించే సామర్థ్యం క్రమంగా తగ్గుతుంది. దీంతో వాళ్లు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అంతమాత్రాన ఆందోళన చెందాల్సిన పనిలేదు. సరైన జాగ్రత్తలు పాటిస్తే ఈ వేసవిని ఆరోగ్యంగా దాటేయొచ్చు.

వేడి వాతావరణంలో శరీరంలో తగినంత నీటి శాతం ఉండేలా చూసుకోవాలి. దాహంగా అనిపించకపోయినా, తరచూ ద్రవాహారం తీసుకోవడం తప్పనిసరి. కాఫీలు తగ్గించాలి. మద్యపానానికి దూరంగా ఉండాలి. ఇవి నిర్జలీకరణానికి కారణం అవుతాయి.

వృద్ధుల్లో%ా% ముఖ్యంగా గుండె, మూత్రపిండాల వ్యాధులు ఉన్నవారు, నీటిని పరిమితంగా తీసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నవారు.. వేసవిలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి. మధ్యాహ్న సమయాల్లో ఇంటిపట్టున ఉండటం మంచిది. అత్యవసరమై బయటికి వెళ్లాల్సి వస్తే.. గాలి తగిలేలా వదులు దుస్తులు ధరించాలి, గొడుగు నీడన నడవాలి.

మధ్యాహ్నం ఏసీ, కూలర్ వాడటం మంచిది. అవకాశం లేనివాళ్లు గదిలో ఫ్యాన్‌గాలి ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలి. తడి టవల్ వాడటం వల్ల.. ఫ్యాన్ నుంచి వచ్చే వేడిగాలి కొంత చల్లబడుతుంది.

బయటికి వెళ్లినప్పుడు వదులుగా ఉండే, లేత రంగు దుస్తులను ధరించాలి. వెడల్పు అంచులతో ఉన్న టోపీలు పెట్టుకుంటే.. ఎండ నుంచి రక్షణ లభిస్తుంది.

కొన్ని ఔషధాలు శరీరం ఉష్ణోగ్రతను నియంత్రించే సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి. వైద్యుడిని కలిసి మీ ప్రిస్క్రిప్షన్‌లో అలాంటి మందులు ఏమైనా ఉంటే, వాటి ప్రభావం గురించి తెలుసుకోండి.

మీ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు, వడగాలుల తీవ్రత గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోండి. తగు జాగ్రత్తలు తీసుకోండి.

ఆహారం విషయంలోనూ నిపుణుల సలహాలు పాటించాలి. మసాలాలు ఉండే పదార్థాలు తగ్గించడం చాలా అవసరం.

వడదెబ్బకు గురైనట్టు అనిపించినా, ఒంట్లో కలవరపాటుగా ఉన్నా వెంటనే వైద్యుడిని సంప్రదించడం మర్చిపోవద్దు.

# ఫ్రూట్ VS ఫ్రూట్ జ్యూస్ .. ఆరోగ్యానికి ఏది మేలు చేస్తుందంటే..!



: పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయని చెబుతుంటారు. అయితే అదే పనిగా ఫ్రూట్ జ్యూస్ తీసుకోవడం ఆరోగ్యానికి అంత మంచిది కాదని పోషకాహార నిపుణులు పేర్కొంటున్నారు. పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుందని అయితే పండ్ల రసాల్లో ఫైబర్ చాలావరకూ కోల్పోతామని చెబుతున్నారు.

తాజా పండ్ల రసం తీసుకోవడం, పండును పూర్తిగా తీసుకోవడం వేర్వేరు ఫలితాలు ఇస్తాయని ప్రముఖ క్లినికల్ న్యూట్రిషనిస్ట్ డాక్టర్ సంగీతా తివారీ వివరించారు. ఫైబర్ లేకపోవడంతో ఫ్రూట్ జ్యూస్ త్వరగా బ్లడ్ షుగర్ లెవెల్స్ పెరిగేందుకు కారణమవుతుంది. పండ్ల కంటే పండ్ల రసాల్లో అధిక క్యాలరీలుండటంతో పాటు చక్కెర అధికంగా ఉంటుంది.

పండ్లలో విటమిన్స్, మినరల్స్, యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. అయితే పండ్ల రసాల్లో కొన్ని పోషకాలు ముఖ్యంగా విటమిన్ సీ వంటివి జ్యూస్ తయారుచేసే ప్రక్రియలో కోల్పోతామని సంగీతా తివారీ తెలిపారు. పండ్ల రసాలతో పోలిస్తే పండ్లలో ఉండే ఫైబర్ కడుపు నిండిన భావన కలిగించి అధికంగా ఆహారం తీసుకోవడాన్ని నిరోధించడంతో పాటు మలబద్ధకం నివారించి జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేస్తుంది.

# ఎముకలు దృఢంగా ఉండాలంటే..!



బాల్యం నుంచి వృద్ధాప్యం వరకూ ఆరోగ్యంగా చలాకీగా ఉండాలంటే దృఢమైన, ఆరోగ్యకర ఎముకలు అవసరం. ఎముక పుష్టిని కాపాడుకోవడానికి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. విటమిన్లు, మినరల్స్‌తో కూడిన సమతులాహారం తీసుకోవాలి. ఎముకలు దెబ్బతినకుండా ఉండేందుకు 50 ఏండ్ల వయసు నుంచి తరచూ బోన్ డెన్సిటీ పరీక్షలు చేయించుకోవాలి.

ఊబకాయం ఎముకలు, కీళ్లపై ఒత్తిడి పెంచడంతో బరువు అదుపులో ఉండేలా చూసుకోవాలి. సమతులాహారంతో పాటు నిత్యం వ్యాయామం చేస్తూ బరువు పెరగకుండా చూసుకోవాలి. ఇక ఆరోగ్యకర ఎముకల వృద్ధికి క్యాల్షియం అధికంగా ఉండే డైరీ ఉత్పత్తుల (పాలు, పెరుగు, వెన్న)ను తీసుకోవాలి.

వీటితో పాటు ఆకు కూరలు, కూరగాయలు, పోర్టిఫైడ్ సిరిల్స్, తోఫు, బాదం వంటి ఆహార పదార్ధాలను ఆహారంలో భాగం చేసుకోవాలి. శరీరానికి తగినంత సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. ఎముకల ఆరోగ్యానికి ఈ సూచనలు పాటిస్తే మేలు..

# చిన్నపాపకు ఈ టెస్టులు, స్కాన్లు చేయించడం అవసరమా?



మా పాపకు ఆర్నెల్లు. జ్వరంగా ఉందంటే పీడియాట్రిషన్ దగ్గరకు తీసుకెళ్లాం. జలుబు, దగ్గు లాంటివేం లేవు. పరీక్షలు చేస్తే యూరిన్‌లో ఇన్ఫెక్షన్ ఉందని తెలిసింది. యాంటిబయాటిక్స్ ఇస్తే జ్వరం తగ్గింది. అయినా కూడా ఇంకా వేరే టెస్టులు, స్కాన్‌లు చేయాలని వైద్యులు సూచించారు. చిన్నపాపకు ఈ టెస్టులు, స్కాన్లు చేయించడం అవసరమా? సలహా ఇవ్వండి.

%మీరు చెప్పిన వివరాల ప్రకారం మీ పాపకు యూరినల్ ఇన్ఫెక్షన్ ఉన్నట్టు తెలుస్తున్నది. మామూలుగా జలుబు, దగ్గుతో జ్వరం ఉన్నట్లయితే వాటికి సంబంధించిన వైరస్ కారణంగా భావించొచ్చు. కానీ, జలుబు లేకుండా జ్వరం వస్తే యూరిన్ ఇన్ఫెక్షన్ కావొచ్చని అనుమానిస్తారు. అటువంటి సమయంలోనే మీ వైద్యుడు యూరిన్ టెస్టులు చేయించారు.

యూరిన్ ఇన్ఫెక్షన్ నిర్ధారణ అయ్యింది. అది మూత్రాశయానికే పరిమితమయ్యిందా? లేక మూత్రపిండాల వరకు పాకిందా? అనే విషయం తెలుసుకునేందుకు అల్ట్రాసౌండ్ స్కాన్ చేస్తారు. అంతేకాకుండా మూత్రనాళాలు, మూత్రపిండాలు, మూత్రాశయంలో ఏమైనా పుట్టుకతోనే నిర్మాణపరమైన లోపాలేమైనా ఉన్నాయేమో పరిశీలిస్తారు. ఇంకా ఎంసీయూజీ (మైక్చురేటింగ్ సిస్టోయూరెథ్రోగ్రామ్) చేయడం కూడా చాలా ముఖ్యం. ఎందుకంటే ఒకవేళ మూత్రపిండాల్లో తయారైన మూత్రం మూత్రనాళాల ద్వారా మూత్రాశయంలోకి చేరుతుంది.

మూత్రాశయం నుంచి మూత్రం తిరిగి మూత్రనాళాల్లోకి రాకూడదు. అలా రావడం వల్ల తరుచూ ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి. అందుకే టెస్టులు చేస్తారు. ఇన్ఫెక్షన్ ప్రభావం ఏ మేరకు ఉంటుందో తెలుసుకునేందుకు డీఎంఎస్ఏ (డైమెర్‌క్యాప్టో సక్సినిక్ యాసిడ్) స్కాన్ చేస్తారు. దీనిద్వారా కిడ్నీల్లో స్కార్ ఏమైనా ఏర్పడిందా? అని తెలుసుకునేందుకు కూడా టెస్టులు చేయిస్తారు. కాబట్టి ఈ టెస్టులన్నీ చేయించడం మంచిది.

# ఈ కూరగాయలతో ఇన్‌ఫ్లమేషన్‌కు చెక్

శరీరంలో ఇన్‌ఫ్లేమేషన్ (మంట, వాపు ప్రక్రియ)ను నివారించే ఆహారాలను తీసుకోవడంపై అవగాహన పెరుగుతోంది. మనం తీసుకునే ఆహారం ఇన్‌ఫ్లమేషన్‌పై పెను ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా ఐదు కూరగాయలు మన శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించేందుకు సాయపడతాయి. ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే కూరగాయల్లో ముందుగా బెల్‌పెప్పర్స్ ముందువరసలో నిలుస్తాయి.బెల్‌పెప్పర్స్‌లో విటమిన్ ఏ, విటమిన్ సీతో పాటు యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా లభిస్తాయి. క్యాప్సికంగా కూడా పిలిచే బెల్‌పెప్పర్స్ శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి డీజనరేటివ్ వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.

# గుండె ఆరోగ్యం కోసం రోజుకు ఎంత సాల్ట్ తీసుకోవాలంటే..!

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా హృద్రోగాలు అత్యధిక మరణాలకు కారణమవుతున్నాయి. గత కొన్నేండ్లుగా యువతతో పాటు పెద్దల్లో హృద్రోగాలు గణనీయంగా పెరగడం ఆందోళన రేకెత్తిస్తోంది. శారీరక వ్యాయామం లేకపోవడం, ప్రాసెస్డ్ ఆహారపదార్థాలు అధికంగా తీసుకోవడం, పొగతాగడం, అధిక బరువు, మధుమేహం, అధిక రక్తపోటు వంటివి గుండె జబ్బుల ముప్పును పెంచుతున్నాయి.



మనం తీసుకునే ఆహారం కూడా గుండెపై పలురకాలుగా పెను ప్రభావం చూపుతుంది. రోజూ అధికంగా ఉప్పు వాడకం గుండెపై ప్రభావం చూపడంతో పాటు ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తుంది. శరీరం విధులు సక్రమంగా నిర్వర్తించేందుకు సాల్ట్‌లో ఉండే సోడియం కీలకమైన మినరల్ కాగా, దీన్ని అధికంగా తీసుకుంటే బీపీ, బరువు పెరగడంతో పాటు కడుపుబ్బరం, వాపు వంటి అనారోగ్యాలకు దారితీస్తుంది. ఇది గుండె, కిడ్నీల పనితీరునూ దెబ్బతీస్తుంది. రోజుకు 2300 మిల్లీగ్రాములు అంటే 5 గ్రాములకు మించి ఉప్పు వాడకూడదని అమెరికన్ హెల్త్ అసోసియేషన్ సూచిస్తోంది.

ఇక బీపీతో బాధపడేవారు రోజుకు 1500 మిల్లీగ్రాములు మించి సోడియం తీసుకోకూడదు. అంటే రక్తపోటు బాధితులు రోజుకు ఒక టీస్పూన్ కంటే తక్కువ సాల్ట్‌ను తీసుకోవాలి. సాల్ట్‌ను తగ్గించుకోవాలంటే సోడియం తక్కువగా ఉన్న ఆహారపదార్థాలను తీసుకోవాలి. ఆహారపదార్థాలపై లేబుల్స్‌ను పరిశీలించి సోడియం తక్కువగా ఉన్న పదార్థాలను ఎంపిక చేసుకోవాలి. పొటాషియం అధికంగా ఉన్న ఆహార పదార్థాలను ఎంపిక చేసుకోవాలి. సోడియం ప్రభావాన్ని తగ్గించే పొటాషియంతో కూడిన అరటిపండ్లు, బంగాళాదుంపలు, పాలకూర, పుచ్చకాయ, బీట్రూట్ వంటివి ఆహారంలో భాగం చేసుకోవాలి.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy